www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సొంతింటి కల నిజం చేసుకుంటున్న
3,00,192 పేద కుటుంబాలకు
శుభాకాంక్షలు!

బుధవారం | 12-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 207 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి రా.10.59 తదుపరి నవమి, నక్షత్రం: ఆశ్లేష రా.6.35 తదుపరి మఖ, వర్జ్యం:ఉ.7.15-8.52, దుర్ముహూర్తం: ఉ.11.36-12.21, అమృతఘడియలు: సా.4.57-6.35, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.22, సూర్యాస్తమయం: 5.36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పకడ్బందీగా..

భద్రత నడుమ జట్ల ప్రాక్టీస్

- తొలి టెస్టు కోసం భారత్ సన్నాహకాలు
- 14 నుంచి దక్షిణాఫ్రికాతో మ్యాచ్



పిచ్‌ను పరిశీలిస్తున్న గిల్

కోల్‌కతా: దక్షిణాఫ్రికాతో ఈనెల 14 నుంచి జరిగే తొలి టెస్టు కోసం టీమిండియా తమ సన్నాహకాలను ఆరంభించింది. మంగళవారం స్థానిక ఈడెన్ గార్డెన్స్‌లో భారత ఆటగాళ్లు నెట్స్‌లో చెమటోడ్చారు. ఆప్షనల్ అయినప్పటికీ కెప్టెన్ గిల్‌తో పాటు జైస్వాల్, సాయి సుదర్శన్, బుమ్రా, జడేజా, సుందర్, నితీశ్ ప్రాక్టీస్‌లో కనిపించారు. ముందుగా కోచ్ గంభీర్, సహాయక కోచ్‌లు కోటక్, మోర్కెల్ పిచ్‌ను పరిశీలించారు. ఇక ఇటీవల పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో రాణించలేకపోయిన గిల్ గంటన్నర పాటు మైదానంలోనే గడిపి తన టెక్నిక్‌పై దృష్టి సారించాడు. అలాగే సెంటర్ వికెట్‌పై సాయి సుదర్శన్ ఎక్కువగా లెగ్ సైడ్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. దీంతో అతడిని వన్‌డౌన్‌లో ఆడించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో ఓపెనర్ జైస్వాల్‌కు స్పిన్నర్లు సుందర్, జడేజా బౌలింగ్ చేశారు. అయితే పేసర్ బుమ్రా మాత్రం ఎక్కువ సమయం నెట్స్‌లో గడపలేదు. మైదానంలోకి వచ్చాక అర్ధ గంట వామప్, తర్వాత కాసేపు బౌలింగ్ ప్రాక్టీస్ చేసి డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. ఈ సమయంలో తన కుడి మోకాలికి పట్టీ వేసుకుని కనిపించాడు.

టాస్ కోసం బంగారు నాణెం

భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే టెస్టు సిరీస్‌లను ఫ్రీడమ్ ట్రోఫీగా పిలుచుకుంటారు. ఈ నేపథ్యంలో తొలి టెస్టు కోసం బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) గాంధీ-నెల్సన్ మండేలా ముఖచిత్రాలతో కూడిన బంగారు నాణేన్ని తయారు చేయించింది. శుక్రవారం టాస్ వేసేందుకు ఈ నాణేన్నే వాడుతామని క్యాబ్ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తెలిపాడు.

పిచ్‌పై అసంతృప్తి

తొలి టెస్టు జరిగే ఈడెన్ పిచ్‌పై భారత జట్టు కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్ అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. మంగళవారం జరిగిన నెట్ సెషన్‌కు ముందు పిచ్‌ను పరిశీలించిన గంభీర్, క్యూరేటర్ సుజన్ ముఖర్జీతో చాలాసేపు మాట్లాడడం కనిపించింది. అతడితో పాటు కెప్టెన్ గిల్, సహాయక కోచ్‌లు సితాంశు కోటక్, మోర్నీ మోర్కెల్ కూడా ఉన్నారు. పిచ్ గోధుమ రంగులో ఉండగా అక్కడక్కడా గడ్డి కనిపించింది. మరోవైపు టీమ్ మేనేజ్‌మెంట్ తమకు టర్నింగ్ వికెట్ కావాలనేమీ అడగలేదని బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు గంగూలీ తేల్చాడు.

పోలీసుల పర్యవేక్షణలో..

ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో తొలి టెస్టు వేదిక ఈడెన్ గార్డెన్స్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అలాగే కోల్‌కతాలోనే ఉన్న భారత్-దక్షిణాఫ్రికా ఆటగాళ్లకు స్థానిక పోలీసులు పకడ్బందీగా రక్షణ ఏర్పాట్లు చేశారు. హోటల్ నుంచి స్టేడియానికి వెళ్లే సమయంలో..అలాగే మ్యాచ్ జరిగే సందర్భంలోనూ నిరంతరం వీరి సెక్యూరిటీని పర్యవేక్షించనున్నారు. అటు మంగళవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్ కూడా పోలీసుల భద్రత మధ్యే సాగింది. కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మ ఈడెన్ గార్డెన్స్‌లో ఏర్పాట్లను తనిఖీ చేశారు.



రబాడ

స్పిన్‌పై సఫారీల దృష్టి

భారత్‌తో పాటు దక్షిణాఫ్రికా ఆటగాళ్లు కూడా మంగళవారం ప్రాక్టీస్‌ను ఆరంభించారు. ఇటీవలే పాక్‌తో టెస్టు సిరీస్‌ను 1-1తో డ్రాగా ముగించి భారత్‌కు వచ్చిన ఈ జట్టు ఆత్మవిశ్వాసంతో ఉంది. నెట్స్‌లో మొత్తం జట్టు ఆటగాళ్లంతా పాల్గొన్నారు. అయితే బ్యాటర్లు కెప్టెన్ బవుమా, మార్‌క్రమ్, రికెల్టన్, స్టబ్స్ స్పిన్‌ను దీటుగా ఎదుర్కోవడం పైనే దృష్టి సారించారు.



ఇషా-సమ్రాట్

ఇషా జోడీకి రజతం

వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్

కైరో: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఇషా సింగ్ జంట, ఒలింపియన్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ రజతాలు దక్కించుకొన్నారు. మంగళవారం జరిగిన 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఇషా-సమ్రాట్ రాణా జంట 10-16తో చైనాకు చెందిన కియాంగ్జిన్ యో-కైహు చేతిలో పరాజయం పాలయ్యారు. కొరియా ద్వయం ఇజిన్ హో-సుహియాన్ హోంగ్ కాంస్యం దక్కించుకొంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఇషా-సమ్రాట్ జోడీ 586 పాయింట్లతో టాప్ లేపింది. అయితే, సురుచి-శ్రవణ్ కుమార్ జంట 579 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించలేక పోయింది. కాగా, పురుషుల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో ఐశ్వరీ ప్రతాప్ 466.9 పాయింట్లతో రెండో స్థానంలో, నీరజ్ కుమార్ 432.6 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచారు. చైనా షూటర్ యుకిన్ లియు స్వర్ణం, ఫ్రాన్స్ ప్లేయర్ రొమెయిన్ కాంస్యం సాధించారు. అయితే, క్వాలిఫయింగ్ రౌండ్‌లో 597 పాయింట్లు సాధించిన ఐశ్వరీ ప్రపంచ రికార్డును సమం చేశాడు.

అర్జున్, హరి గేమ్‌లు డ్రా

పనాజీ: తెలుగు గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేసి అర్జున్, పెంటేల హరికృష్ణ, కార్తీక్ వెంకటరామన్ ఫిడే వరల్డ్‌కప్ నాలుగో రౌండ్ తొలి గేమ్‌ను డ్రా చేసుకున్నారు. వీరితో పాటు ప్రజ్ఞానంద కూడా ఓటమి అంచుల్లో నిలిచిన గేమ్‌ను కష్టపడి డ్రాగా ముగించాడు. మంగళవారం జరిగిన నాలుగో రౌండ్ తొలి గేమ్‌లో నల్లపావులతో బరిలోకి దిగిన రెండో సీడ్ అర్జున్ 20 ఎత్తులకే హంగేరి జీఎం పీటర్ లీకోతో తన గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. స్వీడెన్ జీఎం గ్రాండిలియస్‌తో తలపడిన హరికృష్ణ 32వ ఎత్తు వద్ద డ్రా చేసుకోగా, వియత్నాం జీఎం లి క్వాంగ్ లైమ్‌తో ఆడిన కార్తీక్ 36వ ఎత్తు దగ్గర డ్రాకు అంగీకరించాడు.

ఇండియా-బి కెప్టెన్ ఆరోన్


ముంబై: ముక్కోణపు సిరీస్‌లో భాగంగా అఫ్ఘానిస్థాన్ అండర్-19 జట్టుతో ఆడే ఇండియా-ఎ, బి జట్లను బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఇందులో ఇండియా-బి జట్టుకు హైదరాబాదీ ఆరోన్ జార్జ్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఈనెల 17 నుంచి 30 వరకు ఈ సిరీస్ జరగనుంది. ఈ రెండు జట్లలో కలిపి నలుగురు హైదరాబాద్ క్రికెటర్లకు చోటు లభించడం విశేషం. ఇండియా-ఎ జట్టుకు వాఫీ డైమండ్, అలంక్రిత్ రాపోలు, మొహమ్మద్ మాలిక్, ఇండియా-బి జట్టుకు ఆరోన్ జార్జ్ ఎంపికయ్యారు. ఏసీసీ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో ఆడుతున్న ఇండియా-ఎ జట్టులో సభ్యుడిగా ఉన్నందున వైభవ్ సూర్యవంశీని, రంజీ ట్రోఫీలో ఆడుతున్నందున ఆయుష్ మాత్రేను ఈ సిరీస్ పరిగణనలోనికి తీసుకోలేదు.

సెమీస్‌లో ధీరజ్, సురేఖ

ఆసియా ఆర్చరీ

ఢాకా: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ సెమీస్‌కు చేరుకొన్నారు. పురుషుల కాంపౌండ్ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లగా.. చికిత తానిపర్తికి క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. మంగళవారం జరిగిన పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో ధీరజ్ 6-5తో అమ్రిఖోన్ సడికోవ్ (ఉజ్బెకిస్థాన్)పై, రాహుల్ 6-2తో లిన్ జిన్ సంగ్ (చైనీస్ తైపీ)పై గెలిచి ముందంజ వేశారు. మహిళల్లో దీపిక కుమారి 7-3తో వరల్డ్ కప్ స్వర్ణ పతక విజేత లి గహ్యాన్ (కొరియా)కు షాకిచ్చింది. అంకిత భక్త్ 6-4తో జాంగ్ మిన్హె (జపాన్)పై, సంగీత 7-1తో జరీ రెహానె (ఇరాన్)పై గెలిచి ఫైనల్ ఫోర్‌కు చేరుకొన్నారు. కాగా, అంకిత, సంగీత, అన్షికల టీమ్ క్వార్టర్స్‌లోనే ఓడింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో సురేఖ 147-145తో ఓ యుహయున్ (కొరియా)పై, ప్రతీక ప్రదీప్ 148-146తో చికితపై గెలిచారు. కాగా, అభిషేక్ వర్మ, ప్రథమేష్, రాజేష్ జాదవ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు ఫైనల్‌కు చేరుకొంది. సెమీస్‌లో భారత్ షూటాఫ్‌లో థాయ్‌లాండ్‌పై గెలిచింది.

నగల్‌కు చైనా వీసా తిరస్కరణ



న్యూఢిల్లీ: భారత నెంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమీత్ నగల్‌కు ఊహించని షాక్ తలిగింది. చైనాలోని చెంగ్డూలో ఈ నెల 24 నుంచి జరగనున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆసియా-పసిఫిక్ వైల్డ్‌కార్డ్ ప్లే ఆఫ్ టోర్నీలో పాల్గొనేందుకు అతడికి వీసా లభించలేదు. తన వీసా దరఖాస్తును చైనా తిరస్కరించినట్టు నగల్ ఎక్స్‌లో పోస్టు చేశాడు. టాప్-100లో చోటు కోల్పోయిన సుమీత్.. ఈ టోర్నీలో నెగ్గితే వచ్చే ఏడాది జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు నేరుగా అర్హత సాధిస్తాడు. కాగా, తన వీసా ఎందుకు తిరస్కరణకు గురైందో సమాచారం లేదని నగల్ చెప్పాడు. చైనా సహా ఎన్నో దేశాల్లో జరిగిన టోర్నీల్లో పాల్గొన్నా.. తొలిసారి తనకు ఇలాంటి అనుభవం ఎదురైందని వాపోయాడు. వీలైనంత తొందరగా వీసా వచ్చేలా చొరవ తీసుకోవాలని చైనాలోని భారత దౌత్యకార్యాలయానికి విజ్ఞప్తి చేశాడు.

ఐర్లాండ్ 270/8

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఐర్లాండ్ బ్యాటర్లు తడబడ్డారు. మంగళవారం మొదలైన ఈ టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో ఐర్లాండ్ 8 వికెట్లకు 270 పరుగులు సాధించింది. పాల్ స్టిర్లింగ్ (60), కార్మికేల్ (59) అర్ధసెంచరీలతో రాణించారు. కాంఫెర్ (44), టక్కర్ (41), జోర్డాన్ నీల్ (30) ఫర్వాలేదనిపించారు. క్రీజులో మెక్‌కార్తి (21) ఉన్నాడు. స్పిన్నర్లు మెహిదీ హసన్‌కు మూడు, హసన్ మురాద్‌కు రెండు వికెట్లు దక్కాయి. అయితే ఫీల్డింగ్‌లో విఫలమైన బంగ్లా క్రికెటర్లు ఐదు క్యాచ్‌లను వదిలేయడం గమనార్హం.



వన్డే సిరీస్‌కు శ్రేయాస్ దూరం!

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరుగబోయే మూడు వన్డేల సిరీస్‌కు భారత బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ దూరమయ్యే అవకాశం ఉంది. ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనలో శ్రేయాస్ పక్కటెముకల గాయానికి గురయ్యాడు. దీంతో సిడ్నీలోని ఆస్పత్రిలోనే అతడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందించాల్సి వచ్చింది. ప్రస్తుతం అతను ఆస్ట్రేలియాలోనే ఉంటూ కోలుకుంటున్నాడు. దీంతో ఈనెల 30 నుంచి సఫారీలతో జరిగే వన్డే సిరీస్‌లో అయ్యర్‌ను ఆడించాలని బీసీసీఐ, సెలెక్టర్లు భావించడం లేదు. అతడు పూర్తిగా కోలుకుని మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాకే ఓ నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనలో ఉన్నారు.

హైదరాబాద్‌కు మరో డ్రా

రాజస్థాన్‌తో రంజీ

హైదరాబాద్: గ్రూప్-డిలో రాజస్థాన్‌తో రంజీ మ్యాచ్‌ను హైదరాబాద్ డ్రాగా ముగించింది. అయితే, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా హైదరాబాద్‌కు 3 పాయింట్లు, రాజస్థాన్‌కు ఓ పాయింట్ లభించాయి. హైదరాబాద్ నిర్దేశించిన 340 పరుగుల లక్ష్య ఛేదనలో ఆటకు నాలుగో, ఆఖరి రోజైన మంగళవారం రాజస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 207/3 స్కోరు చేసింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/7తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 244/9 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 364, రాజస్థాన్ 269 రన్స్ చేశాయి.

జమ్మూ సంచలనం

ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ సంచలనం సృష్టించింది. గత 65 ఏళ్లలో ఢిల్లీపై తొలిసారి నెగ్గింది. కమ్రాన్ ఇక్బాల్ (133 నాటౌట్) సెంచరీతో రాణించడంతో.. జమ్మూ 7 వికెట్లతో ఢిల్లీని చిత్తు చేసింది. 179 పరుగుల ఛేదనలో ఆటకు నాలుగో, ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 55/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూ 179/3 స్కోరు చేసి గెలిచింది. ఢిల్లీ 211, 277 స్కోర్లు చేయగా.. జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగులు సాధించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,26,280 ▲	1,15,750 ▲	1,70,000 ▲
విజయవాడ	1,28,000 ▲	1,20,000 ▲	1,59,200 ▲
విశాఖపట్నం	1,27,930 ▲	1,13,000 ▲	1,70,000 ▲
రాజమండ్రి	1,26,270 ▲	1,15,750 ▲	1,55,000 ▲
ప్రొద్దుటూరు	1,24,300 ▲	1,14,360 ▲	1,57,600 ▲
ముంబై	1,24,150 ▲	1,13,720 ▲	1,54,760 ▲

చైనాకు భారత జనరిక్ ఔషధాలు

నాట్కో, హెటెరో, రెడ్డీస్‌కీ అవకాశం

ఫలిస్తున్న ప్రభుత్వ ఒత్తిడి



బీజింగ్: ఇన్నాళ్లు భారత ఔషధ కంపెనీలకు ప్రవేశం నిరాకరించిన చైనా క్రమంగా నిబంధనలు సడలిస్తోంది. భారత ఔషధాలకు ముఖ్యంగా జనరిక్ ఔషధాలకు తలుపులు తెరుస్తోంది. అయితే ఈ అవకాశాన్ని భారత ఫార్మా కంపెనీలకు చెందిన చైనా అనుబంధ కంపెనీలకు మాత్రమే ప్రస్తుతం పరిమితం చేసింది. గత నెల చైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక టెండర్‌లో చైనాలోని సిప్లా, నాట్కో ఫార్మా, హెటెరో ల్యాబ్స్ అన్నోర ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ వంటి భారత ఔషధ కంపెనీల అనుబంధ సంస్థలు ప్రభుత్వ నిర్వహణలోని ఆస్పత్రులకు తమ జనరిక్ ఔషధాలను సరఫరా చేసే కాంట్రాక్టు దక్కించుకున్నాయి. ఇందులో భాగంగా సిప్లాతో పాటు హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే నాట్కో ఫార్మా, అన్నోర ఫార్మా, హెటెరో ల్యాబ్స్ వంటి ఏడు భారత ఫార్మా కంపెనీల అనుబంధ సంస్థలు మధుమేహ నియంత్రణకు వాడే 'డపాగ్లిఫ్లోజిన్' అనే జనరిక్ టాబ్లెట్లను 100 కోట్ల వరకు చైనాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేయబోతున్నాయి.

వీబీపీ పద్ధతిలో : చైనా ప్రభుత్వం వాల్యూమ్ బేస్డ్ ప్రొక్యూర్‌మెంట్ (వీబీపీ) పద్ధతిలో ఈ ఔషధాలను కొనుగోలు చేస్తోంది. ఈ పద్ధతిలో తక్కువ ధర కోట్ చేసి ఎంపికైన ఫార్మా కంపెనీలు చైనాలోని నిర్దేశిత రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు తమ జనరిక్ ఔషధాలను సరఫరా చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే అన్నోరా ఫార్మా, నాట్కో ఫార్మా కంపెనీల చైనా అనుబంధ కంపెనీలు కూడా ఈ బిడ్‌లో పాల్గొని ఆక్స్‌కార్బాజెపైన్, ఒలాపారిబ్ టాబ్లెట్లు సరఫరా చేసే కాంట్రాక్టు సంపాదించాయి. ఈ రెండు టాబ్లెట్లను మూర్ఛ వ్యాధి, కొన్ని రకాల కేన్సర్ చికిత్సలో ఉపయోగిస్తారు. చైనాలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ అనుబంధ సంస్థ కున్షన్ రోటం రెడ్డి ఫార్మాస్యూటికల్ కంపెనీ కూడా నాలుగు రకాల జనరిక్ ఔషధాలకు చైనాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేయనుంది. ఇన్ఫెక్షన్లు, ట్యూమర్లు, అలెర్జీల వంటి రుగ్మతల చికిత్సలో ఈ ఔషధాలను ఉపయోగిస్తారు.

ఫలిస్తున్న ఒత్తిడి: గత ఏడాది చైనా ఔషధ మార్కెట్ 25,237 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.22.37 లక్షల కోట్లు) నమోదైంది. ఇందులో బహుళజాతి కంపెనీలు, స్థానిక కంపెనీలదే హవా. దీనికి తోడు వీబీపీ పద్ధతిలో కొనే ఔషధాలకు చైనా ప్రభుత్వం అతి తక్కువ ధర నిర్ణయిస్తోంది. దీంతో ఇప్పటి వరకు భారత ఫార్మా కంపెనీలు చైనా మార్కెట్‌ను పెద్దగా పట్టించుకోలేదు. చైనా అనుసరిస్తున్న వాణిజ్యేతర రక్షణ విధానాలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. అయితే వీబీపీ పద్ధతిలో చైనా ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఔషధాలు కొనుగోలు చేయడం భారత ఫార్మా కంపెనీలను ఆకర్షిస్తోంది. ద్వైపాక్షిక వాణిజ్యంలో చైనాకు పెరిగిపోతున్న మిగులు కేంద్ర ప్రభుత్వాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో మీ ఫార్మా మార్కెట్‌ను మా కంపెనీలకు తెరుస్తారా...లేదా లేకపోతే మేము కూడా మీ కంపెనీలకు దడి కట్టాల్సి వస్తుందని కేంద్రప్రభుత్వం చైనాను హెచ్చరిస్తోంది. దీంతో చైనా తన దేశంలోని భారత ఫార్మా అనుబంధ కంపెనీలను మాత్రమే తన ప్రభుత్వ ఆస్పత్రులకు జనరిక్ ఔషధాలు సరఫరా చేసేందుకు పాక్షికంగా అనుమతించిందని భావిస్తున్నారు.

రూ.10,096 కోట్ల మార్కెట్

వీబీపీ పద్ధతిలో చైనా ప్రభుత్వం ఏడు రకాల జనరిక్ ఔషధాలను కొనుగోలు చేయనుంది. ఇందులో మధుమేహ నియంత్రణకు వాడే 'డపాగ్లిఫ్లోజిన్' జనరిక్ టాబ్లెట్ల మార్కెట్టే 114 కోట్ల డాలర్ల (సుమారు రూ.10,096 కోట్లు) వరకు ఉంది. ఇందులో గత ఏడాది 70 కోట్ల డాలర్ల విలువైన టాబ్లెట్లను చైనాలోని ప్రభుత్వ ఆస్పత్రులే కొనుగోలు చేశాయి.

టఫే కొత్త ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్

న్యూఢిల్లీ: భారత వ్యవసాయయంత్రాల తయారీ దిగ్గజం ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే) కొత్త తరం ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ 'ఈవీఎక్స్ 75'ను విడుదల చేసింది. జర్మనీలో జరుగుతున్న అగ్రిటెక్నికా-2025 ప్రదర్శనలో ఈ కొత్త మోడల్‌ను కంపెనీ ఆవిష్కరించింది. 75 హెచ్‌పీ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్, ఈయూ స్టేజ్-5 డీజిల్ ఇంజన్, 400 వోల్ట్ ఎలక్ట్రిక్ బ్యాటరీ సిస్టమ్‌తో రూపొందించినట్లు టఫే తెలిపింది. లిక్విడ్ కూల్డ్ హై-వోల్టేజ్ సిస్టమ్, 3-స్పీడ్ ట్రాన్స్‌మిషన్ (గరిష్ఠ వేగం గంటకి 40 కి.మీ), ఫుల్ హెచ్‌వీఏసీ క్యాబిన్, ఎలక్ట్రో-హైడ్రాలిక్ రియర్ లిఫ్ట్, ఇండిపెండెంట్ పీటీవో వంటి ఫీచర్లతో ఈ కొత్త ట్రాకర్ట్ వస్తున్నట్టు కంపెనీ వైస్ చైర్మన్ డా. లక్ష్మీ వేణు తెలిపారు.

కొత్త బిజినెస్ ప్రీమియంలో 12% వృద్ధి

కోల్‌కతా: జీవిత బీమా (లైఫ్ ఇన్సూరెన్స్) రంగం.. అక్టోబర్ నెలలోనూ గణనీయమైన వృద్ధిని సాధించింది. ఈ నెలలో దేశీయ బీమా సంస్థల కొత్త బిజినెస్ ప్రీమియం 12.1% పెరిగి రూ.34,007 కోట్లకు చేరిందని లైఫ్‌ఇన్సూరెన్స్ కౌన్సిల్, ఐఆర్‌డీఏఐ విడుదల చేసిన తాజా గణాంకాలను ఉటంకిస్తూ.. కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ఓ నివేదికలో వెల్లడించింది. వ్యక్తిగత విభాగం నుంచి వచ్చిన బలమైన డిమాండ్, నాన్-సింగిల్ పాలసీల విక్రయాల సహకారంతో ఈ వృద్ధి నమోదైందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్ అన్నారు. జీఎస్‌టీ తగ్గింపుతో జీవిత బీమా పరిశ్రమ వేగంగా పుంజుకుంటోందన్నారు.

పన్ను వసూళ్లు రూ.12.92 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు (ఈ నెల 10 నాటికి) నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 7% వృద్ధితో రూ.12.92 లక్షల కోట్లు దాటాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు పుంజుకోవడంతోపాటు రిఫండ్లు నెమ్మదించడం ఇందుకు దోహదపడింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.12.08 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మరిన్ని విషయాలు..

- ఈ ఏప్రిల్ 1- నవంబరు 10 మధ్యకాలంలో రిఫండ్ల జారీ వార్షికంగా 18% తగ్గి రూ.2.42 లక్షల కోట్లకు పరిమితమైంది. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.5.37 లక్షల కోట్లకు పెరిగాయి.
- వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు సహా కార్పొరేటేతర పన్ను నికర వసూళ్లు రూ.7.19 లక్షల కోట్లకు ఎగబాకాయి. 2024-25లో ఇదే కాలానికి కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.5.08 లక్షల కోట్లు, కార్పొరేటేతర పన్ను వసూళ్లు రూ.6.62 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) వసూళ్లు రూ.35,682 కోట్లుగా ఉన్నాయి. 2024-25లో ఇదే సమయానికి నమోదైన రూ.35,923 కోట్ల వసూళ్లతో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి.
- రిఫండ్లు మినహాయించకముందు, స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 2.5 శాతం వృద్ధితో రూ.15.35 లక్షల కోట్లకు చేరాయి. - 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2025-26లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు 12.7 శాతం పెరిగి రూ.25.20 లక్షల కోట్ల చేరుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో అంచనా వేసింది. అందులో ఎస్‌టీటీ వసూళ్లు రూ.78,000 కోట్లుగా ఉండవచ్చని అంచనా.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ రంగంలోకి అదానీ

దేశంలో అతిపెద్ద బీఈఎస్ఎస్ ప్రాజెక్టు నిర్మాణం

న్యూఢిల్లీ: బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు అదానీ గ్రూప్ మంగళవారం ప్రకటించింది. గుజరాత్‌లోని ఖావ్డాలో 1,126 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం; 3,530 మెగావాట్-హవర్ ఇంధన స్టోరేజీ సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ప్రాజెక్టును నిర్మించాలనుకుంటున్నట్లు తెలిపింది. దేశంలో ఇదే అతి పెద్ద బీఈఎస్ఎస్ ప్రాజెక్టు కానుంది. ప్రపంచంలోని అతి పెద్ద ప్రాజెక్టుల్లోనూ ఒకటిగా నిలవనుంది. 700కు పైగా బీఈఎస్ఎస్ కంటైనర్లను కలిగి ఉండనున్న ఈ ప్రాజెక్టు 2026 మార్చి నాటికి ప్రారంభం కావచ్చని అదానీ గ్రూప్ వెల్లడించింది. ప్రపంచంలోనే అతిపెద్ద రెన్యువల్ ఎనర్జీ ప్లాంట్ అయిన ఖావ్డా రెన్యువబుల్ ఎనర్జీ కాంప్లెక్స్‌లో భాగంగా ఉండనుందని ప్రకటనలో పేర్కొంది.

పునరుత్పాదక ఇంధనాన్ని మరింత నమ్మదగినదిగా మార్చడంతో పాటు బ్యాకప్ పవర్ కల్పించేందుకు, గ్రిడ్ స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు బ్యాటరీ స్టోరేజీ అవసరం. సోలార్, పవన విద్యుత్ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను నిక్షిప్తం చేసి, అవసరమైనప్పుడు వినియోగించుకునేందుకు బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది.

మరిన్ని అదానీ వ్యాపారాల లిస్టింగ్: అదానీ గ్రూప్ మరిన్ని వ్యాపారాలను లిస్ట్ చేయాలనుకుంటోంది. ఎయిర్‌పోర్ట్‌లు, రోడ్లు, మెటల్స్, డేటా సెంటర్ అనుబంధ విభాగాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిసింది. 2027-31 మధ్యకాలంలో వీటి లిస్టింగ్ జరగవచ్చని అంటున్నారు.

పడి లేచిన మార్కెట్

సెన్సెక్స్ 336 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో మంగళవారం సైతం లాభాలు కొనసాగాయి. సెన్సెక్స్ 335.97 పాయింట్ల లాభంతో 83,871.32 వద్ద ముగియగా, నిఫ్టీ 120.60 పాయింట్ల లాభంతో 25,694.95 వద్ద ముగిసింది. ఉదయం అమ్మకాలతో ఒక దశలో సెన్సెక్స్ 411.32 పాయింట్లు, నిఫ్టీ 125.1 పాయింట్ల వరకు నష్టపోయాయి. ఆ సమయంలో తక్కువ ధరలో లభిస్తున్న ఐటీ, సర్వీసెస్, టెలికం షేర్ల కోసం మదుపరులు ఎగబడడంతో సూచీలు లాభాల బాట పట్టాయి. మార్కెట్ లాభాల బాట పట్టడానికి ఐటీ, ఆటో, మెటల్, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లు ప్రధానంగా దోహదం చేశాయని నిపుణులంటున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	600
చిత్తూరు	633	విశాఖపట్నం	585
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	111
కరీంనగర్	107	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	110
కర్నూలు	107	నెల్లూరు	115
విశాఖపట్నం	108	అనంతపురం	115
గోదావరి	109		

వొడాఫోన్ ఐడియాకు భారీ ఊరట ప్యాకేజీ!

న్యూఢిల్లీ: లక్షల కోట్ల అప్పులు, వేల కోట్ల నష్టాలతో సతమతం అవుతున్న ప్రైవేట్ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియాకు త్వరలో భారీ ఊరట లభించే అవకాశం కనిపిస్తోంది. ఏజీఆర్ బకాయిలపై సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో కంపెనీ కోసం కేంద్ర ప్రభుత్వం ఊరట ప్యాకేజీ రూపకల్పనను ప్రారంభించినట్లు తెలిసింది. సవరించిన ఏజీఆర్ బకాయిలతోపాటు వడ్డీ, పెనాల్టీపైనా మినహాయింపులతో కలిపి సమగ్ర ప్యాకేజీని ప్రకటించే అవకాశాలున్నట్లు సమాచారం. ఈ మార్చి చివరినాటికి వొడాఫోన్ ఐడియా ఏజీఆర్ బకాయిలు రూ.83,400 కోట్లకు పెరిగాయి. కాగా, ఈ సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ నష్టం 19 క్వార్టర్ల కనిష్ఠ స్థాయి రూ.5,524 కోట్లకు తగ్గింది. ఆదాయం రూ.11,195 కోట్లకు చేరింది. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పూ) కూడా 8.7 శాతం వృద్ధితో రూ.180కి పెరిగింది. ఈ సెప్టెంబరు చివరినాటికి కంపెనీ మొత్తం రుణభారం రూ.2,02,951 కోట్లుగా నమోదైంది. కంపెనీ ఆర్థిక పనితీరు మెరుగుపడటంతోపాటు రిలీఫ్ ప్యాకేజీపై అంచనాలతో మంగళవారం వొడాఫోన్ ఐడియా షేరు 7.68% పెరిగి రూ.10.24కు చేరింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 12-11-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**







ఢిల్లీ ఘటనలో అనుమానితుడి తండ్రిని జమ్మూకశ్మీర్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు; ఢిల్లీలో బాధితుల రోదనలు

ఆత్మాహుతి దాడా.. అనూహ్య పేలుడా?

ఢిల్లీ బాంబు దాడిపై భిన్నాభిప్రాయాలు

దొరికిపోతానన్న భయంతో పేల్చాడంటున్న పోలీసులు

ఉద్దేశపూర్వకంగానే పేల్చి ఉండొచ్చని మరికొందరి వాదన

హరియాణాలోని ఫరీదాబాద్ కేంద్రంగా ఉగ్ర కుట్ర..

అల్ ఫలాహ్ యూనివర్సిటీలో ముగ్గురు వైద్యుల అరెస్టు

11 గంటలపాటు కారులోనే తిరిగిన ఉగ్రవాది

పేలుడుకు వాడిన కారే దర్యాప్తులో కీలకం

ఆ మహిళా డాక్టర్.. జైషే ఉగ్రవాద లీడర్!

అల్ ఫలాహ్ యూనివర్సిటీ రెసిడెంట్ డాక్టర్ షహీన్ వెనుక కీలక కోణం

భారత్‌లో జైషే మహమ్మద్ మహిళా విభాగం బాధ్యతలు ఆమెవే

న్యూఢిల్లీ, నవంబరు 11: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద సోమవారం సాయంత్రం జరిగిన కారుబాంబు పేలుడు ఆత్మాహుతి దాడా? కాదా? అన్నదానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఢిల్లీ పోలీసులు, ప్రభుత్వ వర్గాలు ఇది ఆత్మాహుతి దాడి కాదని చెబుతుండగా, మరి కొందరు మాత్రం ఉగ్రవాది ఆత్మాహుతి దాడికే పాల్పడ్డాడని పేర్కొంటున్నారు. ఈ ఉగ్రకుట్ర మొత్తం హరియాణాలోని ఫరీదాబాద్ కేంద్రంగానే జరిగినట్లు పోలీసులు తెలిపారు. కారు నడిపిన ఉమర్ నబీతోపాటు మరో ఇద్దరు అందులో ఉన్నట్లు మొదట వార్తలు వచ్చినప్పటికీ.. ఉమర్ నబీ ఒక్కడే కారులో వెళ్లాడని పోలీసులు ప్రకటించారు. ఈ కేసు దర్యాప్తును కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఎన్ఐఏకు

మిగతా 2వ పేజీలో...

సచివాలయాలను సరిదిద్దాలి!

సమర్థ వినియోగంతోనే సరైన ఫలితాలు

సరైన ప్రణాళిక లేకుండా జగన్ తెచ్చిన వ్యవస్థ

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

సంక్లిష్టతలు వీడక నేటికీ అదే అవస్థ

ఒకప్పుడు మండల వ్యవస్థ... ఆ తర్వాత సచివాలయ వ్యవస్థ! పాలన వికేంద్రీకరణ, ప్రజల వద్దకు పాలనను చేర్చడంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులివి! సచివాలయ 'వ్యవస్థ' మంచిదే కానీ... దానిని తీసుకొచ్చిన విధానం, ప్రణాళికా లోపంతో ఇదే అవస్థలా మారింది. ఉద్యోగాలు ఇచ్చారు.. జీతాలు చెల్లిస్తున్నారు! మరి... వీరిని సమర్థంగా ఉపయోగించుకుంటున్నారా? అన్నదే అసలు ప్రశ్న!

సచివాలయాల్లో పరిస్థితులు, లోటుపాట్లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక, పరిశీలనాత్మక కథనం...

సంస్కరణలు, సిబ్బంది హేతుబద్ధీకరణ కీలకం

కొన్నిచోట్ల ఎక్కువ.. కొన్నిచోట్ల కొరత



తూ.గో జిల్లా గోకవరంలో ఇదీ పరిస్థితి



కర్నూలు జిల్లా పత్తికొండలో సిబ్బంది కోసం ప్రజల పడిగాపులు

రీ గ్రూపింగ్ చేసినా మార్పు అంతంతే

ఏ, సీ గ్రూపు సచివాలయాల్లో ఖాళీలు

బీ గ్రూపు సచివాలయాల్లో డిమాండ్

సిబ్బందిలో పలువురు నిపుణులు, భారీగా ఉన్నత విద్యావంతులు

వారిని సరిగ్గా వినియోగించుకుంటే సత్ఫలితాలు సాధ్యమే

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, అమరావతి)

ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో సచివాలయాలు! మొత్తంగా రాష్ట్రంలో 15 వేల గ్రామ, వార్డు సచివాలయాలు! ఏకంగా 1.34 లక్షల మంది సిబ్బంది! ఇదంతా మా ఘనతే అని నాడు జగన్ సర్కారు గొప్పగా చెప్పుకొంది. కానీ... ఆయా శాఖల్లో ఉద్యోగుల నియామకం, విధుల కేటాయింపు, పని విభజన.. అంతా గందరగోళమే. జగన్ హయాంలో మొదలైన ఈ సంక్లిష్టత... ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ సచివాలయ వ్యవస్థను సంస్కరించడం ఎలా? ఉద్యోగులతో సమర్థంగా పనిచేయించుకుని

మిగతా 12వ పేజీలో...



అక్రమాస్తుల కేసులో.. 21న కోర్టుకు జగన్

హాజరు మినహాయింపును తీవ్రంగా వ్యతిరేకించిన సీబీఐ

కోర్టుకు రాకుండా తప్పించుకు తిరుగుతున్నారని కౌంటర్

దీంతో జగన్ మెమో ఉపసంహరణ

హాజరుకు 21వరకు గడువిచ్చిన కోర్టు

ఆరేళ్ల తర్వాత కోర్టు మెట్లెక్కనున్న వైనం

12 ఏళ్లుగా బెయిల్‌పైనే జగన్

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో బెయిల్‌పై ఉన్న మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఈ నెల 21న సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరు కానున్నారు. వ్యక్తిగత హాజరు మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన మెమోపై సీబీఐ మంగళవారం కౌంటర్ దాఖలు చేసింది. యూరప్ పర్యటన అనంతరం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని

మిగతా 11వ పేజీలో...

ప్రకాశం జిల్లా కనిగిరిలోని లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు



నాడు ఛీఛీ.. నేడు భలేభలే!

అప్పుడు పెట్టుబడిదారులను తరిమేశారు

ఇప్పుడు వారే బారులు తీరుతున్నారు: చంద్రబాబు

ఇంటికో పారిశ్రామికవేత్త.. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మా ఆలోచనలను అందిపుచ్చుకోండి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పిలుపు

ప్రకాశం జిల్లా లింగన్నపాలెం నుంచి 50 ఎంఎస్ఎంఈ పార్కులకు శ్రీకారం

868 ఎకరాల్లో రూ.873 కోట్లతో ప్రాజెక్టులు

రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 మెగా పారిశ్రామిక యూనిట్లు ప్రారంభం

మోదీ పాలన, పవన్ సహకారం, లోకేశ్ పట్టుదల.. నా నాయకత్వంతో అభివృద్ధి పరుగు

50 దేశాల నుంచి విశాఖ సదస్సుకు: సీఎం

ఒంగోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాడు జగన్ ప్రభుత్వం రాష్ట్రం నుంచి పెట్టుబడిదారులను తరిమివేసిందని, ఇబ్బందుల పాల్జేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. అప్పట్లో ఏపీ అంటే ఛీఛీ అనే వారని.. ఇప్పుడు భలేభలే అనే స్థితికి తెచ్చామన్నారు. అందువల్లనే

మిగతా 11వ పేజీలో...

పేదలకు సొంతింటి పండగ

రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్లలో నేడు సామూహిక గృహ ప్రవేశాలు 10

నిఠారీ వరుస హత్యల కేసు.. 12

సురేందర్ కోలీ నిర్దోషి

వేరే కేసులు లేకపోతే విడిచిపెట్టండి

20 ఏళ్ల నాటి కేసులో సుప్రీం తీర్పు

నోయిడాలో 8 మంది పిల్లల పుర్రెలు బయటపడటంతో అప్పట్లో కలకలం

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ 10

ఆరుగురు మావోయిస్టుల మృతి..

వారిలో ముగ్గురు మహిళలు

మృతుల్లో ఇంద్రావతి నేషనల్ పార్కు ఏరియా కమిటీ ఇన్‌చార్జి బుచ్చన్న

తప్పించుకున్న మద్దూరు ఏరియా కమిటీ కమాండర్ పాపారావు?

ఆయన భార్య ఊర్మిళ మృతి

గాయాలతో పట్టుబడిన కొందరు?

ఇక గజ గజ

రాష్ట్రంలో పెరిగిన చలి 3

ఏపీకీ మేనమామగా ఉంటా



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

రాష్ట్రం నం.1 అయ్యేందుకు సాయపడతా

మోదీ, బాబు, పవన్ జట్టు ఉంగరంలో పొదిగిన రత్నం వంటిది

వారి కలయికే ఆంధ్రాకు శ్రీరామరక్ష

బాబు విజనరీ నేత.. రేపటిపైనే ఆయన ఆలోచన

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంస

ఏడు చెరువు ప్రాజెక్టులకు రూ.20 లక్షల చొప్పున ప్రోత్సాహక బహుమతుల ప్రదానం 3

ఉదారంగా ఆదుకోండి

2,622 కోట్లు ఇవ్వండి

మొంథాపై కేంద్ర బృందానికి సీఎం వినతి 11

శ్రేణుల్లో అసంతృప్తి ఎందుకో తేల్చండి



టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్లకు లోకేశ్ ఆదేశం 11

గతంలో ఎప్పుడూ ఇన్ని పదవులు భర్తీ చేయలేదు

అయినా క్యాడర్‌లో ఎక్కడో అసంతృప్తి ఉంది

కార్యకర్తలకు, నేతలకు మధ్య దూరం పెరుగుతోంది

నెలకోసారి జిల్లా స్థాయిలో సమీక్షలు పెట్టండి

ఇకపై ప్రతినెలా మీ పనితీరును సమీక్షిస్తా

సమన్వయకర్తలతో యువనేత సుదీర్ఘ భేటీ

భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి చేరువయ్యాం


రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గించింది

ఈ నేపథ్యంలో మేం సుంకాలు తగ్గిస్తాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

విదేశీ విద్యార్థులు అమెరికా వస్తే మంచిదే

రాకుంటే కొన్ని విద్యాసంస్థలకు వ్యాపారాలు ఉండవని వ్యాఖ్య



న్యూయార్క్, నవంబరు 11: భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి చేరువ అయ్యామని, ఒప్పందాలపై ఉత్సాహంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అంతేకాదు, ఏదో ఒక దశలో భారత్‌పై విధించిన సుంకాలను కూడా తగ్గిస్తామని చెప్పారు. కాగా, భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలపై గడిచిన రెండు వారాల్లో ట్రంప్ ఈ విధంగా వ్యాఖ్యానించడం ఇది రెండోసారి. అయితే, ఒప్పందాలపై ట్రంప్ అతిశయోక్తి ప్రదర్శిస్తున్నారా?.. లేక నిజంగా ఇరు దేశాల మధ్య చర్చల్లో బలమైన పురోగతి కనిపించిందా?.. అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. "గతంలో ఉన్న ఒప్పందాలకు పూర్తి భిన్నంగా భారత్‌తో మేం ఒప్పందాలు చేసుకుంటున్నాం. నన్ను వారు

మిగతా 10వ పేజీలో...



ఓ పోలింగ్ బూత్‌లో బారులు తీరిన మహిళలు

బిహార్

మళ్లీ ఎన్డీయేదే!

నితీశ్-మోదీ జోడీకే ప్రజల పట్టం.. 130కి పైగా సీట్లు ఖాయం

వెల్లడించిన 9 ఎగ్జిట్‌పోల్స్.. ప్రతిపక్ష కూటమికి గరిష్ఠంగా 108

పీకే ప్రభావం శూన్యమే!.. రెండో దశలో 68% రికార్డు పోలింగ్

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బిహార్ అధికార పీఠం మళ్లీ ఎన్డీయేదేనని ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించాయి. మహాగఠ్‌బంధన్ (ఎంజీబీ)పై భారీ మెజారిటీతో అధికార కూటమి విజయం సాధిస్తుందని పేర్కొన్నాయి. ఇక తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన ప్రశాంత్ కిశోర్ పార్టీకి తీవ్ర నిరాశే మిగులుతుందని తేల్చాయి. బిహార్‌లో బీజేపీ, జేడీయూ

మిగతా 10వ పేజీలో...

జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌దే!

ఎగ్జిట్ పోల్స్ అంచనా

48.47% పోలింగ్..

2023 కంటే 1% అధికం 10

ఆ కల్తీ నెయ్యిని ఎలా అనుమతించారు?

శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తెలీదా?.. నెయ్యి కల్తీ జరిగిందని ఎప్పుడు గుర్తించారు?

ముందు, తర్వాత ఎన్ని ట్యాంకర్లను అనుమతించారు?.. ఒక్కో ట్యాంకర్‌కు ఎంత కమీషన్ ముట్టింది?

గతంలో పనిచేసినప్పుడూ ఇలాగే చేశారా?.. టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిపై సిట్ ప్రశ్నల వర్షం

ఉన్నత స్థాయి ఒత్తిళ్లతోనే సరఫరాను అనుమతించాల్సి వచ్చిందన్న ధర్మారెడ్డి 12

తన తప్పేమీ లేదని స్పష్టీకరణ.. వైవీ సుబ్బారెడ్డికీ నోటీసులు జారీ.. 14 లేదా 15న వస్తానని జవాబు



రహదారులపై రక్తపాతం!

రాష్ట్రంలో 3 రోడ్డు ప్రమాదాలు.. 9 మంది మృతి, ఆరుగురికి గాయాలు

నెల్లూరులో అదుపు తప్పి బైకులను ఢీకొన్న లారీ.. ముగ్గురు మృతి

కృష్ణాలో హైవేపై కారు బోల్తా.. నలుగురు స్నేహితుల దుర్మరణం

తిరుపతిలో కారుపైకి దూసుకొచ్చిన లారీ.. ఇద్దరు మృతి

హైదరాబాద్-బెజవాడ హైవేపై ప్రైవేటు బస్సు దగ్ధం.. డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రాణ నష్టం 10



నెల్లూరులో బైకులను ఢీకొట్టిన లారీ ఇదే

వారిని వదిలేదే లేదు!



- ఢిల్లీ పేలుడు ఘటన బాధ్యుల్ని న్యాయస్థానం ముందు నిలబెడతాం
- బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది: మోదీ

థింపు/ న్యూఢిల్లీ, నవంబరు 11: దేశ రాజధాని ఢిల్లీలో కారు పేలుడు ఘటనకు కారణమైన వారిని వదిలే ప్రసక్తే లేదని, బాధ్యులందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ కేసుపై విచారణ సంస్థలు ఆమూలాగ్రం దర్యాప్తు జరుపుతున్నాయన్నారు. భూటాన్ మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ 70వ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమానికి మోదీ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఢిల్లీ ఘటన నేపథ్యంలో భారమైన హృదయంతో తాను భూటాన్‌కు వచ్చానన్నారు. సోమవారం రాత్రంతా దర్యాప్తు సంస్థలతో మాట్లాడుతూనే ఉన్నానని తెలిపారు. పేలుడు ఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేసిందని, బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉందని ప్రధాని ఉద్ఘాటించారు. భారత్-భూటాన్ స్నేహ సంబంధాలను ప్రస్తావిస్తూ.. శతాబ్దాలుగా ఇరుదేశాలు గాఢమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక బంధాన్ని కలిగి ఉన్నాయని, అందువల్లే ముఖ్యమైన ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి తాను భారత్ నుంచి వచ్చానని మోదీ వెల్లడించారు. మాజీ రాజు జిగ్మే సింగ్యే హయాంలో భూటాన్ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య రాచరికంగా, ఆధునిక రాజ్యంగా ఎదిగిన పరిణామాన్ని మోదీ ప్రస్తావించారు. కాగా, ఢిల్లీ పేలుడు ఘటనలో మరణించిన వారికి సంతాపంగా భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్.. 'చాంగ్లిమెథాంగ్ స్టేడియం'లో వేలాదిమందితో ప్రార్థనా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ ఘటనతో సంబంధం ఉన్న ప్రతీ ఒక్క నేరస్తుణ్నీ వేటాడుతామని, ఈ మేరకు దర్యాప్తు సంస్థలకు ఆదేశాలు జారీ చేశానని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. సీనియర్ అధికారులతో మంగళవారం రెండుసార్లు సమీక్ష సమావేశాలు జరిపానని తెలిపారు.

అమిత్ షా రాజీనామా చేయాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, నవంబరు 11: ఢిల్లీలో సోమవారం సంభవించిన పేలుడు ఘటన పట్ల కేంద్రంలోని మోదీ సర్కారు వ్యవహరిస్తున్న తీరును ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. పేలుడు జరిగి 18 గంటలు దాటినా.. ఘటనపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడమేంటని కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జి పవన్ ఖేరా ప్రశ్నించారు. దేశ రాజధానిలో చోటుచేసుకున్న ఈ పేలుడుతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని, దీనిపై హోం మంత్రి, హోంశాఖ కార్యదర్శి గానీ, ఢిల్లీ పోలీస్ కమిషనర్ గానీ తక్షణమే స్పష్టత ఇవ్వాలని అన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం లేకపోయినా.. భిన్న కథనాలు రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ఢిల్లీ పేలుడు ఘటనకు నైతిక బాధ్యత వహించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని, పుల్వామా, పహల్గాం ఘటనల తరువాత కూడా ఉగ్రవాద హెచ్చరికలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. స్వతంత్ర భారతదేశంలో అమిత్ షా లాంటి అసమర్థ హోంమంత్రి ఇప్పటివరకు ఎవరూ లేరని కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే విమర్శించారు. భారత్‌కు విద్వేషాన్ని ప్రచారం చేసే మంత్రి కాకుండా సమర్థుడైన హోంమంత్రి కావాలని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా అన్నారు. ఈ విమర్శలను అధికార బీజేపీ తప్పుబట్టింది. ప్రతిపక్షాలు విషాదాన్ని కూడా రాజకీయం చేయాలని చూస్తున్నాయని ఆ పార్టీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ అన్నారు.

పేలుడుపై కేంద్రం వివరణ ఇవ్వాలి: సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుడుపై కేంద్రప్రభుత్వం దర్యాప్తు జరిపి, వివరణ ఇవ్వాలని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. మైసూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఎన్నికల సందర్భంలోనే పేలుడు ఎందుకు జరిగిందనే దానికి కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో బిహార్ ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి చేకూరే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. కాగా, ఈనెల 15న తాను ఢిల్లీకి వెళతానని, కాంగ్రెస్ అగ్రనేత కపిల్ సిబల్ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటానని సిద్దరామయ్య తెలిపారు. రాహుల్‌గాంధీని కలిసేందుకు సమయం కోరానని, అవకాశం లభిస్తే అధిష్ఠానంతో భేటీ అవుతానని, లేదంటే అదేరోజు వెనుదిరిగి వస్తానని చెప్పారు.

ఒక్కడి మృతితో ఆ ఇంట్లోని 8 మంది వీధిన..

- గుర్తుపట్టలేని స్థితిలో మాంసపు ముద్దలుగా మృతదేహాలు
- ఢిల్లీ పేలుడు విషాదంతో సర్వం కోల్పోయిన కుటుంబాలు

న్యూఢిల్లీ, నవంబరు 11: ఢిల్లీలోని ఎర్రకోటకు దగ్గర్లో రద్దీగా మెట్రో స్టేషన్ వద్ద సోమవారం రాత్రి సంభవించిన భారీ పేలుడు కొన్ని కుటుంబాల్లో పెను విషాదం నింపింది. ఘటనాస్థలికి 600 మీటర్ల దూరంలోని ఓ మెడికల్ షాపు యజమాని అమర్ కటారియా పేలుడు మూడు నిమిషాల ముందే షాపు నుంచి ఇంటికి బయలుదేరారు. పేలుడు తర్వాత అతడి ఆచూకీ తెలియలేదు. నాలుగేళ్ల క్రితమే అతడికి పెళ్లయింది. భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఆస్పత్రికి మార్చురీకి వెళ్లిన అమర్ తండ్రి.. ఏమాత్రం గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాలను చూస్తూ భుజానికి పచ్చబొట్లతో ఉన్న ఓ మృతదేహం వద్ద ఆగి బిగ్గరగా రోదించాడు. మృతుడి భుజంపై 'మామ్ మై ఫస్ట్ లవ్', డ్యాడ్ ఈజ్ మై స్ట్రెంత్, అండ్ క్రితి' అని రాసి ఉండటంతో అది తన కుమారుడిదేనని గుర్తించాడు. ఇక యూపీలోని షామ్లీ జిల్లాకు చెందిన 22 ఏళ్ల నౌమన్ అన్సారీ.. తన ఫ్యాన్సీ షాపులో సరుకులు కొనేందుకు వచ్చి దుర్మరణంపాలయ్యాడు. నౌమన్ ఒక్కడి సంపాదనతోనే అతడి కుటుంబం నడుస్తోంది. నౌమన్‌కు తోడుగా వచ్చిన అతడి బంధువు అమన్.. గాయాలతో బయటపడ్డాడు. ఢిల్లీ రోడ్డు రవాణా సంస్థలో కండక్టర్‌గా పనిచేస్తున్న యూపీలోని అమ్రోహా జిల్లాకు చెందిన 34 ఏళ్ల అశోక్ కుమార్, టాక్సీ డ్రైవర్ అయిన 22 ఏళ్ల పంకజ్ సాహిని కూడా పేలుడు ఘటనలో మృతిచెందారు. బంధువును కలిసేందుకు అశోక్ బైక్‌మీద మెట్రోస్టేషన్‌కు వెళ్లాడు అశోక్. మృతితో అతడి తల్లిదండ్రులు, భార్య, నలుగురు పిల్లలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సోదరుడు, సోదరి మొత్తంగా ఎనిమిది దిక్కులేనివారయ్యారు. కుటుంబాన్ని పోషించుకోవడానికి పంకజ్ మూడేళ్లుగా టాక్సీ తోలుతున్నాడని, పేలుడు తీవ్రతకు అతడి వెనుకవైపు తల ఛిద్రమైందని.. అతడి కారు ధ్వంసమైపోయిందని మృతుడి తండ్రి రోదిస్తూ చెప్పాడు. పేలుడు తర్వాత ఆ దగ్గర్లోని ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేసే దినేశ్ కుమార్‌కు అతడి తండ్రి, సోదరులు ఫోన్ చేసినా కాల్ వెళ్లలేదు. కొద్దిసేపటికి దినేశ్ ప్రాణాలతో లేడని వారికి తెలిసింది. భర్త మృతితో తాను సర్వం కల్పోయానని.. తన ముగ్గురు పిల్లలకు దిక్కెవరంటూ దినేశ్ భార్య రీనా కంటికీమంటికి ధారా రోదించింది. పేలుడులో మృతుల సంఖ్య 12కు పెరిగిందని.. 20 మందికిపైగా గాయపడ్డారని ఢిల్లీ పోలీసులు చెప్పారు. కొన్ని మృతదేహాలను గుర్తించాల్సి ఉంది.

'శబరిమల బంగారం కేసు'లో మరో అరెస్టు

- సిట్ అదుపులోకి టీడీబీ మాజీ అధ్యక్షుడు వాసు

తిరువనంతపురం, నవంబరు 11: శబరిమల అయ్యప్ప దేవాలయంలోని బంగారం అదృశ్యమైన కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) మాజీ అధ్యక్షుడు ఎన్. వాసును మంగళవారం అరెస్టు చేసినట్లు సిట్ వర్గాలు వెల్లడించాయి. టీడీబీ అధ్యక్షుడిగా నియమితుడయ్యే ముందు రెండుసార్లు బోర్డు కమిషనర్‌గా కూడా పనిచేసిన ఆయన్ను విచారణ అనంతరం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. కేరళ ప్రభుత్వంలోని అగ్రనేతలకు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన వాసును అరెస్టు చేయడం సంచలనాత్మకంగా మారింది. ఈ కేసులో సిట్ దర్యాప్తును కేరళ హైకోర్టు పర్యవేక్షిస్తోంది. శబరిమలలో గర్భాలయం తలుపులకు ఉన్న బంగారం మాయమైన కేసులో వాసు నిందితుడు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పోట్టితో పాటు ఇద్దరు సీనియర్ అధికారులు, ఒక రిటైర్డ్ అధికారిని సిట్ ఇప్పటికే అరెస్టు చేసింది.

ఆత్మాహుతి దాడా? అనూహ్య పేలుడా?

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించింది. యూఏపీఏ చట్టం కింద మంగళవారం ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాంబుపేలుడులో సోమవారం ఘటనా స్థలంలోనే 9 మంది మరణించగా, మంగళవారం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో మరో ముగ్గురు మరణించటంతో మృతుల సంఖ్య 12కు చేరింది. మృతుల్లో ఏడుగురిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఢిల్లీ సీఎం రేఖాగుప్త మంగళవారం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. తీవ్రంగా గాయపడ్డవారికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు.

అధికారుల గంటకో మాట..

కారు బాంబు పేలినప్పటి నుంచి దాడి తీరుపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొదట సిలిండర్ పేలుడు అని భావించిన పోలీసులు.. తర్వాత ఉగ్ర దాడి అని ప్రకటించారు. మంగళవారం ఆత్మాహుతి దాడి అని మొదట అనధికారికంగా మీడియాకు తెలిపిన ఢిల్లీ పోలీస్ వర్గాలు.. సాయంత్రానికి ఉగ్రవాదులు భయంతోనే బాంబును పొరపాటున పేల్చి ఉంటారని తెలిపాయి. తన సహచర ఉగ్రవాదులంతా పోలీసులకు పట్టుబడటంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఫరీదాబాద్ నుంచి పారిపోయి తిరుగుతున్న ఉమర్ నబీ.. బాంబును పొరపాటున పేల్చేసి ఉంటాడని పేర్కొన్నాయి. పేలిన బాంబు కూడా పూర్తిగా తయారైన ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ) కాదని తెలిపాయి. ఆత్మాహుతి దాడి జరిగి ఉంటే ఆ ప్రదేశంలో గుంత పడి ఉండేదని, కారు లక్ష్యంపైకే నేరుగా దూసుకుపోయి ఉండేదని అభిప్రాయపడ్డాయి. అయితే, ఆత్మాహుతి ప్రతిసారి ఒకేలా జరగాలని ఏమీ లేదని మరికొందరు వాదిస్తున్నారు.




దర్యాప్తులో కీలకంగా ఐ20 కారు..

బాంబుపేలుడుపై దర్యాప్తులో దాడికి ఉపయోగించిన ఐ20 కారు (హెచ్ఆర్26సీఈ7674) కీలకంగా మారింది. ఈ కారు సోమవారం ఉదయం ఫరీదాబాద్ నుంచే ఢిల్లీకి వచ్చినట్లు గుర్తించారు. ఈ కారు సోమవారం ఉదయం 7.30 గంటలకు ఫరీదాబాద్‌లోని ఏషియన్ హాస్పిటల్ ముందు నుంచి వెళ్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయి. ఉదయం 8.30 గంటల సమయంలో ఈ కారు బదర్పూర్ టోల్‌ప్లాజాను దాటి ఢిల్లీలోకి ప్రవేశించింది. ఆ తర్వాత ఢిల్లీ నగరంలో చాలాచోట్ల తిరిగిన కారు.. మధ్యాహ్నం 3.19 గంటల సమయంలో ఎర్రకోట సమీపంలోని పార్కింగ్ కాంప్లెక్స్ వద్దకు వచ్చి ఆగింది. అక్కడే దాదాపు మూడు గంటలపాటు ఉన్న తర్వాత సాయంత్రం 6.22 గంటలకు ఎర్రకోట వైపు వెళ్లిపోయింది. ఆ తర్వాత 24 నిమిషాలకు 6.52 గంటల సమయంలో పేలుడు సంభవించింది. ఈ కారు అక్టోబర్ 29వ తేదీన ఒక పెట్రోల్ బంక్ వద్ద ఉన్న పొల్యూషన్ చెక్ కేంద్రం వద్ద ఆగిన వీడియో కూడా బయటకు వచ్చింది. అదే రోజు ఈ కారును ఉమర్ నబీ కొనుగోలు చేయటం గమనార్హం. కారులో నుంచి ఉమర్ నబీతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు బయటకు దిగి అక్కడ ఓ వ్యక్తితో కొద్దిసేపు మాట్లాడి పొల్యూషన్ చెక్ చేయించుకొని, తిరిగి కారులో వెళ్లిపోయారు. కాగా, ఫరీదాబాద్ నుంచి బయలుదేరినప్పటి నుంచి బాంబు పేలేవరకు దాదాపు 11 గంటలపాటు ఉమర్, మరో ఇద్దరు కారులో నుంచి బయటకు దిగలేదని పోలీసులు తెలిపారు. మరోవైపు ఈ కారు మొదటి యజమాని సల్మాన్‌కు ఇంటిని అద్దెకు ఇచ్చిన దినేశ్ అనే వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

రోగినీ చంపేశాడు

కారు బాంబు పేలుడుకు కారణమైన ఉమర్ నబీ గతంలో జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ ఆసుపత్రిలో రెసిడెంట్ డాక్టర్‌గా ఉన్నప్పుడు ఓ రోగి మరణానికి కారణమయ్యాడని తాజాగా బయటపడింది. 2023లో నబీకి పై అధికారిగా ఉన్న రిటైర్డ్ డాక్టర్ జిలానీ రాంషో షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. ఆ తర్వాత అతడిని ప్రభుత్వం విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించారు. కాగా, ఉమర్ కుటుంబ సభ్యుల డీఎన్‌ఏతో కారుబాంబు పేలుడు ప్రదేశంలో సేకరించిన పలు శరీర భాగాల డీఎన్‌ఏ సరిపోలినట్లు పోలీసులు తెలిపారు. బాంబు దాడికి ముందు అతడు మూడు రోజుల ముందే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు వివరించారు.

లోకం తీరు



అల్ ఫలాహ్ వర్సిటీ కేంద్రంగా కుట్ర

ఢిల్లీకి 45 కిలోమీటర్ల దూరంలో హర్యానాలోని ఫరీదాబాద్ సమీపంలో ఉన్న అల్ ఫలాహ్ యూనివర్సిటీని ఉగ్రవాదులు తమ కుట్రకు కేంద్రంగా మలుచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు మంగళవారం యూనివర్సిటీలో విచారణ జరిపారు. అక్కడ పని చేస్తున్న ముగ్గురు వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. ముజమ్మిల్ యూనివర్సిటీ క్యాంపస్‌లోనే నివాసం ఉంటూ.. ఫరీదాబాద్‌లో వేర్వేరు చోట్ల రెండు ఇళ్లను అద్దెకు తీసుకొని 2,900 కిలోల పేలుడు పదార్థాలు, ఆయుధాలు నిల్వచేయగా.. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

అమ్మోనియం నైట్రేట్!

ఢిల్లీలో కారుపేలుడుకు వాడిన రసాయనం

- మొక్కలకు ఆక్సిజన్ అందించేందుకు వాడే ఎరువు
- పెట్రోలియం పదార్థాలతో కలిస్తే ప్రాణాంతకం



బాంబు పేలుడులో చనిపోయిన నౌమన్ అన్సారీ కుటుంబసభ్యులు

ఎర్రకోట వద్ద సోమవారం జరిగిన కారు పేలుడుకు వాడింది అమ్మోనియం నైట్రేట్ అని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. ఈ పేలుడుకు కొన్ని గంటల ముందు హరియాణాలో జమ్మూకశ్మీర్ పోలీసులు 350 కిలోల అమ్మోనియం నైట్రేట్ సహా 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలను పట్టుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఎర్రకోట వద్ద పేలుడుకూ దాన్నే వాడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఆర్డీఎక్స్‌కి దీనికి తేడా ఏమిటంటే.. ఆర్డీఎక్స్ అత్యంత శక్తిమంతమైన మిలటరీ గ్రేడ్ పేలుడు పదార్థం. దాని లభ్యత చాలా కష్టం. సైన్యానికి, లైసెన్స్ ఉన్న సంస్థలు, ప్రభుత్వం అనుమతించిన పరిశ్రమలకు మాత్రమే లభిస్తుంది. అదే అమ్మోనియం నైట్రేట్ అయితే.. అది ఒక సాధారణ కెమికల్ సాల్ట్. సహజంగా దానంతట అది ఒక పేలుడు పదార్థం కాదు. ఇది ఒక ఆక్సిడైజర్. అందుకే రైతులు మొక్కలకు ప్రాణవాయువు అందించడానికి దాన్ని ఎరువుగా వాడుతారు. ఆక్సిడైజర్ కాబట్టి.. ఇది కాలిపోవడానికి అవసరమైన ఆక్సిజన్‌ను కూడా అందిస్తుంది. ఢిల్లీలో పేలుడుకు దీన్ని అందుకే వాడుకున్నారు. పేలుడు ప్రారంభం కావడానికి ఫ్యూయల్ ఆయిల్‌ని (డీజిల్/పెట్రోల్/కిరోసిన్.. ఏదైనా కావొచ్చు) వాడుతారు. ఆ పేలుడు తీవ్రతను పెంచడానికి ఈ అమ్మోనియం నైట్రేట్ ఉపయోగపడిందన్న మాట. అయితే.. అమ్మోనియం నైట్రేట్ కూడా అంత సులువుగా ఎవరికి పడితే వారికి దొరకదు. దాని తయారీ, నిల్వ, వినియోగం అన్నిటికీ 'పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్' నుంచి అనుమతులు కావాలి.

తీవ్రతలో తేడాలు..

ఆర్డీఎక్స్‌కు, దీనికి ఉన్న మరొక ప్రధానమైన తేడా.. పేలుడు తీవ్రత. ఆర్డీఎక్స్ డిటొనేషన్ వేగం సెకనుకు 8700 మీటర్లు. అంటే.. పేలినప్పుడు షాక్ వేవ్ చాలా వేగంగా వ్యాపిస్తుంది. దాని రిలేటివ్ ఎఫెక్టివ్‌నెస్ (ఆర్ఈ) ఫ్యాక్టర్ దాదాపుగా 1.5 నుంచి 1.6 దాకా ఉంటుంది. అంటే ఒక కిలో ఆర్డీఎక్స్ పేలుడు తీవ్రత 1.5 కిలో టీఎన్‌టీ బలానికి సమానం. ఢిల్లీలో కారు పేలుడుకు ఉపయోగించిన ఏఎన్ఎఫ్‌వో (అమ్మోనియం నైట్రేట్+ఫ్యూయెల్ ఆయిల్) ఆర్ఈ ఫ్యాక్టర్ 0.75 మాత్రమే. ఆర్డీఎక్స్‌తో పోలిస్తే.. దీని పేలుడు తీవ్రత అందులో సగమే. అందుకే పేలుడుకు పెద్ద ఎత్తున వినియోగిస్తారు. ఉదాహరణకు.. 1995లో టిమోతీ మెక్వే అనే అమెరికన్ మాజీ సైనికుడు అమెరికాలోని ఒక్లహోమా నగరంలో ఒక ప్రభుత్వ కార్యాలయం ముందు 2000 కిలోల ఏఎన్ఎఫ్‌వో బాంబును పెద్ద ట్రక్కులో పెట్టి పేల్చేశాడు. ఆ పేలుడు ధాటికి 168 మంది మృతి చెందారు. అమెరికా చరిత్రలో అప్పటికి అదే అతిపెద్ద (దేశీయ) ఉగ్రదాడి. ఐదేళ్ల క్రితం లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఒక పెద్ద పేలుడు జరిగి 218 మంది మరణించారు గుర్తుందా? అప్పుడు అంత మంది చనిపోవడానికి ప్రధాన కారణం అమ్మోనియం నైట్రేటే. అమ్మోనియం నైట్రేట్ ఉన్న గిడ్డంగిలో అగ్ని ప్రమాదంతో భారీ పేలుళ్లు సంభవించాయి.

ఆ మహిళా డాక్టర్.. జైషే ఉగ్రవాద లీడర్!

అల్ ఫలాహ్ ప్రైవేటు యూనివర్సిటీ రెసిడెంట్ వైద్యురాలు షహీన్ వెనుక కీలక కోణం



షహీన్

- భారత్‌లో జైషే మహమ్మద్ మహిళా విభాగం బాధ్యతలు ఆమెవే..
- ఆయుధాలు దాచేందుకు ఆమె కారునే వినియోగించిన ఉగ్రవాది ముజమ్మిల్

న్యూఢిల్లీ, నవంబరు 11: ఫరీదాబాద్ ఉగ్రకుట్రలో అరెస్టయిన మహిళా వైద్యురాలు షహీన్ షాహీద్‌కు పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్‌తో సంబంధాలు ఉన్నట్టుగా బయటపడింది. జైషే మహమ్మద్ మహిళా విభాగం జమాతుల్ మొమినాత్ భారత విభాగానికి షహీన్ నేతృత్వం వహిస్తున్నట్టు వెల్లడైంది. ఆమెను అరెస్టు చేసిన అనంతరం అధికారులు చేపట్టిన దర్యాప్తులో కీలక అంశాలు బయటపడినట్టు తెలిసింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయాన్ని భారత వాయుసేన ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఆ దాడుల్లో కాందహార్ విమానం హైజాక్ సూత్రధారి యూసుఫ్ అజార్ సహా జైషే మహమ్మద్ అగ్ర నాయకత్వం తుడిచిపెట్టుకుపోయింది. ఈ క్రమంలోనే యూసుఫ్ అజార్ భార్య, జైషే వ్యవస్థాపకుడు మసూద్ అజార్ సోదరి అయిన సాదియా అజార్ నేతృత్వంలో 'జమాతుల్ మొమినాత్' పేరిట మహిళా విభాగాన్ని జైషే మహమ్మద్ ప్రారంభించింది. ఈ క్రమంలోనే దాని భారత విభాగం బాధ్యతలను వైద్యురాలు షహీన్‌కు అప్పగించినట్టు తెలిసింది.

ప్రైవేటు యూనివర్సిటీలో వైద్యురాలిగా..

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన షహీన్ హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉన్న అల్ ఫలాహ్ ప్రైవేటు యూనివర్సిటీలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన ముజమ్మిల్ కూడా వైద్యుడిగా పనిచేస్తున్నారు. శ్రీనగర్‌లో జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పోస్టర్లు వెలిసిన కేసులో ముజమ్మిల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే షహీన్‌కు ఉగ్రవాద లింకులు ఉన్నాయని, ఆయుధాలను దాచిపెట్టేందుకు ఆమె కారును వినియోగిస్తున్నారని గుర్తించారు. షహీన్‌ను అరెస్టు చేసి, ఆమె మారుతి స్విఫ్ట్ కారులో ఒక అసాల్ట్ రైఫిల్, పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ సందర్భంగా షహీన్‌కు 'జమాతుల్ మొమినాత్' భారత విభాగంలో షహీన్ కీలకంగా పనిచేస్తున్నారని, మహిళల రిక్రూట్‌మెంట్ చేపట్టారని పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా బాగా చదువుకున్న, వివిధ వృత్తుల్లో ఉన్న వారిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తేల్చారు. కాగా, షహీన్ ప్రవర్తన చిత్రంగా ఉండేదని, ఎవరితోనూ పెద్దగా మాట్లాడేది కాదని ఆమె పనిచేస్తున్న అల్ ఫలాహ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు చెప్పారు. "షహీన్ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండేది. ఒక్కసారి చెప్పాపెట్టకుండానే వెళ్లిపోయేది. చాలా మంది కాలేజీకి వచ్చి ఆమెను కలుస్తూ ఉండేవారు. ఒక్కోసారి ఆమె చిత్రంగా ప్రవర్తించేది. దీనిపై యాజమాన్యానికి పలుమార్లు ఫిర్యాదులు కూడా వెళ్లాయి" అని వెల్లడించారు. పోలీసుల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు.

మా అన్న నిరపరాధి

ఎవరో ట్రాప్ చేసి ఇరికించారు

- ఉగ్రవాది మొహియుద్దీన్ సోదరుడు ఒమర్ ఫారూఖీ ఆరోపణ
- గుజరాత్ ఏటీఎస్ పోలీసుల అదుపులో మొహియుద్దీన్



ఒమర్ ఫారూఖీ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/రాజేంద్రనగర్/శంషాబాద్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద ఆరోపణలతో గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేసిన హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ నిరపరాధి అని అతడి సోదరుడు ఒమర్ ఫారూఖీ తెలిపారు. చార్మినార్ రెహమానియా మదర్సాలో మౌలానాగా పనిచేస్తున్న ఫారూఖీ మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఎవరో కావాలనే తన అన్నను కుట్రలో ఇరికించారని ఆరోపించారు. 'మా అన్న ఎంతో మంచివాడు.. నిరపరాధి.. చైనాలో డాక్టర్ చదివాడు.. కొవిడ్ సమయంలో ఎంతో మందికి సహాయం చేశాడు. దేశానికి ద్రోహం తలపెట్టే వ్యక్తి కాదు.. ఎక్కడో ఏదో జరిగింది.. ఎవరో మా అన్నను ట్రాప్ చేసి ఇరికించారు.. ఉగ్రవాదిగా చిత్రీకరించారు' అని పేర్కొన్నారు. ఏటీఎస్ పోలీసులు ఆదివారం మొహియుద్దీన్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహైల్ మొహమ్మద్ సలీమ్‌లను బనస్కాంత జిల్లాలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు..

మీడియాతోపాటు ఎవరితోనూ మాట్లాడవద్దని ఏటీఎస్ పోలీసులు తమను ఆదేశించారని చెప్పిన ఫారూఖీ.. తర్వాత తమ కుటుంబ వివరాలను వెల్లడించారు. తమ కుటుంబం 20 సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలోని మెహిదీపట్నం, టోలిచౌకి, రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూ కాలనీలో నివాసం ఉందని చెప్పారు. ఫోర్ట్‌వ్యూ కాలనీలోని అసద్ మంజిల్‌లో నాలుగు సంవత్సరాలుగా ఉంటున్నట్లు తెలిపారు. 'మాది ఖమ్మం.. మా నాన్న దివంగత డాక్టర్ అబ్దుల్ ఖాదర్ జిలానీ. అమ్మ అస్రా తఫజ్జుల్. మేము ఆరుగురం సంతానం. డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ పెద్దవాడు. ఆయన 2007 నుంచి 2013 వరకు చైనాలో మెడిసిన్ చదివాడు. అనంతరం వివిధ ఆసుపత్రులలో ఉద్యోగం చేశాడు. కొవిడ్ సమయంలో ఎంతో మందికి వైద్యం అందించాడు. ఎవరైనా కష్టాల్లో ఉంటే తట్టుకోలేని మనస్తత్వం ఆయనది. 2021లో పెళ్లైంది. భార్యతో విడాకులూ అయ్యాయి. ఆ తర్వాత ఆయన అమెరికా వెళ్లి కొంత కాలం జాబ్ చేశాడు' అని వివరించారు.

టెలిగ్రాంలో ఉగ్ర సందేశాలు

అహ్మద్ మొహియుద్దీన్ హైదరాబాద్‌లో ఎక్కడెక్కడ రెక్కీ చేశాడనే అంశంపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఆముదం గింజల నుంచి ప్రాణాంతకమైన రెసిన్ విషపదార్థాన్ని తయారు చేసిన మొహియుద్దీన్, దానిని వాడటం కోసం కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకున్నాడని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. నగరంలోని మంచినీటి వ్యవస్థ, దేవాలయాల్లోని ప్రసాదాల్లో వాడే నీటిలో ఈ రెసిన్ కలపాలని మొహియుద్దీన్ కు ఆదేశాలు అందినట్లు భావిస్తున్నాయి. పాకిస్థాన్‌లోని మొహియుద్దీన్ హ్యాండ్లర్ అయిన అబూ ఖదీజా టెలిగ్రాం యాప్ ద్వారా సందేశాలు పంపాడని, ఇదే మాడ్యూల్‌కు చెందిన ఢిల్లీ పేలుడు అనుమానితులు కూడా సంభాషణలు జరిపారని దర్యాప్తు అధికారులు ఇప్పటికే గుర్తించారు. మొహియుద్దీన్ ఎక్కడెక్కడ తిరిగాడనే విషయాన్ని గుర్తించడానికి నిఘా బృందాలు సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నాయి. మొహియుద్దీన్ తన ఫోన్‌లో గూగుల్ లోకేషన్‌ను ఆఫ్ చేసుకున్నాడని, సహచరులతో టెలిగ్రాం యాప్ ద్వారానే మాట్లాడేవాడని గుర్తించారు. రెసిన్ తయారీకి కావాల్సిన ల్యాబొరేటరీని ఇంట్లోనే ఏర్పాటు చేసుకున్నట్లు ఏటీఎస్ అధికారులు కనిపెట్టారు. కాగా, ఢిల్లీ బాంబు పేలుడు నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండో రోజు మంగళవారం కూడా హై అలర్ట్ కొనసాగింది. అనుమానితులు కనిపిస్తే అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

బిజినెస్ డీల్ ఉందని వెళ్లాడు

ఈ నెల 5వ తేదీన బిజినెస్ డీల్ ఉందని చెప్పి ఇంట్లో నుంచి మొహియుద్దీన్ బయటకు వెళ్లాడని ఫారూఖీ తెలిపారు. '9న ఏటీఎస్ పోలీసులు నాకు ఫోన్ చేసి మీ అన్నకు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయని, అందుకే అరెస్ట్ చేశామని చెప్పారు. దాంతో అందరం ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాం. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి మా అన్నయ్యను కాపాడాలి' అని వేడుకున్నారు. మొహియుద్దీన్ గదిలో ఉన్న సామగ్రిని తీయవద్దని, రెండు రోజుల్లో వచ్చి వాటిని స్వాధీనం చేసుకుంటామని ఏటీఎస్ పోలీసులు చెప్పినట్లు ఫారూఖీ వెల్లడించారు. అసద్ మంజిల్‌కు వాచ్‌మెన్‌గా ఉన్న షబానాను విచారించగా తాను నాలుగు నెలల నుంచే వాచ్‌మెన్‌గా ఉన్నట్లు తెలిపింది. ఫోర్ట్‌వ్యూ కాలనీ వాసులు మాత్రం ఈ అంశంపై మాట్లాడేందుకు ఇష్టపడలేదు.

ఐసిస్‌తో దోస్తీ.. పేలుళ్లకు రెక్కీ..

- విజయనగరం వాసి సిరాజ్ హైదరాబాదీ సమీర్‌పై ఎన్ఐఏ చార్జిషీట్

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల క్రితం విజయనగరంలో ఉగ్రదాడికి పథక రచన చేసిన ఐసిస్ ఉగ్రవాది సిరాజ్ ఉర్ రెహమాన్, తెలంగాణకు చెందిన మరో ఉగ్రవాది సమీర్ ఉమ్మడి కుట్రను ఎన్ఐఏ కోర్టుకు వివరించింది. విశాఖపట్నంలోని ఎన్ఐఏ కోర్టులో మంగళవారం దాఖలు చేసిన చార్జిషీటు దాఖలు చేసింది. సిరాజ్, సమీర్ ఇద్దరూ హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరు, ముంబై నగరాల్లో బాంబు పేలుళ్ల కోసం రెక్కీ నిర్వహించారని ఎన్ఐఏ తన చార్జిషీట్లో కోర్టుకు వివరించినట్లు తెలిసింది. సౌదీ అరేబియా, ఒమన్, పాకిస్థాన్ నుంచి సిరాజ్, సమీర్‌కు అందిన ఆదేశాలు, నిధులు.. ఆయా బ్యాంకుల ఖాతాల్లో లావాదేవీల వివరాలతో పాటు ఒమన్‌లో ఉంటున్న హైదరాబాద్ వాసి ఇమ్రాన్ అక్రమ్ పేలుడు పదార్థాల తయారీ నిమిత్తం సిరాజ్‌కు డబ్బులు పంపినట్లు తేలింది. ఆ డబ్బుతో పేలుడు పదార్థాల కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి విజయనగరంలోని తన ఇంటి చిరునామా కాకుండా సమీపంలోని ఉర్దూ పాఠశాల అడ్రస్ ఇచ్చి జాగ్రత్త పడిన వైనాన్ని దర్యాప్తు అధికారులు గుర్తించారు. సిరాజ్, సమీర్‌కు ఐసిస్ ఉగ్ర సంస్థతో ఉన్న లింకులతో పాటు బీహార్‌కు చెందిన అబూ మసాబ్ (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్నాడు) ద్వారా ఐసిస్ శిక్షణకు ఈ ఇద్దరూ సిద్ధమైన విషయాన్ని సైతం ఎన్ఐఏ విచారణలో తేల్చింది. హైదరాబాద్‌లో పేలుడు పదార్థాలు కొనుగోలు చేస్తే నిఘా వర్గాలకు దొరికిపోతామనే ఉద్దేశంతో విజయనగరంలో టిఫిన్ బాంబుల తయారీకి సిద్ధపడినట్లు చార్జిషీట్‌లో కోర్టుకు వివరించినట్లు తెలిసింది. సిరాజ్, సమీర్‌లపై పై ఉపా చట్టం కింద అభియోగాలు నమోదు చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది.

'రూఫ్‌టాప్ సోలార్'ను వేగవంతం చేయండి: సీఎస్

» డిస్కంలు, ఏడీబీ, నాబార్డు అధికారులతో సమీక్ష

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థలతో పాటు నాబార్డ్-ఏడీబీ(ఆసియా అభివృద్ధి బ్యాంకు) సహకారంతో రాష్ట్రంలో అమలవుతున్న సోలార్ రూఫ్‌టాప్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రాంను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. మంగళవారం సచివాయంలో డిస్కంల సీఎండీలు శివశంకర్, పృథ్వీతేజ్, పుల్లారెడ్డితో పాటు ఏడీబీ, నాబార్డ్ ప్రతినిధులతో సీఎస్ వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో హరిత ఇంధనాన్ని ప్రోత్సహించేందుకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను వేగంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఐదుగురు స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

హైకోర్టులో వివిధ ప్రభుత్వ సంస్థల తరఫున వాదనలు వినిపించేందుకు ఐదుగురు న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిళ్లగా నియమించారు. ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్‌కు రామినేని సతీష్‌బాబు, ఏపీ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కు కె.శ్రీనివాస ప్రసాద్, సమగ్రశిక్షకు కలమట రఘుబాబు, ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్ కు వెలివెల వీర రాఘవయ్య, ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డుకు బొల్లా వెంకటరామారావును స్టాండింగ్ కౌన్సిళ్లగా నియమించారు. న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం వీరి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్వాడీ సెంటర్ల విలీనం ఆపండి

» ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్

అంగన్వాడీ సెంటర్లను ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, అంగన్వాడీ సెంటర్లను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం ఆపాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఐసీడీఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్‌కు మెయిల్ ద్వారా వినతిపత్రం పంపినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీలను బలోపేతం చేయాలని కోరుతూ ఈ నెల 14న లబ్ధిదారులతో సచివాలయాల్లో వినతిపత్రాలు ఇస్తామని తెలిపారు.

నేడు కర్నూలు జిల్లాకు గవర్నర్

కర్నూలు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బుధవారం పర్యటించనున్నారు. రాయలసీమ యూనివర్సిటీ నాల్గవ స్నాతకోత్సవానికి ఆయన హాజరవుతారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ పరిశీలించారు. ఉప కులపతి వి.వెంకటబసరావు పది రోజులుగా కమిటీలు, ప్రొఫెసర్లతో సమీక్షిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఏపీకీ మేనమామగా ఉంటా

» రాష్ట్రం నం.1 అయ్యేందుకు సాయపడతా
» మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లది ఉంగరంలో పొదిగిన రత్నం వంటి కలయిక
» వారి కలయికే ఆంధ్రాకు శ్రీరామరక్ష
» బాబు విజనరీ నేత..రేపటిపైనే ఆయన ఆలోచన
» కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంస
» చారిత్రక వెంగళాయపాలెం చెరువు వేదికగా పెమ్మసానితో కలిసి వాటర్ షెడ్ మహోత్సవ్‌కు శ్రీకారం
» రాష్ట్రంలోని ఏడు చెరువు ప్రాజెక్టులకు రూ.20 లక్షల చొప్పున ప్రోత్సాహక బహుమతుల ప్రదానం



రాష్ట్రంలోని వివిధ చెరువుల అభివృద్ధికి వర్చువల్‌గా గుంటూరు నుంచి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్, పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల కలయిక ఉంగరంలో పొదిగిన రత్నం వంటిదని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. వీరి కలయిక రాష్ట్ర ప్రజల జీవిత స్థితిగతులను మారుస్తుందని, ఏపీని నం.1 స్థానంలో నిలుపుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. "మధ్యప్రదేశ్‌లో అందరూ నన్ను మామ అని పిలుస్తారు. నేను ఆ రాష్ట్రానికే కాదు, ఆంధ్రప్రదేశ్‌కు కూడా మేనమామలా వ్యవహరిస్తూ కేంద్రం నుంచి అవసరమైన ఆర్థికసాయాన్ని తప్పక చేయిస్తాను. లఖ్‌పతి దీదీల పథకాన్ని సమర్థంగా అమలు చేయడం ద్వారా ఏపీని పూరిగుడిసె లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం." అని చౌహాన్ వాగ్దానం చేశారు. మంగళవారం వాటర్ షెడ్ మహోత్సవ్ కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 150 సంవత్సరాల చరిత్ర కలిగిన వెంగళాయపాలెం చెరువు వేదికగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రూ.1.20 కోట్లతో 21 ఎకరాల్లో పునరుద్ధరించిన ఈ చెరువును శివరాజ్‌సింగ్ చౌహాన్ పరిశీలించి మొక్కలునాటి నీరు పోశారు. అనంతరం నల్లపాడు లయోలా పబ్లిక్ స్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో చౌహాన్ మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎప్పుడూ రేపటి గురించే ఆలోచిస్తారని, రాష్ట్ర ప్రజల సంతోషం, సంపద, ఆరోగ్యం గురించి తపన పడుతుంటారని ఆయన కొనియాడారు. "ప్రధానమంత్రి చొరవతో వాటర్ షెడ్ మహోత్సవ్‌ను ప్రారంభిస్తున్నాం. చెరువులతో ప్రజలను మమేకం చేసేందుకు వాటి చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, జిమ్‌లు, పిల్లల పార్కులు వంటివి వెంగళాయపాలెంలో వలే ఏర్పాటు చేసేలా చూడాల్సి ఉంది. ఇలాంటి బహుళావసర స్కీమ్‌తో ప్రజల ఆరోగ్యంతో పాటు మట్టికి కూడా సూక్ష్మపోషకాలు లభిస్తాయి" అని వివరించారు.

ఆ చెరువులకు ప్రోత్సాహకాలు

వాటర్ షెడ్ జన్ భగీరథ పథకం కింద చిత్తూరు జిల్లా చెరుకువారిపల్లి ప్రాజెక్టు, శ్రీ సత్యసాయి జిల్లా మర్రికొమ్మ దిన్ని ప్రాజెక్టు, గంగాలమ్మ చెరువు ప్రాజెక్టు; అన్నమయ్య జిల్లా టీ సుండుపల్లి ప్రాజెక్టు, ప్రకాశం జిల్లా తువ్వాపాడు ప్రాజెక్టు, మారెళ్ల ప్రాజెక్టు; విజయనగరం జిల్లా మెరకమూడియం చెరువు ప్రాజెక్టులకు రూ.20 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి చెక్కులను ఆయాజిల్లాల అధికారులకు శివరాజ్ సింగ్ చౌహాన్ అందజేశారు. అనంతపురం జిల్లా ఇవ్వేరులో పీఎం కృషి సంచాయి యోజన 2.0 కింద వడికట్టడపు చెరువు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అన్నమయ్య జిల్లా గుండపల్లిలో రూ.3.12 లక్షలతో పునరుద్ధరించిన చెరువును ప్రారంభించారు. మిషన్ వాటర్ షెడ్ కింద కుప్పం నియోజకవర్గంలోని వడికట్టడపు చెరువును, ఇదే నియోజకవర్గంలోని కడపల్లి, రాళ్ల బుడుగుపాడులో మరో చెక్ డ్యాంను ప్రారంభించారు.

తుఫాన్‌తో దెబ్బతిన్న ఏపీకి అండగా ఉంటాం..

మొంథా తుఫానుతో నష్టపోయిన రాష్ట్రానికి అండగా ఉంటానని, కేంద్రం నుంచి తగిన న్యాయం జరగేలా చూస్తానని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. గుంటూరులో మంగళవారం నిర్వహించిన 'ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్' సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశీయ ఉత్పత్తులను, దేశంలోని మేధో యువ శక్తిని ప్రోత్సమిస్తున్నామని తెలిపారు.

ఢిల్లీ వస్తే నా ఇంటికి రండి

రాష్ట్ర ప్రజలకు చౌహాన్ ఆహ్వానం

ప్రజాప్రతినిధులు, అధికారులే కాదు...ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రజలు ఎవరు ఢిల్లీకి వచ్చినా తన ఇంటి (12, సఫ్దర్‌జంగ్ రోడ్డు) తలుపు తట్టొచ్చునని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. కాగా, గ్రామీణ రోడ్ల అభివృద్ధికి పెమ్మసాని చంద్రశేఖర్ రూ.500 కోట్లు కోరగా, అప్పటికప్పుడు రూ.380 కోట్లను చౌహాన్ మంజూరుచేశారు. ప్రజల కరతాళధ్వనుల మధ్య ఆ ఉత్తర్వుల ప్రతిని పెమ్మసానికి అందజేశారు.

భూమి తల్లి...నీరు ఆయువు...: పెమ్మసాని

పల్లెలే దేశ ప్రగతికి పట్టుగొమ్మలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. "భూమి తల్లి అయితే...నీరు ఆయువు లాంటిది. 25 శాతం భూమి ఈ దేశంలో వర్షంపై ఆధారపడింది. వర్షాలు కురవకపోతే సమస్యలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కరువు ప్రాంతాల్లో నీటిని నిల్వ చేసి రైతుల ఉత్పత్తి పెంచడానికి వాటర్‌షెడ్ స్కీమ్‌ను తీసుకొచ్చాం. వెంగళాయపాలెం చెరువు వలే దేశంలో ఐదు వేల జనాభా కలిగిన 25 వేల గ్రామాల పరిధిలోని చెరువులను పునరుద్ధరించి నీటిని సంరక్షిస్తాం. పల్లె వెలుగు, గ్రామస్వరాజ్యం తెచ్చేవిధంగా కృషి చేస్తాం. జీఎస్టీ సంస్కరణలతో ప్రతి పేదవాడికీ నెలకు రూ.1200 ఆదా అవుతోంది. జగన్ గురించి ఒక్క మాటే చెబుతా.. "వారి మందు కల్తీ, మాట కల్తీ, మనసు కల్తీ, పూర్తిగా మనిషే కల్తీ" అని విమర్శించారు.

రైతు సంక్షేమానికి సహకారం అందించండి

» కేంద్ర వ్యవసాయ మంత్రిని కోరిన సీఎం

అమరావతి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ కింద పంటలు సాగు చేసే రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని సీఎం చంద్రబాబు కేంద్రవ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. సీఎం చంద్రబాబు ఆహ్వానం మేరకు కేంద్రమంత్రి చౌహాన్ మంగళవారం ఉండవల్లి క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. దాదాపు గంటపాటు సమావేశమైన సీఎం, కేంద్రమంత్రి రాష్ట్రంలో వ్యవసాయం, మైనర్ ఇరిగేషన్ వంటి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల మొంథా తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని కేంద్రమంత్రికి సీఎం వివరించారు. మైనర్ ఇరిగేషన్ కింద సాగు చేసే రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని కోరారు. పీఎం-ఆర్కేవీవై-పీడీఎంసీ స్కీం కింద రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

బలహీనంగా రుతుపవనాలు

» ఉత్తరాది గాలులతో రాష్ట్రంలో పెరిగిన చలి
» సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతంలో కొద్దిరోజులుగా ఈశాన్య రుతుపవనాలు బలహీనపడ్డాయి. బంగాళాఖాతం మీదుగా రావల్సిన తూర్పుగాలులు నిలిచిపోయాయి. దీంతో తమిళనాడు, రాయలసీమ, దక్షిణ కోస్తా, కేరళ, కర్ణాటకల్లో వర్షాల జాడ లేక నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల్లో పంటల సాగుకు అవరోధం ఏర్పడింది. రానున్న నాలుగు రోజుల్లో అక్కడక్కడ తప్ప రాష్ట్రంలోని ఎక్కువ ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 16వ తేదీ తర్వాత శ్రీలంక సమీపాన అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేసినా.. ఇంత వరకూ అధికారికంగా వెల్లడించలేదు. కాగా, హిందూ మహాసముద్రంలో ఈ నెల 19 తర్వాత మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున అండమాన్ సముద్రం/ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి ఆ తర్వాత బలపడి తుఫాన్‌గా మారుతుందని ఇప్పటికే పలు మోడళ్లు అంచనా వేశాయి. అప్పటివరకూ రాష్ట్రంలో ప్రధానంగా దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అడపాదడపా మాత్రమే వర్షాలు పడతాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఉత్తరాది గాలులతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చలి ప్రభావం కొనసాగుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో మంగళవారం 14.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు రోజుల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. శివారు ప్రాంతాలలో చలిగాలులు కొనసాగుతాయని పేర్కొంది.

మెడికల్ కాలేజీలపై నేడు వైసీపీ ర్యాలీలు

» విజయవంతం చేయాలంటూ నేతలను కోరిన సజ్జల
» తిరుపతి లడ్డూపై ఆధారాల్లేకుండా ఆరోపణలంటూ ధ్వజం

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ బుధవారం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ర్యాలీలను చేపట్టనుంది. ఈ నెల ఏడో తేదీన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు నిర్వహిస్తామని జగన్ ప్రకటించారు. ఆ తర్వాత, ఈ నిరసనను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేశారు. శాసనసభా నియోజకవర్గాల వారీగా చేపట్టే ఈ ర్యాలీలను విజయవంతం చేయాలని లోక్‌సభ నియోజకవర్గాల సమన్వయకర్తలను వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం ఆయన పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. తిరుమల లడ్డూపై ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. లడ్డూలో రసాయనాలు కలిశాయంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ప్రచారం చేస్తున్నారని అన్నారు. గతంలో ఆవునెయ్యి కల్తీ అయ్యిందని విమర్శించారని.. ఇప్పుడు రసాయనాలు కలిశాయంటూ ఆధారాల్లేకుండా మాట్లాడుతున్నారని సజ్జల ధ్వజమెత్తారు.

అల్లర్లు సృష్టించేందుకు వైసీపీ కుట్ర

» విద్యార్థులను, యువతను రెచ్చగొట్టడానికే ర్యాలీలు : నిరుద్యోగ జేఏసీ

విద్యార్థులను, యువతను అడ్డం పెట్టి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ ఆరోపించారు. పీపీపీ విధానం గురించి తెలియని వైసీపీ అధినేత, నాయకులు.. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారంటూ ర్యాలీలు చేపడుతూ యువతను రెచ్చగొట్టి రాజకీయం చేయాలని చూస్తుండటం సిగ్గుచేటని ఒక ప్రకటనలో విమర్శించారు.

మౌలానా అబుల్ కలాం అజాద్‌కు అసెంబ్లీ ఉద్యోగుల నివాళులు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారతరత్న మౌలానా అబుల్ ఆజాద్ సేవలు శ్లాఘనీయమని రాష్ట్ర శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం అమరావతి శాసనసభ కాన్ఫరెన్స్ హాల్‌లో అబుల్ కలాం చిత్రపటానికి ఆయన పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, స్వతంత్ర భారత దేశానికి తొలి విద్యామంత్రిగా వ్యవహరించి భారత విద్యా వ్యవస్థకు బలమైన పునాది వేశారని తెలిపారు. ఆజాద్ జన్మదినమైన నవంబరు 11న దేశ వ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నట్టు వివరించారు.

రాష్ట్రాభివృద్ధికి తోడ్పడేలా సీఐఐ సదస్సు నిర్వహించాలి: సీపీఐ

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సును రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడేలా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య కోరారు. కార్మికుల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి, ఉపాధి కల్పన, భద్రతా అంశాలను ఈ సదస్సు అజెండాలో చేర్చాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల మొంథా తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పేదలకు అన్యాయం చేసే అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అమలును రాష్ట్రంలో తక్షణమే నిలిపివేయాలని, దీనిపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి అభిప్రాయ సేకరణ చేయాలని ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని కోరారు.

టీటీడీలో ఇంటి దొంగ!

» దర్శనాల పేరిట భక్తులను మోసగిస్తున్న ఉద్యోగి అరెస్ట్
» మూడేళ్లలో రూ.50 లక్షల విలువైన లావాదేవీలు



శంకరయ్య

తిరుమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనాల పేరుతో భక్తులను మోసగించే ఇంటి దొంగను తిరుమల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. తిరుపతికి చెందిన మాలే శంకరయ్య టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో మజ్దూరుగా పనిచేసేవాడు. రూ.46 వేలు తీసుకుని దర్శనం చేయించకుండా తనను మోసగించాడంటూ 2023లో హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శంకరయ్య అప్పటినుంచి ఉద్యోగానికి హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. అయినా అతని తీరు మారలేదు. తాజాగా విజయవాడకు చెందిన భక్తుల నుంచి రూ.1.20 లక్షలు తీసుకుని మోసగించాడు. ఈ నేపథ్యంలో తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో పోలీసులు నిఘా పెట్టడంతో దొరికిపోయాడు. శంకరయ్య నుంచి సెల్‌ఫోన్, రెండు బ్యాంక్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రథమిక విచారణలో తిరుమలలోని కొంతమంది పీఆర్వోలు, దళారీలతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడుతున్నాడని తేలింది. గడిచిన రెండుమూడేళ్లలో దాదాపు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల నగదు లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. శంకరయ్యకు టీటీడీ ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధుల పీఆర్వోలు, పీఏలు ఎవరెవరు సహకరించారో ఆరా తీస్తున్నారు.



పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన మహారాష్ట్ర బృందం



పోలవరం స్పిల్‌వే వద్ద మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారుల బృందం

పోలవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. ఈ బృందం తొలుత స్పిల్‌వే, డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలను, స్పిల్‌వేలో ఫిష్ ల్యాడర్, పవర్‌హౌస్ ప్రాంతాలను పరిశీలించింది. ఈ బృందానికి ప్రాజెక్టు డీఈ బాలకృష్ణ, మెగా మేనేజర్ ఎ.గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి ప్రాజెక్టు నిర్మాణ పనుల తీరును వివరించారు. అనంతరం ప్రాజెక్టు నమూనాను బృందం పరిశీలించింది. వారికి ప్రాజెక్టు పనితీరును అధికారులు వివరించారు. ప్రధానంగా స్పిల్‌వే గేట్ల తయారీ, అమరిక, నిర్వహణ, సాంకేతికత, నిర్మాణానికి ఎంతకాలం పట్టింది, ఎంత మంది కార్మికులను వినియోగించారనే అంశాలపై బృందం అధ్యయనం చేసింది. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర బృందంలో ఎస్ఈలు శ్రీరామ్ హజారే, రవీంద్ర వాంఖడే, ఈఈలు పరంజిత్ సింగ్ జునేజా, తుషార్ మెట్కార్, గణేశ్ భగత్, డీఈలు ఉమేష్ పచ్పోర్, ధనంజయ్ షిండే, అనిల్ రాథోడ్, రవీంద్ర, విశ్వకర్మ, గణేశ్ ఇంగ్లే ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎదురులేని మునీర్

పొరుగుదేశం పాకిస్థాన్‌లో నాలుగోసారి సైనికకుట్ర జరుగుతోంది. అయితే, ఇదేమీ ఓ చీకటిరాత్రిన, తుపాకీమోతల మధ్య జరగడం లేదు. స్పష్టంగా చెప్పాలంటే, రాజ్యాంగబద్ధంగా, చట్టసభ తోడ్పాటుతో, గతానికి పూర్తిభిన్నంగా కొత్తతరహాలో కొనసాగుతోంది. పాకిస్థాన్‌లో మిగిలిన ఆ కాస్త ప్రజాస్వామ్యాన్ని కూడా మింగేసి, సైన్యమే సర్వంసహాధికారిగా అవతరించబోతోంది. ఒకే ఒక్క రాజ్యాంగ సవరణతో అటు సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని కుదించి, మరోవైపు ఆర్మీచీఫ్ ఆసిమ్ మునీర్‌కు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎఫ్) హోదాతో అపరిమిత అధికారాలు కట్టబెట్టేపని అతివేగంగా జరుగుతోంది.

షరీఫ్ సోదరుల కుట్రతో పాక్ రాజ్యాంగం పునాదులు కదిలిపోతాయంటూ విపక్షాలు ప్రతిపాదిత 27వ సవరణకు అడ్డుతగిలే ప్రయత్నం శక్తిమేర చేస్తున్నాయి. సెనేట్‌లో బిల్లు చక్కగా నెగ్గిన తరువాత, మంగళ వారం జాతీయ అసెంబ్లీలో దీనిని న్యాయమంత్రి ప్రవేశపెట్టారు. మంగళవారం జరగాల్సిన చర్చ బుధవారానికి వాయిదాపడినప్పటికీ, అధికార కూటమి ప్రభుత్వానికి బిల్లును నెగ్గించుకోగలిగినంత సంఖ్యా బలం ఉన్నది కనుక ఇక అడ్డంకులేమీ లేవు. తనను జైల్లోకి నెట్టి, సమీప భవిష్యత్తులో సైతం బయటకురానివ్వకుండా కుట్రలు చేస్తున్న మార్షల్ మునీర్ మరింత బలపడుతున్నందుకు మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ భయపడుతున్నారు. దేశవ్యాప్త నిరసనలు జరపమని, సభలో అడ్డుపడమని తనవారిని ఆదేశించాడు కానీ, బిల్లును అడ్డుకొనేంత శక్తి విపక్షానికి లేదు. సెనేట్‌లో ఇద్దరు విపక్ష సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటుచేసిన దృశ్యం కూడా చూశాం. పాకిస్థాన్ వ్యవస్థాగత నిర్మాణాన్నే మార్చివేసే బిల్లు ఇది. ఇప్పటివరకూ అనధికారికంగా సైనికపెత్తనంలో ఉన్న పాకిస్థాన్ ఈ చట్టం సాయంతో సైనికరాజ్యంగా మారుతుంది.

షెబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఒకేమారు న్యాయ, సైనిక చట్టాలను ఈ బిల్లుద్వారా సవరిస్తోంది. సుప్రీంకోర్టును బలహీనపరచే లక్ష్యంతో, దాని నెత్తిన ఫెడరల్ కాన్స్టిట్యూషనల్ కోర్టు (ఎఫ్‌సీసీ) ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయని మేధావులు భయపడుతున్నారు. భవిష్యత్తులో తమకు నచ్చిన తీర్పులనూ, తీర్మానాలనూ చేయించుకొనేందుకు పాలకులకు, ముఖ్యంగా మునీర్‌కు ఇది ఉపకరించవచ్చు. ఫీల్డ్ మార్షల్ మునీర్ ఈ నెల 27వ తేదీ నుంచి సీడీఎఫ్‌గా త్రివిధ బలాలకూ శక్తిమంతమైన అధినాయకుడు కావడమే కాక, జీవితపర్యంతం ఆ హోదాలోనే ఉంటారు. మరణించేంతవరకూ శత్రువులెవరూ కేసులు పెట్టడానికీ, ఏ కోర్టులూ శిక్షించడానికి వీల్లేకుండా ఆయనకు అపరిమిత రక్షణలు లభిస్తాయి. అభీష్టానికి వ్యతిరేకంగా ఆయనను తొలగించడమూ అసాధ్యమంటున్నారు. ఫీల్డ్‌మార్షల్ హోదాకు రాజ్యాంగబద్ధతలేదన్న న్యాయవివాదం నేపథ్యంలో, ఈ చట్ట సవరణ ఆయనకు ఆ హోదాను శాశ్వతం చేసి, జీవితకాల ప్రతిరోధక శక్తిని ప్రసాదిస్తోంది. అణ్వాయుధాలపై పెత్తనాన్నీ కట్టబెడుతుంది.

పాకిస్థాన్ రాజకీయార్థిక, సామాజిక రంగాల్లో సైన్యం ప్రభావం, పెత్తనం గురించి ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. సైన్యం ఆశీస్సులు, అండదండలు లేని నాయకులు, ప్రజాబలం ఎంత ఉన్నా కూడా అనతి కాలంలో కుప్పకూలవలసిందే. పరిమితిలో, పరిధుల్లో ఉండమని సైన్యానికి చెప్పినందుకు నవాజ్‌షరీఫ్‌కు, సైన్యం పెత్తనాన్ని ప్రశ్నించినందుకు ఇమ్రాన్‌ఖాన్‌కు ఏ గతిపట్టిందో తెలుసు. సుప్రీంకోర్టు అధికారాలకే కళ్లెంవేసే ప్రయత్నం జరుగుతోంది కనుక ఇక ఇమ్రాన్‌వంటి వారు వెలుగుచూడలేరు, ప్రజాస్వామ్యంమీదా, స్వేచ్ఛాయుత ఎన్నికల మీదా ఆశలన్నీ వదులుకోవాల్సిందే. సైనికనియంతలు అయూబ్‌ఖాన్, జియా ఉల్ హఖ్, పర్వేజ్ ముషార్రఫ్‌లు సర్వాధికారాలనూ దఖలుపరచుకోవడానికి అనుసరించిన సర్వవిధాలనూ ఈ ఒక్క సవరణలో మేళవించి మునీర్ వారందరినీ మించిపోబోతున్నాడు. మొత్తానికి ఆపరేషన్ సిందూర్ మనకెంత ప్రయోజనం చేకూర్చిపెట్టిందో తెలియదు కానీ, మునీర్‌ను మాత్రం మహాయోధుడిని చేసింది. అమెరికా అధ్యక్షుడు పాక్ ప్రధానినో, అధ్యక్షుడినో కాక, ఈ సైనికుడికి ఎర్రతివాచీ పరిచి, శ్వేత సౌధంలో పంచభక్ష్యపరమాన్నాల విందుచేశారు. అతడిని మహావీరుడుగా, తనకు అత్యంత ప్రియమైన ఫీల్డ్ మార్షల్‌గా కీర్తించారు. ఇకపై, పూర్తిగా మునీర్ ఏలుబడిలోకి పోతున్న పాకిస్థాన్‌తో రక్షణ వ్యవహారం, సహకారం ట్రంప్‌కు మరింత సులువు. దేశాలకు సైన్యాలు ఉండటం సహజం. కానీ, సైన్యం కోసం ఉన్న ఏకైక దేశం పాకిస్థాన్.

న్యూయార్క్ మేయర్‌గా జొహ్రాన్ మమ్దానీ విజయం అమెరికా ప్రజా జీవితంలో ప్రబలమవుతోన్న మితవాద ధోరణులకు సవాల్ విసిరింది. ట్రంప్ ప్రేరణతో యూరోపియన్ దేశాలలోనూ జాత్యహంకార జాడ్యం పెచ్చరిల్లుతున్న వేళ మమ్దానీ గెలుపు రూపేణా ఒక ఆశావహ పరిణామం సంభవించింది.

ట్రంప్ గర్వభంగం

అమెరికా పాలకులు చరిత్రను వక్రీకరిస్తున్నారు. వర్తమాన ప్రపంచ సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తున్నారు. భవిష్యత్తు విషయమై నవతరంలో భయాందోళనలు పెంచుతున్నారు. శ్రమ జీవులు అయిన పేద వలసదారులను స్వదేశాలకు గెంటివేస్తున్నారు. సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు సమున్నత అమెరికన్ విలువలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్ మహానగర ప్రజానీకం ఇచ్చిన తీర్పు ఆ ఒక్క నగరానికి లేదా దేశానికి మాత్రమే పరిమితమైనది కాదు. అది జాత్యహంకార భావనలకు గొడ్డలిపెట్టు. ప్రపంచవ్యాప్తంగా సగటు మనిషి రాజకీయ మనోగతాన్ని అవిష్కరించిన ప్రజా తీర్పు అది. కట్టుకథలతో విద్వేషాలు రెచ్చగొడుతూ తమను తప్పుదోవ పట్టిస్తున్న శ్వేతసౌధ ఆసామీని ధిక్కరిస్తూ న్యూయార్క్ ప్రజ తమ మేయర్ ఎన్నికలలో సంచలన, సముదాత్త తీర్పునిచ్చింది. మూర్తీభవించిన ఆ జన చైతన్యమే విజేత జొహ్రాన్ మమ్దానీ.

గల్ఫ్ లేఖ

'ఈ నగరాన్ని మీరందరూ కలిసి నిర్మించారు. ఇది మీలో ప్రతి ఒక్కరిది కూడా' అని వలసదారులకు అభయమిస్తూ జొహ్రాన్ మమ్దానీ ఉద్ఘాటించారు. వలసల పట్ల విద్వేషం విషజిమ్ముతున్న నేలపై తెలియని ఒక నూతన పార్శ్వాన్ని మమ్దానీ విజయం ఆవిష్కరించింది. 'రిమోట్‌తో సౌండ్ హెచ్చించుకోవడం ద్వారా నా మాటలు సరిగా విను' అంటూ ఎన్నికయిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుద్దేశించి మమ్దానీ నిర్మొహమాటంగా వ్యాఖ్యానించారు. అమెరికా ప్రజా జీవితంలో ప్రబలమవుతోన్న కరడుగట్టిన మితవాద ధోరణులకు మమ్దానీ విసిరిన సవాల్ అట్లాంటిక్ మహాసముద్రానికి ఇరువైపులా ఇంకా ప్రకంపనలు సృష్టిస్తూనే ఉన్నది. ట్రంప్ ప్రేరణతో యూరోపియన్ దేశాలలోనూ జాత్యహంకార జాడ్యం పెచ్చరిల్లుతున్న వేళ మమ్దానీ విజయం రూపేణా ఒక ఆశావహ పరిణామం సంభవించింది.

మమ్దానీ చైతన్యశీల, స్ఫూర్తిదాయక వ్యక్తిత్వ నిర్మాణంలో ఆయన తల్లిదండ్రుల పాత్ర మౌలికమైనది. అమ్మానాన్న ఇరువురూ ప్రవాస భారతీయులే. తండ్రి మహ్మూద్ మమ్దానీ గుజరాతీ ముస్లిం కాగా తల్లి మీరా నాయర్ పంజాబీ హిందూ. తండ్రి విద్యావేత్త కాగా తల్లి మీరా నాయర్ సినిమా స్రష్ట. ప్రతిష్ఠాత్మక



బహుమతులు గెలుచుకున్న మీరా నాయర్ ఫీచర్, డాక్యుమెంటరీ ఫిల్మ్స్ కొన్నిటిలో వలస జీవితాలే ప్రధానాంశంగా ఉన్నాయి. 1984లో నిర్మించిన 'India cabaret' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌లో తెలుగు యువతి ఒకరు కుటుంబ అవసరాలకు తాను ఏ విధంగా క్యాబరే డ్యాన్సర్‌గా మారవలసివచ్చిందో వివరించింది. ఆ యువతి కుటుంబాన్ని కలిసేందుకు మీరా హైద్రాబాద్‌కు వచ్చారు. 2006లో నిర్మించిన 'The Namesake' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌లో భారతీయ యువతీ యువకులు పలువురు తమ అమెరికా స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు స్వీయ జీవితాలను ఎలా నాశనం చేసుకున్నారో మీరా విపులీకరించారు. సుప్రసిద్ధ 'సలామ్ బాంబే!' (1985) సినిమా దర్శకురాలు మీరాయే. మమ్దానీ భార్య రమా దువజీ కూడా వలసల నేపథ్యం నుంచి ప్రభవించిన విద్యావతే. అమెరికాలో జన్మించినా ఆమె తన బాల్య కౌమారాలను గల్ఫ్‌లో గడిపారు. దుబాయి, దోహాలలో విద్యాభ్యాసం చేసిన రమా దువజీ వివాహం మమ్దానీతో దుబాయిలోనే జరిగింది. అరబ్బుల వలే రమా కూడ పాలస్తీనాకు గట్టి మద్దతుదారు.

స్వయాన వలసదారుడు అయిన జొహ్రాన్ మమ్దానీ తన భారతీయ మూలాలకు గర్వపడతారు. అయితే న్యూయార్క్ జీవన విధానంలో సంపూర్ణంగా సమ్మిళితమయ్యారు. న్యూయార్క్ సగటు పౌరుని సమస్యలు, సంకటాలు గుర్తించి వాటి పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించి విజయం సాధించారు. సంప్రదాయక రాజకీయాలకు భిన్నంగా ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ఓటర్ల వద్దకు వెళ్ళి వారి మద్దతు పొందిన విధానం విలక్షణమైనది. అమెరికా, అంతర్జాతీయ రాజకీయాలపై మమ్దానీ తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పి మరీ ఓట్లు అడిగారు. ఒక్క అమెరికాకే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకే దిక్సూచి అయిన న్యూయార్క్ మహానగరంలో యూదుల జనాభా ఇజ్రాయిల్ రాజధాని టెల్‌అవీవ్‌లో కంటే అధికంగా ఉన్నది. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ యుద్ధ నేరస్థుడు అని దుయ్యబట్టారు. ఒకవేళ నెతన్యాహు న్యూయార్క్ నగరానికి వస్తే ఆయన అరెస్టుకు ఆదేశించేందుకు వెనుకాడనని చెప్పిన మమ్దానీ తన ప్రత్యర్థులపై తిరుగులేని అధిక్యతతో జయపతాక ఎగురవేశారు. అమెరికా రాజకీయాలలో ఇది మాములు విషయం కాదు.

సామాన్యుల సంక్షేమంపై గళం విప్పిన మమ్దానీని యూదులూ అక్కున చేర్చుకున్నారు. మమ్దానీ చరిత్రాత్మక విజయం ఒక వర్గానికి మాత్రమే పరిమితం కాదు, సంకుచిత భావాలకు అతీతంగా సమస్త ప్రజలు ముక్తకంఠంతో చెప్పిన తీర్పు అది. న్యూయార్క్ కంటే చాల ముందుగా ఐరోపాలోని పెద్ద నగరమైన లండన్‌కు మూడు పర్యాయాలు మేయర్‌గా ఎన్నికైన సాదిఖ్‌ఖాన్ పాకిస్థానీ సంతతికి చెందినవాడు కావడం గమనార్హం. నవ భారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ చరిత్రాత్మక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' లోని స్ఫూర్తిదాయక మాటలను మమ్దానీ తన విజయాన్ని అంగీకరిస్తూ వెలువరించిన ఉపన్యాసంలో ఉటంకించడం ఆయన వ్యక్తిత్వంలోని భారతీయతకు నిండు నిదర్శనం.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పాకిస్థాన్‌కు గుణపాఠం నేర్పడమెలా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

సమస్త భారతీయులూ బిహార్ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించిన సమయంలో దేశ రాజధానిలోని ఎర్రకోట సమీపంలో బాంబు పేలుడు, ఫరీదాబాద్‌లో భారీ ఎత్తున మందుగుండు సామగ్రి దొరకడంతో అంతా ఉలిక్కిపడ్డారు. ఢిల్లీలో ఉన్న ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రతి ఒక్కరికీ వారి బంధువుల నుంచి ఆందోళనతో ఫోన్లు వచ్చాయి. ఒకవైపు తీవ్రమైన కాలుష్యం, మరోవైపు పరిస్థితి సురక్షితంగా లేకపోవడంతో ఢిల్లీవాసులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దేశంలో రాజకీయ వాతావరణంపై కూడా ప్రజల అభిప్రాయం భిన్నంగా ఉన్నది. జరిగిన ఘటనకూ, బిహార్ ఎన్నికలకూ ముడి వేసేవారూ ఎదురయ్యారు. 'ఈ బాంబు పేలుడు తర్వాత మంగళవారం బిహార్‌లో చివరి విడత పోలింగ్‌లో హిందూ ఓట్లు సంఘటితమైనా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని సీనియర్ రాజకీయ విశ్లేషకుడు ఒకరు అన్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఇది కారులో ఉన్న సీఎన్‌జీ సిలిండర్ పేలుడు మాత్రమేనని హోంమంత్రిత్వ శాఖ అధికారి ఒకరు నమ్మబలికారు. అయితే ఆ తర్వాత కొద్ది సేపట్లోనే అది ఉగ్రవాద దాడేనని ఆయన అంగీకరించారు.

పహల్గామ్‌లో 26 మంది భారత పౌరులను ఉగ్రవాదులు విచక్షణా రహితంగా హతమార్చి, ఏడునెలలు కూడా పూర్తిగా గడవక ముందే దేశ రాజధాని నడిబొడ్డున ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు జరిగి అనేక మంది మరణించడం దేశ సార్వభౌమత్వాన్ని మరోసారి సవాలు చేసినట్లయింది. సౌత్ బ్లాక్‌లోని ప్రధానమంత్రి కార్యాలయమూ, లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ఆయన నివాసమూ ఎర్రకోటకు సమీపంలోనే ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశ స్వావలంబన, వ్యూహాత్మక స్వతంత్రతను నిరూపించుకున్నామని, దేశంలోనే తయారు చేసిన ఆయుధాలతో ఉగ్రవాద నెట్‌వర్క్‌లను, పాక్‌లో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశామని మోదీ గత ఆగస్టు 15న ఎర్రకోటపై నుంచి ప్రకటించారు. శ్రీకృష్ణుడి సుదర్శన చక్రం మిషన్‌ను ప్రారంభిస్తున్నామని దాని ద్వారా శత్రువు చొరబాట్లను తిప్పిగొట్టి అతి వేగంగా ఎదురుదాడులు చేసేందుకు సిద్ధంగా ఉంటామని కూడా ఆయన తన ఎర్రకోట ప్రసంగంలో తెలిపారు.

విషాదకరమైన విషయం ఏమంటే పహల్గామ్ హత్యాకాండ లేవనెత్తిన అనేక ప్రశ్నలకు జవాబులు రాకముందే ఎర్రకోట సంఘటన సంభవించింది. పహల్గామ్ సంఘటన జమ్మూ–కశ్మీర్‌లో జరిగితే ఢిల్లీలో చోటుచేసుకున్న వైపరీత్యం వెనుక కశ్మీర్ నుంచి వచ్చిన ఉగ్రవాదుల హస్తం ఉన్నదని తేలింది. ఈ ఉగ్రవాద సంఘటన సాయంత్రం 7 గంటలకు జరిగితే ఆ సమయానికి కొద్ది గంటలముందే ఢిల్లీ పొలిమేరల్లోని ఫరీదాబాద్‌లో రెండు ఇళ్లపై భద్రతాబలగాలు దాడి చేసి అక్కడ 2900 కిలోల పేలుడు సామగ్రి, రైఫిళ్లు, పిస్తళ్లు స్వాధీనం చేసుకున్నాయి. ఈ రెండు సంఘటనల వెనుక పాకిస్థాన్‌లో ఉన్న అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు జైషే మహమ్మద్, అన్సర్ ఘజ్వత్ ఉల్ హింద్ ప్రమేయం ఉన్నదని, ఈ సారి జమ్మూ–కశ్మీర్‌కు చెందిన విద్యాధికులైన వైద్యులు ఉగ్రవాదులుగా ప్రత్యక్షమయ్యారని హోంశాఖ వర్గాలు చెబుతున్నాయి. 1999లో భారత విమానం హైజాక్‌కు గురైన తర్వాత భారత్ విడుదల చేసిన ఉగ్రవాది మసూద్ అజర్ స్థాపించిన సంస్థే జైషే మహమ్మద్. ఆ సంస్థ ద్వారా మసూద్ అజర్ పాకిస్థాన్ నుంచి భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉన్నాడు. 2001లో పార్లమెంటు పైన, 2019లో పుల్వామాలో సైనికులు ప్రయాణిస్తున్న బస్సుపైన దాడుల వెనుక మసూద్ హస్తం ఉన్నది. అతడి ఉగ్రవాద దౌష్ట్యాలకు పాక్ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోంది. ఇప్పుడు ఆయన సోదరి సదియా సైతం మహిళా విభాగాన్ని నెలకొల్పి ఉగ్రవాద మహిళలను మన దేశంలో ప్రవేశపెట్టిందని వార్తలు వస్తున్నాయి.

పహల్గామ్ సంఘటన తర్వాత కూడా జమ్మూ కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, అవి దేశ రాజధాని దాకా వ్యాపించాయని, ఉగ్రవాదులు పేలుడు సామగ్రి కూడా భారీ ఎత్తున సరఫరా చేయగలుగుతున్నారని ఎర్రకోట, ఫరీదాబాద్ సంఘటనలు నిరూపిస్తున్నాయి. ఢిల్లీ, ముంబై, గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ జారీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సందేశం పంపారు. దేశ వ్యాప్తంగా అనేక రైల్వే స్టేషన్లలో తనిఖీలు కూడా ప్రారంభమయ్యాయి.

> **ఉగ్రవాద దాడుల్లో సైనికులు, ప్రజలు మరణించినప్పుడల్లా ఉన్నత స్థాయి భద్రతా సమావేశాలు జరుగుతూనే ఉంటాయి. ఉగ్రవాదుల్ని వదిలిపెట్టబోమని మన నేతలు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంటారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలను పాక్ ప్రేరేపిస్తుందని వివరించేందుకు మన పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు పలు దేశాలకు వెళ్లడమూ పరిపాటి అయిపోయింది. ఇలా ఎంత కాలం చేయగలం?**

మంగళవారం మెట్రోలో ఢిల్లీ విశ్వవిద్యాలయానికి వెళ్లే మెట్రో రైలు చాలా ఖాళీగా కనపడింది. మెట్రోలో ప్రయాణీకులు భయంభయంగా కనపడ్డారు. ఎర్రకోట వద్ద మెట్రోను ఆపనే లేదు. ఈ నేపథ్యంలో ఇంకా ఎక్కడెక్కడ దేశంలో ఉగ్రవాద శిబిరాలున్నాయి? ఎంత పేలుడు సామగ్రి వారి వద్ద ఉన్నది? ఇంకా ఎన్ని ఘటనలు జరిగే అవకాశాలున్నాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానం ఎవరు చెప్పగలరు? మన భద్రతా దళాలు గతంలో కంటే ఎక్కువగా గూఢచార సమాచారం సేకరించి అనేక మంది ఉగ్రవాదులను హతమార్చి, ఎన్నో దాడులు చేస్తూనే ఉన్నాయి కానీ అవేవీ సరిపోవడం లేదు.



'మేము ఈ సంఘటన లోతు దాకా వెళతాం. ఎవర్నీ వదిలిపెట్టం..' అని ప్రధానమంత్రి భూటాన్‌లో ప్రకటించారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే విధంగా ప్రకటనలు చేశారు. పహల్గామ్ సంఘటన సమయంలో సౌదీ అరేబియాలో ఉన్న మోదీ తన పర్యటనను వెన్వెంటనే రద్దు చేసుకుని పాకిస్థాన్ గగన తలం నుంచి కాకుండా వేరే మార్గంలో ఇండియాకు తిరిగి వచ్చారు. ఆ తర్వాత బిహార్‌లోని మధుబనికి వెళ్లి ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ ఉగ్రవాదులు భూమిపై ఎక్కడ దాక్కున్నా భారత్ గుర్తించి, వెంటాడి హతమారుస్తుందని ప్రకటించారు. ఈ సారి దేశ రాజధానిలోనే ఉగ్రవాద ఘటన జరిగిన తర్వాత కూడా భూటాన్ పర్యటనకు మోదీ వెళ్లారు. ఉగ్రవాద ఘటన తర్వాత ఉన్నత స్థాయి భద్రతాధికారుల సమావేశం నిర్వహించే బాధ్యతను ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వదిలిపెట్టడం విస్మయం కలిగిస్తోంది. మంగళవారం ఉదయం నుంచి అమిత్ షా, ఎన్ఐఏ అధికారులు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఉగ్రవాద దాడుల్లో సైనికులు, ప్రజలు మరణించినప్పుడల్లా ఇలాంటి భద్రతా సమావేశాలు జరుగుతూనే ఉంటాయి. ఉగ్రవాదుల్ని వదిలిపెట్టబోమని మన నేతలు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంటారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలను పాక్ ప్రేరేపిస్తుందని వివరించేందుకు మన పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు పలు దేశాలకు వెళ్లడం కూడా పరిపాటి అయిపోయింది. ఎంత కాలం ఇలా చేయగలం?

అసలు ఈ సంఘటనలకు ఎవరు జవాబుదారీగా వ్యవహరించాలి? రైలు ప్రమాదాలకు బాధ్యత వహించకపోవడం సరే, కనీసం ఉగ్రవాద ఘటనలకైనా ఎవరైనా ఒకరు బాధ్యత వహించాలి కదా! ఎవరో ఒకరు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయడం వల్ల పరిష్కారం లభిస్తుందా? అయితే భారత్‌లో పాక్ ఉగ్రవాదానికి అడ్డుకట్ట ఎలా వేయగలం అన్న ప్రశ్న దేశ ప్రజలందరి గుండెల్లోనూ మారుమ్రోగుతున్నది. ప్రముఖ జర్నలిస్టు అర్నాబ్ గోస్వామి తరుచూ 'దేశం తెలుసుకోవాలనుకుంటుంది' (నేషన్ వాంట్ టు నో) అని అంటూంటారు. ఆయన చేసే ఈ వ్యాఖ్యకు నేటి పరిస్థితుల్లో ఎంతో ప్రాధాన్యమున్నది.

పహల్గామ్ సంఘటన తర్వాత భారత పాకిస్తాన్‌ల మధ్య నాలుగు రోజుల పాటు తీవ్ర ఘర్షణ జరిగింది. బిహార్ మోదీలో హెచ్చరించిన విధంగానే పహల్గామ్ దారుణం జరిగిన రెండు వారాలకు పాక్‌పై భారత్ దాడులు ప్రారంభించింది. అణ్వస్త్ర దాడులు జరిగే ప్రమాదం కూడా ముంచుకొచ్చిందని అనేకమంది ఆందోళన వ్యక్తం చేశారు అయితే యుద్ధం తీవ్రమవుతున్న దశలో కాల్పుల విరమణ జరిగింది. అందుకు కారణాలు, మనకు జరిగిన నష్టాలపై అనేక చర్చలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. వాటిని పక్కన పెడితే, కాల్పుల విరమణ తర్వాత ప్రధాని మోదీ దేశ ప్రజలనుద్దేశించి అత్యంత కీలకమైన ప్రకటన ఒకటి చేశారు. 'భారతదేశం తన సైనిక చర్యను కేవలం తాత్కాలికంగా నిలిపివేసింది. భవిష్యత్‌లో పాకిస్తాన్ ఎటువంటి దాడి చేసినా భారత్ తిరిగి తీవ్రమైన ప్రతీకారం తీర్చుకుంటుంది. ఎవరి ప్రమేయం లేకుండా భారత్ స్వంత నిర్ణయం తీసుకుని పాక్‌కు బుద్ధి చెబుతుంది, పాక్ ప్రతి చర్యా గమనిస్తున్నాం.. ఉగ్రవాదం, చర్చలు కలిసికట్టుగా సాగవు. ఉగ్రవాదం, వర్తకం కూడా కలిసి సాగవు' అని హెచ్చరించారు. ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీలోనే పాక్ ప్రేరిత ఉగ్రవాదులు దాడులు చేశారు. భారత–పాక్ సంఘర్షణలో కొన్ని నష్టాలు జరిగినప్పటికీ మన సైనిక స్థావరాలు, వాయుతల రక్షణ సంస్థలు అవసరమైతే ఎప్పుడు ఏ దాడికైనా సంసిద్ధంగా ఉన్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ కొద్ది రోజుల క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు పాక్‌కు మన ప్రధానమంత్రీ, సాయుధ బలగాలూ ఎలా బుద్ధి చెబుతారో అని దేశం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నది.

నిజానికి మోదీ వైఖరి కన్నా పాకిస్తాన్ వైఖరే తీవ్ర ఆశ్చర్యం కలిగిస్తోంది. తాము శాంతి సాధించాలనే స్ఫూర్తితోనే కాల్పుల విరమణకు అంగీకరించామని పాక్ ప్రధానమంత్రి గత మేలో ప్రకటించారు. తాము కాల్పుల విరమణకు కట్టుబడి ఉన్నామని, తమంతట తాము ముందుగా దాన్ని ఉల్లంఘించబోమని పాక్ సైనిక అధికార ప్రతినిధి సైతం అన్నారు. ఒకరకంగా పాకిస్థాన్ వెనక్కి తగ్గిన వాతావరణం కనిపించింది. కాల్పుల విరమణ వెనుక అమెరికా హస్తం ఏ మాత్రం లేదని ఆ దేశం ఖండించలేదు. వైట్‌హౌజ్‌లో పాక్ సైనిక దళాధిపతి మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విందు ఇచ్చి మరీ తన మాట విన్నందుకు అభినందించారు. ఇప్పుడు మరి ఉన్నట్లుండి ఆ దేశ ఉగ్రవాదులు ఎందుకు క్రియాశీలమయ్యారు? దాని వెనుక ఎవరి హస్తం ఉన్నది? దీని పర్యవసానాలు ఎలా ఉంటాయి?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

విశాఖ సదస్సుతో విజన్ @ 2047కు శ్రీకారం!

ఏ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికైనా పెట్టుబడులు పునాది వంటివి. అవి అభివృద్ధికి ఇంధనంగా, గమ్యానికి దిక్సూచిగా పనిచేస్తాయి. అందుకే పెట్టుబడుల సదస్సులకు రాష్ట్రాలు అంత ప్రాముఖ్యతనిస్తాయి. వాటి ద్వారా వివిధ దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తుంటాయి. గ్లోబల్ యుగంలో ఒక దేశం లేదా రాష్ట్రం కేవలం మనుగడ సాగించడమే కాకుండా, అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా వెలుగొందాలంటే నిరంతరం ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేలా ఉండాలి.

గతంలో రాష్ట్రంలో పెట్టుబడుల సదస్సులు నిర్వహించినప్పుడు ఏం జరిగిందో ప్రజలందరూ చూశారు. అప్పుడు కుదుర్చుకున్న ఎంఓయూల వల్ల ఎన్ని పరిశ్రమలు వచ్చాయో, అవి ఎక్కడ ఉన్నాయో తెలియని అయోమయ దుస్థితి ఏపీలో నెలకొన్నది. అమరావతి రూపశిల్పి, ఆంధ్ర రాష్ట్ర పునర్ నిర్మాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విశాఖ వేదికగా నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో 45 దేశాల నుంచి 300 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడులకు పైగా ఒప్పందాలు జరగనున్నాయి. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు లాండ్ అవ్వగా మరికొన్ని నవంబర్‌లో శంకుస్థాపనలు చేసుకోనున్నాయి. అందులో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ఇండస్ట్రీ, గూగుల్ డేటా సెంటర్ తదితర పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. దీనికితోడు ఈ 18 నెలల కాలంలో బీపీసీఎల్ లాంటి కేంద్ర ప్రభుత్వ దిగ్గజ సంస్థలు తోడుకావడంతో రాష్ట్రంలో పెట్టుబడుల్లో విజన్ @ 2047 అధ్యాయం మొదలయ్యిందనే అంచనాకు అంతా వచ్చారు.

> **సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో 45 దేశాల నుంచి 300 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. రూ.9.8లక్షల కోట్ల పెట్టుబడులకు పైగా ఒప్పందాలు జరగనున్నాయి. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు లాండ్ అవ్వగా మరికొన్ని నవంబర్‌లో శంకుస్థాపనలు చేసుకోనున్నాయి. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ఇండస్ట్రీ, గూగుల్ డేటా సెంటర్ తదితర పెద్ద పరిశ్రమలకు తోడు, బీపీసీఎల్ లాంటి కేంద్ర ప్రభుత్వ దిగ్గజ సంస్థలు తోడు కావడంతో రాష్ట్రంలో పెట్టుబడుల్లో విజన్ @ 2047 అధ్యాయం మొదలయ్యిందనే అంచనాకు అంతా వచ్చారు.**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివిధ దేశాలకు వెళ్లి, ప్రపంచ వేదికలపై నిలబడి తమ రాష్ట్రంలో ఉన్న అపారమైన అవకాశాలను, సానుకూల విధానాలను, స్థిరమైన పాలనను, నైపుణ్యం కలిగిన మానవ వనరులను, నూతన సాంకేతిక విధానాలను 'బ్రాండింగ్' చేస్తున్నారు. పెట్టుబడులను ఆకర్షించే ఈ ప్రక్రియలో రాష్ట్ర నాయకత్వం చేస్తున్న కృషి అసాధారణమైనది. రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు కేవలం రాష్ట్రంలో కూర్చుని సదస్సులు నిర్వహించడానికే పరిమితమవకుండా, స్వయంగా విదేశాలకు వెళ్లి పెట్టుబడులకు స్వాగతం పలుకుతున్నారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టుబడులను ఆకర్షించేలా విదేశాల్లో పర్యటిస్తూ చేస్తున్న కృషి అద్భుతంగా ఉందని ప్రజలు కొనియాడుతున్నారు. ఆయనే ఒక స్టార్ క్యాంపెయినర్‌గా ముందుండి పలు దేశాల్లో పర్యటిస్తూ రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహంలా వచ్చేలా కృషి చేస్తున్నారు.

ఇదే బాటలో యువ నాయకులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే అరబ్ దేశాల్లో పర్యటించి ఎంతోమంది నేతలను కలిసి విశాఖ పెట్టుబడుల సదస్సుకు పెట్టుబడిదారులను ఆహ్వానించారు. పెట్టుబడుల సదస్సు అనేది ఒక రాష్ట్రం తనకున్న పారిశ్రామిక సామర్థ్యాన్ని, సహజ వనరులను, విధానపరమైన సరళతను ప్రపంచానికి ప్రదర్శించే ఒక వేదిక. ఈ సదస్సు ద్వారా రాష్ట్రం అనేక ప్రయోజనాలను పొందుతుంది. ఈ సదస్సుల అంతిమ లక్ష్యం ఎప్పుడూ ఒక్కటే– రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో బహుముఖంగా అభివృద్ధి చేయటం.

పెట్టుబడులు ఊరికే రావు. ఒక నాయకుడి దూరదృష్టి, సమయపాలన, పాలనా అనుభవం, జాతీయ అంతర్జాతీయ నాయకులతో ఉన్న సన్నిహిత సంబంధాలతో రాష్ట్రంలో సుస్థిర విధానాలు ఏర్పడతాయి. వాటి ఆధారంగా ఆయా రాష్ట్రాల్లో పెట్టుబడులు రావడానికి అవకాశాలు ఉంటాయి. దానికితోడు ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల దీర్ఘకాలికంగా స్థిరమైన, పారదర్శకమైన పారిశ్రామిక విధానాలు అమలు అవుతాయి. ప్రభుత్వ పనితీరు ఎలా ఉందన్నది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ద్వారా ఆచరణలో చూపిస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలిచింది. ఇది రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలకు, తీసుకుంటున్న చర్యలకు నిదర్శనం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పనితీరుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఒక మోడల్‌గా నిలుస్తుంది.

ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల అంతంత మాత్రంగా ఉన్న రాష్ట్ర ఆదాయంలో పెరుగుదల కనిపిస్తోంది. పారిశ్రామిక కార్యకలాపాల పెరుగుదలతో రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతున్నది. ఇది సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతోధికంగా తోడ్పడుతున్నది. ముఖ్యంగా ఇప్పుడిప్పుడే ఆర్థికంగా కుదుటపడుతున్న రాష్ట్ర ఆదాయ పరిస్థితికి ఉపకరిస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు కుదుట పడితే ప్రభుత్వానికి అప్పులు చేసే తిప్పలు తప్పి అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టే వీలు ఏర్పడుతుంది.

ఇప్పటికే కుదిరిన ఎంఓయూలు (MoU) కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, నిర్ణీత గడువులోగా అవి వాస్తవరూపం దాల్చేలా పర్యవేక్షణా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి బలోపేతం చేస్తున్నారు. అందులో భాగంగా ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ఇండస్ట్రీ, గూగుల్ డేటా సెంటర్‌కు ఈ నెలలోనే శంకుస్థాపన చేయడం బలాన్నిస్తోంది.

పెట్టుబడుల ఆకర్షణలో కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, వాటిని అధిగమించడం రాష్ట్రాభివృద్ధికి కీలకం. భూసేకరణ సమస్యలు, అనుమతుల జాప్యం, ప్రభుత్వ అధికారుల నుంచి పారిశ్రామికవేత్తలకు సరైన సహకారం లభించకపోవడం వంటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం పరిష్కరిస్తున్నది. ప్రభుత్వం, అధికారులు, పారిశ్రామికవేత్తలు, కార్మికులు ఒకే జట్టుగా పని చేసినప్పుడు మాత్రమే 'రాష్ట్రాభివృద్ధి' అనే ఏకైక ఎజెండా సాకారమవుతుంది.

రాష్ట్ర ఆర్థిక పురోగతికి పెట్టుబడుల సదస్సు ఒక ముఖ్యమైన అవకాశం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, రాష్ట్రాభివృద్ధి ఏకైక ఎజెండాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా, ప్రతి రాష్ట్రం కూడా సుసంపన్నమైన భారత భవిష్యత్తును నిర్మించగలుగుతుంది. పెట్టుబడులు ఆర్థిక వ్యవస్థకు ఊపిరితిత్తుల్లాంటివి. వాటిని ఆహ్వానించి, పోషించి, రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే శక్తి ప్రభుత్వాలకు ఉంటుంది.



• కొలుసు పార్థసారథి
రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి

(విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





నగరంలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ రెండోవ విద్యాదినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మాట్లాడుతూ ముస్లింలపై వరాల జల్లు కురిపించారు.

మెగా విజయవాడ

ఎంఏయూడీకి గ్రేటర్ ప్రతిపాదనలు

- మంత్రి నారాయణ అధ్యక్షతన త్వరలో కీలక సమావేశం
- నగర, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో జరగనున్న సమీక్ష
- విజయవాడ పక్కనే ఉండటంతో కానూరు, తాడిగడప, పోరంకి ప్రాంతాల అభివృద్ధి
- గ్రేటర్ విజయవాడలో ఉండాలని, ఎన్టీఆర్ జిల్లాలో కొనసాగాలని ప్రతిపాదిత గ్రామాల ప్రజల డిమాండ్

గ్రేటర్ విజయవాడ దిశగా మరో అడుగు ముందుకు పడింది. ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం నుంచి తుది ప్రతిపాదనలు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ)కి అందాయి. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మునిసిపల్ మంత్రి పి.నారాయణ గ్రేటర్ అంశాలపై చర్చించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరో వారం, పది రోజుల్లో నగర, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించ నున్నారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అడుగులు పడ్డాయి. గ్రామ పంచాయతీల స్థాయిలో తీర్మానాల ప్రక్రియ కూడా పూర్తయింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమరావతిపై ఉన్న కోపాన్ని విజయవాడ మీద కూడా చూపించింది. విస్తరిస్తున్న విజయవాడ సమీప ప్రాంతాలను చిన్న చిన్న మున్సిపాల్టీలుగా చేసి గ్రేటర్ ఆశలను సమాధి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మిగతా 6లో..



ఎన్టీఆర్ జిల్లాలోకి తీసుకొస్తేనే విలీనానికి అవకాశం

పెనమలూరు నియోజకవర్గాన్ని కృష్ణాజిల్లాలో ఉంచే క్రమంలో అయితే.. గ్రేటర్ విజయవాడ పరిధిలోకి ఈ రెండు మండలాల గ్రామాలు వచ్చే అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాలు, రెండు డివిజన్ల గందరగోళం లేకుండా చేయటానికి ఒక నియోజకవర్గం.. ఒకే రెవెన్యూ డివిజన్ అన్న విధానాన్ని తీసుకోవటం వల్ల.. పెనమలూరు నియోజకవర్గాన్ని కృష్ణాజిల్లాలో ఉంచి కీలకమైన పెనమలూరు, కంకిపాడు మండలాలను విజయవాడ గ్రేటర్‌లో కలపటమన్నది సాధ్యం కాదు. పెనమలూరు నియోజకర్గ ప్రజలు గ్రేటర్ విజయవాడను అప్పుడూ, ఇప్పుడూ స్వాగతిస్తున్నారు. నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలోకి తీసుకురాకుండా గ్రేటర్ విజయవాడలో విలీనం చేయటానికి అవకాశం ఉండదు.

విజయవాడతో సమానంగా అభివృద్ధి

విజయవాడను ఆనుకుని విజయవాడతో సమానంగా తాడిగడప, కానూరు, పోరంకి, యనమలకుదురు, గంగూరు వంటి ప్రాంతాలు అభివృద్ధి చెంది ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత 20 ఏళ్లగా గ్రేటర్ విలీన గ్రామాల్లో వీటిని చేర్చుతూ వస్తున్నారు. విజయవాడను ఆనుకుని నగరంతో సమానంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతాలను గ్రేటర్ పరిధిలోకి తీసుకురావటం కూడా ముఖ్యమే. ఈ అంశంపై కూడా మంత్రి నారాయణ అధ్యక్షతన జరిగే సమావేశంలో చర్చకు దారి తీసే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల అభివృద్ధి అంతా కూడా దగ్గరగా ఉన్న విజయవాడ మీద ఆధారపడి ఉంది. అలాంటిది విజయవాడతో సంబంధం లేదంటే మాత్రం ఈ ప్రాంతాల భవిష్యత్తు వృద్ధిపై ప్రభావం చూపే అవకాశాలు కూడా ఉంటాయి. పెనమలూరు, కంకిపాడు మండలాలను గ్రేటర్ విలీన ప్రతిపాదనలోకి తీసుకు వస్తారా ? మినహాయిస్తారా ? అన్నది చర్చనీయాంశంగా మారుతోంది.

అనూహ్య స్పందన

రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై ప్రీబిడ్ మీటింగ్

తరలివచ్చిన కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ప్రీబిడ్ మీటింగ్‌కు అనూహ్య స్పందన లభించింది. ఇటీవల నగరంలోని ఒక హోటల్‌లో రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డీఏ) నిర్వహించిన సమావేశానికి దేశీయ దిగ్గజ కంపెనీలు తరలి వచ్చాయి. రెండంకెల సంఖ్యలో కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు పాల్గొనడంతో రైల్వే శాఖ సంతోషం వ్యక్తం చేసింది. దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ కావటంతో.. విజయవాడ రైల్వేస్టేషన్‌ను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో అనేక రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ కింద సొంతంగా అభివృద్ధి చేస్తున్న రైల్వేశాఖ.. విజయవాడ రైల్వేస్టేషన్‌ను మాత్రం పీపీపీ కింద అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. గతంలో రెండు సార్లు రీ డెవలప్‌మెంట్‌కు పీపీపీ కింద రైల్వేశాఖ బిడ్లను ఆహ్వానించినపుడు స్పందన రాలేదు. ఈ సారి మాత్రం కాంట్రాక్టు సంస్థల నుంచి అనూహ్య స్పందన రావటంతో రైల్వే అధికారులు ఖుషీగా ఉన్నారు. టెండర్ల తుది గడువు నాటికి ప్రీబిడ్ మీటింగ్‌కు వచ్చిన సంస్థలలో ఎన్ని బిడ్లు వేస్తాయన్నది వేచి చూడాల్సిందే.

ప్రజా సమస్యల పరిష్కారంపై

దృష్టి సారించండి

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

జెడ్పీ స్థాయి సంఘాల సమావేశంలో పలు అంశాలపై సమీక్ష

- డిసెంబరులో నూతన పింఛన్ల దరఖాస్తుల పరిశీలన
- పారదర్శకంగా పంటల పరిహారం అంచనాలు వేయాలని సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందప్రసాద్

మచిలీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం ఒకటి నుంచి ఏడు వరకు జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తెచ్చిన ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో పారిశుధ్య నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, రహదారులకు మరమ్మతులు, తాగునీటి సరఫరా, పాఠశాలల్లో అదనపు మిగతా 6లో..

గృహ నిర్మాణ బిల్లులు ఇప్పించండి

గూడూరు మండలం మల్లవోలు తదితర గ్రామాల్లో నూతనంగా గృహాలు నిర్మాణం చేస్తున్న లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నారని, వెంటనే ఇప్పించాలని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ కోరారు. గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపులు చేస్తున్నామని, ఎక్కడైనా బిల్లులు పెండింగ్‌లో ఉంటే మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. సొంత స్థలం ఉండి గృహ నిర్మాణం చేసుకునేందుకు ముందుకు వచ్చిన వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గృహాలు మంజూరు కోసం ధరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించారని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని గృహ నిర్మాణ సంస్థ అధికారులు వివరించారు.

ప్రాణాలు తీసిన అతివేగం

గండిగుంట వద్ద రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకుల మృతి

విజయవాడ- మచిలీపట్నం ఎన్‌హెచ్, సర్వీసు రోడ్డుకు మధ్య ఘటన

- గుంతలో పడి 30 మీటర్లు పల్టీలు కొట్టిన కారు
- పెద్ద బండరాయిని ఢీకొని గాల్లోకి లేచిన వాహనం
- నాలుగు కుటుంబాల్లో తీవ్ర విషాదం
- మృతులు విజయవాడ, కుందేరుకు చెందిన వారు





కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు, ప్రమాదంలో నుజ్జయిన కారు



రాకేష్ పాపారావు ప్రిన్స్‌బాబు చింతయ్య

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/ఉయ్యూరు): "అప్పటి వరకు రహదారిపై సాఫీగా వెళ్తున్న కారుకు ఎదురుగా మరో వాహనం అడ్డురావడంతో డ్రైవర్ ఒక్కసారిగా దాన్ని తప్పించే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలో కారు అదుపు తప్పి పల్టీలు కొడుతూ గాలిలోకి ఎగురుతుంది. ఆ తర్వాత మళ్లీ నేలపై పల్టీలు కొట్టుకుంటూ ముందుకెళ్లి ఆగుతుంది" ఇది చాలా సినిమాల్లో కనిపించే దృశ్యం. ఇలాంటి ఘటనే కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలంలో జరిగింది. కాకపోతే ఇక్కడ సినిమా స్టంట్లను తలపించేలా పల్టీలు కొట్టిన కారుకు ఏ వాహనం అడ్డురాలేదు. పరిమితికి మించిన వేగంతో కారును నడిపిన యువకుడు దానిని నియంత్రించుకోలేకపోయాడు. ఫలితంగా కారు కొట్టిన పల్టీలు నలుగురి ప్రాణాలను తీశాయి. ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదం నాలుగు కుటుంబాలను విషాదంలో ముంచింది. ఈ ప్రమాదంలో విజయవాడకు చెందిన ముగ్గురు యువకులు, కంకిపాడు మండలం కుందేరుకు చెందిన మరో యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

అతివేగం.. అదుపు తప్పి

నైట్‌రైడ్‌కు బయలుదేరిన ఈ యువకులు మితిమీరిన వేగంతో ప్రయాణించినట్టు పోలీసులు గుర్తించారు. కారును రాకేష్ నడుపుతున్నాడు. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారికి, సర్వీసు రోడ్డుకు మధ్యన గండిగుంట వద్ద కొంతదూరం మైనర్ డ్రెయిన్ వంటి బోది ఉంది. రహదారి మొత్తం విశాలంగా ఉండడంతో రాకేష్ పరిమితికి మించిన వేగంతో కారును నడిపాడు. వేగం ఎక్కడా తగ్గించకపోవడంతో అదుపు తప్పింది. దీంతో కారు బోదిలోకి దూసుకుపోయింది. 30 మీటర్ల దూరం పల్టీలు కొట్టింది. అక్కడ ఒక పెద్ద బండరాయి ఉండడంతో దాన్ని ఢీకొట్టి గాల్లోకి ఎగిరింది. గాల్లోను కొద్దిసేపు పల్టీలు కొట్టిన తర్వాత సర్వీసు రోడ్డుపై పడింది. అక్కడి నుంచి మరో 70 మీటర్లు పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి ఆగిపోయింది. ఈ ఘటనలో రాకేష్, ప్రిన్స్‌బాబు, చింతయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పాపారావు మాత్రం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

నైట్ రైడ్‌కు వెళ్లారా?

విజయవాడ మొగల్రాజపురానికి చెందిన చాట్రగడ్డ రాకేష్(24) పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరిగా పనిచేస్తున్న తండ్రి చక్రపాణికి సహాయకుడిగా ఉంటున్నాడు. గిరిపురానికి చెందిన గౌరిపర్తి పాపారావు(23), ఈటె ప్రిన్స్‌బాబు(22) స్నేహితులు. పాపారావు తండ్రి శివయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పాపారావు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా మిగతా 6లో..

ఆర్నెల్లుగా ఖాళీనే..

బదిలీల్లో జెడ్పీ కార్యాలయానికి 30 మంది ఉద్యోగుల రాక

విధులు నిర్వర్తించేందుకు సీట్లు కేటాయించని అధికారులు

- అడిగితే జూనియర్ అసిస్టెంట్‌ల వద్ద పనిచేయాలని సీనియర్ అసిస్టెంట్‌లకు సలహా
- జెడ్పీ చైర్‌పర్సన్, సీఈవో మధ్య విభేదాలే కారణమని సమాచారం
- ఉద్యోగులకు సీట్లు కేటాయించే అధికారం ఉన్నా పట్టించుకోని జెడ్పీ సీఈవో
- కలెక్టర్ చొరవచూపి న్యాయం చేయాలని వేడుకోలు

జిల్లా పరిషత్‌లో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. ఈ ప్రభావం ఆరు నెలల క్రితం జరిగిన ఉద్యోగుల బదిలీలపై పడింది. కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీపై జెడ్పీ కార్యాలయానికి వచ్చిన 30 మంది ఉద్యోగులకు నేటికీ సీట్లు కేటాయించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. గట్టిగా అడిగితే జూనియర్ అసిస్టెంట్‌ల వద్ద పనిచేయాలని సీనియర్ అసిస్టెంట్ హోదాలోని ఉద్యోగులకు సలహా ఇస్తున్నారు. దీంతో ఆరు నెలలుగా 30 మంది ఉద్యోగులు కార్యాలయానికి వచ్చి ఖాళీగా కూర్చుని వెళ్లిపోతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





జెడ్పీ సీఈవోకు సీట్లు కేటాయించే అధికారం ఉన్నా..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జెడ్పీ ఉద్యోగుల బదిలీలను ఈ ఏడాది జూన్‌లో కౌన్సెలింగ్ పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో జెడ్పీ చైర్‌పర్సన్ తాను చెప్పినట్లుగానే బదిలీలు నిర్వహించాలని చెప్పగా, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కౌన్సెలింగ్ పద్ధతిలోనే బదిలీలు చేస్తామని జెడ్పీ సీఈవో పట్టుబట్టారు. చివరకు కౌన్సెలింగ్ పద్ధతిలోనే 104 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. వీరిలో ఎంపీడీవోలు, సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర విభాగాల ఉద్యోగులు ఉన్నారు. బదిలీలు జరిగినా.. వారిలో చాలామందిని చాలా రోజుల పాటు రిలీవ్ చేయకుండా జాప్యం చేశారు. అతికష్టం మీద ఉద్యోగులు బదిలీ అయిన ప్రాంతాలకు వెళ్లారు. వీరిలో 30 మంది సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, ఇతర కిందిస్థాయి సిబ్బంది జెడ్పీ కార్యాలయానికి బదిలీపై వచ్చిన వారు ఉన్నారు. అయితే జెడ్పీ కార్యాలయంలో వీరు ఏ విభాగంలో పనిచేయాలో సీట్లు కేటాయించకుండా ఇంతకాలంగా జాప్యం చేస్తూ వస్తున్నారు. తమకు సీట్లు కేటాయించమని ఉద్యోగులు కోరితే ఎవరో ఒకరి వద్ద తాత్కాలికంగా పనిచేయండి, తర్వాత మీకు సీట్లు కేటాయించే అంశంపై నిర్ణయం తీసుకుంటామంటూ దాటవేత ధోరణిని గత ఆరు నెలలుగా కొనసాగిస్తున్నారు. జిల్లా పరిషత్ చరిత్రలో ఆరు నెలల పాటు 30 మంది ఉద్యోగులకు సీట్లు కేటాయించకుండా ఖాళీగా ఉంచి, జీతాలు చెల్లించిన దాఖలాలు లేవని జెడ్పీ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

జిల్లా పరిషత్ యాజమాన్యంలో పని చేసే ఉద్యోగులకు బదిలీలు ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ పద్ధతిలోనే జరిగాయి. ఈ వివరాలను ప్రభుత్వానికి కూడా పంపారు. ఈ నేపథ్యంలో జెడ్పీ కార్యాలయానికి బదిలీపై, పదోన్నతిపై వచ్చిన ఉద్యోగులకు జెడ్పీ సీఈవో తన అధికారాలను ఉపయోగించి సీట్లు కేటాయించవచ్చని జెడ్పీ ఉద్యోగులు అంటున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌కు చెప్పి ఉద్యోగులకు సీట్లు కేటాయించాలనే ఉత్తర్వులు కూడా ఏమీ లేవని పేర్కొంటున్నారు. కానీ పరిపాలనా పరంగా జెడ్పీ సీఈవో, జెడ్పీ చైర్‌పర్సన్‌కు మధ్య ఉన్న విభేదాల కారణంగా ఉద్యోగులకు సీట్లు కేటాయించకుండా ఆరు నెలలుగా జాప్యం చేయడం గమనార్హం. జెడ్పీ చైర్‌పర్సన్ వద్ద ఈ ఫైలు పెండింగ్‌లో ఉందని చెప్పి జాప్యం చేస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. జిల్లా పరిషత్ ఉద్యోగుల కౌన్సెలింగ్ జరిగే సమయంలో మీ ఇష్టానుసారంగా మిగతా 6లో..

తాగునీటిలోకి మరోమారు బూడిద నీరు

- మారని ఎన్టీటీపీఎస్ వక్రబుద్ధి
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఇంకెన్నాళ్లు..!

8


ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈవో

దుర్గగుడి భద్రతపై అప్రమత్తం

- అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి
- ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందికి ఈవో ఆదేశం

ఇంద్రకీలాద్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ దుర్గగుడి సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మహామండపం నాలుగో అంతస్తులో ఆయన భద్రతా సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో భద్రతా సిబ్బందికి, నిర్వాహక బృందాలకు పలు సూచనలు చేశారు. భక్తులను 'జై భవాని' అని పలకరించాలని, వారితో అత్యంత మర్యాదపూర్వకంగా, వినయంతో మాట్లాడాలని ఈవో సూచించారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ఘాట్ రోడ్డు, మహామండపం వద్ద భక్తులను భాగస్వామ్య పద్ధతిలో (రోప్ వ్యవస్థ ద్వారా) కొద్దికొద్దిగా అనుమతించాలని, తద్వారా భక్తులు తోపులాటకు గురికాకుండా, క్యూలలో తొక్కిసలాటలు జరగకుండా నివారించవచ్చని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో, క్యూలలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు కనిపిస్తే వెంటనే ఆలయ పోలీస్ అవుట్‌పోస్టుకు లేదా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దుర్గాఘాట్‌లో యాత్రికులను అప్రమత్తం చేయాలని, కనకదుర్గానగర్‌లో లగేజ్, క్లోక్ రూములో భద్రపరిచే చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ ఆదేశాలను భద్రతా సిబ్బంది, సంబంధిత విభాగాలు కచ్చితంగా పాటించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఈవో శీనా నాయక్ స్పష్టం చేశారు. సమావేశంలో ఆలయ అధికారులు, సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

14, 15, 16 తేదీల్లో ప్రత్యేక దర్శనం

ఇంద్రకీలాద్రి : కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 14, 15, 16 తేదీలలో భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నట్టు ఆలయ చైర్మన్ బి.రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. నవంబరు 14, 15, 16 తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు రూ.500లు ప్రత్యేక దర్శనం టిక్కెట్ల విక్రయం తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని, ఈ సమయాలలో అంతరాలయ దర్శనానికి ఎటువంటి వీఐపీ సిఫార్సు లేఖలు (సిఫార్స్ దర్శనాలు) అనుమతించబడవని తెలిపారు. ఈ మూడురోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల మధ్య భక్తులందరికీ బంగారు వాకిలి ద్వారా దర్శనం కల్పించబడుతుందని తెలిపారు. వీఐపీలు సహకరించవలసిందిగా ప్రకటనలో కోరారు.

పశుసంవర్ధక శాఖలో పదోన్నతులు

- 24 మంది ఏడీలకు డీడీలుగా పోస్టింగ్‌లు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో 24 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి కల్పించి, పోస్టింగ్‌లు ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. దుత్తలూరులోని ప్రసన్న ఆంజనేయరెడ్డిని చిత్తూరు వెటర్నరీ పాలిక్లినిక్, అక్కడి రాజశేఖర్‌రెడ్డిని హిందుపూర్ పాలిక్లినిక్, బేతంచర్లలోని వసంతలక్ష్మిని కర్నూలు, ముక్త్యాలలోని శ్రీనివాసరావును నరసరావుపేట, శ్రీకాకుళం జిల్లా కొత్తూరులోని శ్రీనివాసరావును విశాఖ డీఎల్‌డీఏ ఈవోగా, కృష్ణా జిల్లా మొవ్వలోని శ్యామూల్ ఆనంద్ దివాకర్‌ను పులివెందుల, నరసాపురంలోని సుధాకర్‌ను గుంటూరు జిల్లా చేబ్రోలు డీఎల్‌డీఏ ఈవోగా, మర్రిపాడులోని జైచంద్రను ఒంగోలుకు, వెలుగోడులోని వెంకటేశ్వర్లును కడపకు, గరుగుబిల్లిలోని వెంకట్రామిరెడ్డిని విజయవాడలోని హెడ్‌ఆఫీస్‌కు, కురిచేడులోని సయ్యద్ రసూల్‌సాహెబ్‌ను మదనపల్లి, గణపవరంలోని నాయక్‌ను తాడేపల్లిగూడెం డీఎల్‌డీఏ ఈవోగా, పాయకరావుపేటలోని శ్రీధర్‌ను కంకిపాడు, రాపూరులోని అనిల్‌కుమార్‌ను తిరుపతి, కుప్పంలోని కుమారిని తిరుపతి డీఎల్‌డీఏ ఈవోగా, ఇందుకూరుపేటలోని మురళీకృష్ణను ఒంగోలు డీఎల్‌డీఏ ఈవోగా, తిరుపతి ఎస్వీవీయూలోని బైరాగిని విశాఖ స్మైల్‌కు, ఎడ్లపాడులోని శ్రీనివాసరావును గుంటూరు, విజయవాడ జేడీ ఆఫీస్‌లోని శ్రీనివాసరావును హెడ్‌ఆఫీస్‌కు, అమలాపురంలోని కోటిలింగరాజును భీమవరం, మారేడుమిల్లిలోని సూర్యనారాయణమూర్తిని శ్రీకాకుళం, ప్రొద్దుటూరులోని రాజాతిమ్మారెడ్డిని కడప డీఎల్‌డీఏ ఈవోగా, రావులపాలెంలోని ఉమామహేశ్వరరెడ్డిని ఉరవకొండ, నాగులుప్పలపాడులోని నాగభూషణరావును గన్నవరం డీఎల్‌డీఏ ఈవోగా నియమించారు. కాగా, పశుసంవర్ధక శాఖకు పశువుల మందులు సరఫరా చేసిన కంపెనీలకు పెండింగ్‌లో ఉన్న రూ.70 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి, మళ్లీ మందుల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు, మేకలు, గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామకృష్ణ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి మంగళవారం వినతిపత్రం అందజేశారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

(5వ పేజీ తరువాయి)

తరగతి గదుల నిర్మాణం తదితర సమస్యలు ఉన్నాయని తెలిపారు.

కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారు?

జిల్లాలో గత 18 నెలలుగా కొత్త పింఛన్ల మంజూరు నిలిపివేశారని, ఒక్కో మండలంలో వందలాది దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయని, అర్హులైన వారికి ఎప్పుడు ఇస్తారని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గౌస్ అధికారులను ప్రశ్నించారు. నూతన పింఛన్ల మంజూరుకు సంబంధించి ఇంకా లాగిన్ ప్రభుత్వం ఇవ్వలేదని, డిసెంబరులో పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ఉంటుందని డీఆర్‌డీఏ అధికారులు వివరణ ఇచ్చారు. ఆయా మండలాల్లో నెలకొన్న సమస్యలు చెప్పుకునేందుకు అధికారులు స్థాయి సంఘాల సమావేశాల్లో అందుబాటులో ఉండటం లేదని పలువురు సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలకు హాజరు కాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని జెడ్పీ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. డ్వాక్రా మహిళలకు సబ్సిడీపై రుణాలు ఇవ్వడం లేదని, బ్యాంకులకు డ్వాక్రా మహిళలు వెళితే వెలుగు కార్యాలయాలకు వెళ్లాలని చెబుతున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. డ్వాక్రా మహిళలు వివిధ వ్యాపారాలు చేసేందుకు పీఎంజీపీ ఎవై తదితర పథకాల ద్వారా 33శాతం రాయితీతో రుణాలు ఇప్పించాలని సభ్యులు అధికారులను కోరారు.

పంట నష్టం నమోదు సరిగా లేదు

మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట నష్టం వివరాలను సక్రమంగా నమోదు చేయడంలేదని సభ్యులు ఆరోపించారు. నేలవాలిన వరి పొలాలను మాత్రమే నమోదు చేస్తున్నారని, కంకులకు ఉన్న గింజలు పగిలిపోయి గింజలు పాలు పోసుకోలేదని, ఇలా నష్టపోయిన రైతులకు పంట నష్టం ఇవ్వాలని కోరారు. పంట నష్టం జరిగిన రైతులకు న్యాయం జరిగేలా జాబితాలను తయారు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్న వారి నుంచి ఆస్పత్రి యాజమాన్యాలు అధికంగా నగదు వసూలు చేస్తున్నాయని, ఇలాంటి ఆస్పత్రులపై నిఘా ఉంచి, తగు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఈ సమావేశాల్లో జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



పనికిరాకుండా పోయిన మినుముపంటతో రైతులు

విలవిల!

- అత్యధికంగా పంట నష్టపోయిన రైతులు
- బాపులపాడులో అత్యధికంగా 1500 ఎకరాల్లో నష్టం
- 5000 వేల ఎకరాల్లో తుడిచిపెట్టుకుపోయిన వరి
- ప్రభుత్వ ఆదుకోవాలంటూ రైతుల ఆవేదన

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్)

ఇటీవల మొంథా తుపాను దెబ్బకు ఉమ్మడి జిల్లాలో మినుము రైతులు భారీగా నష్టపోయారు. అత్యధికంగా బాపులపాడు మండలంలో 1500 ఎకరాల పంటను కోల్పోవాల్సి వచ్చింది. మెట్ట ప్రాంతాల్లో అత్యధికంగా సాగుచేసిన పంట తుడిచి పెట్టుకుపోయింది. మండల వ్యాప్తంగా కానుమోలు, ఆరుగొలను, తిప్పనగుంట, సిరివాడ, ఓగిరాల, దంటగుంట్ల, రంగయ్యప్పారావుపేట, కాకులపాడు, వైకుంఠలక్ష్మీపురం తదితర గ్రామాల్లోని 16వేల ఎకరాల్లో వరి సాగు చేస్తే ఐదువేల ఎకరాల్లోని పంట నేలవాలి పూర్తిగా దెబ్బతింది. కనీసం పశువుల మేతకు కూడా పనికిరాదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మెట్టప్రాంతాలైన వీరవల్లి, రంగన్నగూడెం, సింగన్నగూడెం, వేలేరు, రేమల్లె, మల్లవల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో సాగుచేసిన మినుము(పీ31 విత్తన రకం), పెసర పంటల్లో అత్యధికంగా మినుము పంట 1500 ఎకరాలకు పైగా పూర్తిగా పనికిరాకుండాపోయింది. కుళ్లిపోయిన స్థితిలో గింజలు బయటపడటంతో రైతుల కంట కన్నీరు వస్తోంది. వేల రూపాయల పెట్టుబడితో సాగుచేసి మినుము చేతికి వచ్చే సమయంలో మొంథా తుపాను దెబ్బకు రైతులు కుదేలవుతున్నారు. ఎక్కువ మంది కౌలు రైతులవడంతో నష్టపరిహారం అందుతుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంట మొత్తం కాయదశలోనే కుళ్లిపోవడంతో తప్పని పరిస్థితుల్లో పలువురు రైతులు దున్నేందుకు సమాయత్తమవుతున్నారు. నష్టపరిహారం అంచనాలే తప్ప కౌలురైతులకు ఇంతవరకూ భరోసా కల్పించలేదని వాపోతున్నారు.




కాయలోనే కుళ్లిపోయి ఎండిన మినుము పంట

నష్టం అంచనాల్లో గందరగోళం

కొందరు రైతులు అటు మెట్ట ప్రాంతంలో ఉద్యాన పంటలు, ఇటు కాలువ కింద ప్రాంతంలో వరి సాగు చేస్తున్నారు. దీనికి తోడు పంటనష్టం నమోదు చేసుకుంటే మిగిలిన పంటను కొనుగోలు చేయరని ఆర్బీకే(రైతు సేవా కేంద్రాలు) సిబ్బంది చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నమోదు చేసుకోవాలో లేదో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నష్టపరిహారం అంచనాల్లో నిబంధనలను కొంతమేర సడలించి ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది

- సాంబశివరావు, సింగన్నగూడెం

కౌలుకు తీసుకుని ఎకరానికి రూ.50వేల పెట్టుబడితో మినుము పంట సాగు చేశాను. మొంథా తుపాను దెబ్బకు మొత్తం నీటిపాలయింది. ప్రభుత్వం కనీసం రూ.30వేలు నష్టపరిహారం ఇస్తేనే మళ్లీ సాగు.. లేకుంటే పస్తులే.

పంట, గడ్డి కూడా పనికిరాకుండా పోయింది

- బేతా శేషుకుమార్, ఆరుగొలను

తుపానుకు తోడు ఈదురుగాలులతో స్వర్ణరకం వరిపంట మొత్తం నేలవాలి కుళ్లిపోయింది. ఎకరానికి ఇప్పటివరకూ రూ.35వేలకు పైగా పెట్టుబడి పెట్టాం. పశువుల మేతకు కూడా గడ్డి పనికిరాకుండా పోయింది.

ప్రాణాలు తీసిన అతివేగం

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్నాడు. ప్రిన్స్‌బాబు విజయవాడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా చేస్తున్నాడు. రాకేష్, ప్రిన్స్ పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. రాకేష్, పాపారావు డిగ్రీ వరకు కలిసి చదువుకోవడంతో వారి మధ్య స్నేహం చిగురించింది. రాకేష్ తండ్రికి టాటా సఫారీ స్ట్రాం కారు ఉంది. ఈ ముగ్గురు యువకులు సోమవారం రాత్రి నగరంలో ఎంజాయ్ చేయాలని నిర్ణయించుకున్నారు. రాకేష్ ఇంట్లో చర్చికి వెళ్తానని చెప్పి బయటకు వచ్చాడు. ఇంటి నుంచి వచ్చేటప్పుడు తల్లిదండ్రులకు తెలియకుండా కారును తీసుకొచ్చాడు. రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ఈ ముగ్గురు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. పాపారావు కుటుంబం ఇంతకు ముందు కంకిపాడు మండలం కుందేరు గ్రామంలో ఉండేది. తర్వాత ఉపాధి నిమిత్తం ఆ కుటుంబం విజయవాడలో గిరిపురానికి మారింది. రాత్రంతా కారులో తిరగాలని భావించిన ఈ ముగ్గురు యువకులు మచిలీపట్నం జాతీయ రహదారిని ఎంచుకున్నారు. విజయవాడ నుంచి నేరుగా కుందేరుకు వెళ్లి అక్కడ పాపారావు బంధువు కొణతం చింతయ్య(19)ను ఎక్కించుకున్నారు. అక్కడి నుంచి ఉయ్యూరు వైపునకు బయలుదేరారు. చింతయ్య గ్రామంలో పాడిరైతుగా ఉన్నాడు.

కారు ఇంట్లోనే ఉందనుకున్న తండ్రి..

అర్ధరాత్రి మూడు గంటల సమయంలో ఉయ్యూరు పోలీసులు రాకేష్ తండ్రి చక్రపాణికి ఫోన్ చేసి మాట్లాడే వరకు తన కారు ఎక్కడ ఉందో ఆయనకు తెలియలేదు. పోలీసులు చక్రపాణికి ఫోన్‌చేసి టాటా సఫారీ స్ట్రాం కారు మీదేనా అని అడిగారు. అప్పటికి ఆయనకు ఏం జరిగిందో తెలియలేదు. పోలీసులు రెండు మూడు సార్లు అడిగేసరికి కారు తన వద్దే ఉందని చెప్పారు. ఈ కారుకు ప్రమాదం జరిగిందని పోలీసులు సమాచారం ఇచ్చిన తర్వాత ఆయన బయటకు వచ్చి చూసుకున్నారు. అక్కడ కారు కనిపించకపోవడంతో షాకయ్యారు. చర్చికి వెళ్తున్నానని చెప్పిన కుమారుడు రాకేష్ కారు తీసుకెళ్తున్నానన్న సమాచారాన్ని తల్లిదండ్రులకు తెలియజేయలేదు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న తర్వాత ఆయన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లారు. జరిగిన ప్రమాదాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. రాకేష్ నడిపిన వేగానికి టాటా సఫారీ కారు కాబట్టి ఆనవాళ్లు మిగిలాయని, అదే మరో కారు అయితే నామరూపాలు ఉండేవి కావని స్థానికులు చెబుతున్నారు.


ఘటనా స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



శోక సంద్రంలో కుటుంబాలు

మొగల్రాజపురం : గండిగుంట పెట్రోలు బంక్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన కారు ప్రమాదంలో మొగల్రాజపురం ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకుల మృతి స్థానికంగా విషాదం నింపింది. ముగ్గురు మిత్రులు కావడం ఆ కుటుంబాలను తీరని వేదనకు గురిచేసింది. రాకేష్ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా, పాపయ్య మెడికల్ ఫీల్డ్‌లో, ప్రిన్స్ రమేష్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. వీరంతా స్థానికంగా అందరికితో కలివిడిగా ఉండే వారు కావడంతో వీరి మరణ వార్త విని స్థానికులు ఆ కుటుంబాలను ఓదారుస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియల కార్యక్రమం పూర్తి చేశారు.

మెగా విజయవాడ!

(5వ పేజీ తరువాయి)

గ్రేటర్ విజయవాడ విషయమై ప్రజాప్రతినిధుల దగ్గర ప్రజలు ఏకరువు పెట్టడం మొదలు పెట్టారు. దీంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఒకడుగు ముందుకు వేసి గ్రేటర్ విజయవాడ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలు పంపించాలని సూచించడంతో ఎన్టీఆర్ జిల్లా అధికారులు గ్రేటర్ ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టారు. గతంలో 45 గ్రామాలను గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలో చేర్చగా.. ఈ దఫా 75 గ్రామాలను జాబితాలో చేర్చారు.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎంపీ చిన్ని

విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని గ్రేటర్ అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ స్థాయిలోనూ చొరవ చూపించారు. దీంతో ఎన్టీఆర్ జిల్లా అధికారులు వేగంగా గ్రేటర్ ప్రతిపాదనలను రూపొందించారు. తాజాగా ఎంఏయూడీకి కూడా పంపించారు. గ్రేటర్ ప్రతిపాదనలపై మంత్రి నారాయణ స్పందించారు. నగర, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నారు. గ్రేటర్‌లో చేర్చే అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానున్నాయి. ప్రస్తుతం జిల్లాల పునర్విభజన చిక్కుముడులకు పరిష్కారం తెలిపే దిశగా ప్రభుత్వం కూడా మంత్రుల బృందాన్ని నియమించింది. మంత్రుల బృందం తుది నివేదిక సమర్పించగానే.. ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇదే సందర్భంలో విజయవాడ గ్రేటర్ అంశం కూడా చర్చకు రానుండటంతో .. ఇప్పటి వరకు ఉన్న గందరగోళానికి తెర పడే అవకాశం ఉంది.

పెనమలూరు నియోజకవర్గంలోని గ్రేటర్ విలీన గ్రామాల సంగతేమిటి?

విజయవాడను ఆనుకుని ఉన్న పెనమలూరు నియోజకవర్గాన్ని వైసీపీ ప్రభుత్వం కృష్ణాజిల్లాలో కలిపింది. దీనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తారని నియోజకవర్గ ప్రజలు ఆశతో ఉన్నారు. పెనమలూరు, కంకిపాడు మండలాల పరిధిలోని గ్రామాలను తాజాగా గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనల్లో చేర్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 12 గ్రామాలను ప్రతిపాదించటం జరిగింది. రెండు మండలాలలో కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు, పెనమలూరు, గంగూరు, గోశాల, ఈడుపుగల్లు, పునాదిపాడు, కంకిపాడు, వేల్పూరు, ఉప్పులూరు గ్రామాలను అప్పట్లో గ్రేటర్ విజయవాడలోకి ప్రతిపాదించారు. ప్రస్తుతం మరో ఏడు గ్రామాలను అదనంగా కలిపి మొత్తం 20 గ్రామాలను ప్రతిపాదించినట్టు తెలుస్తోంది.

స్థానిక శాసన సభ్యుడి విముఖత

పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపే అంశంపై స్థానిక శాసన సభ్యుడు సుముఖంగా లేరని తెలుస్తోంది. నియోజకవర్గాన్ని విలీనం చేయటానికి ఒప్పుకోని ఎమ్మెల్యే గ్రేటర్‌కైనా ఒప్పుకుంటారా అన్నది అనుమానంగానే ఉంది. నియోజకవర్గ ప్రజల అభిష్టానికి భిన్నంగా శాసన సభ్యుడి తీరు ఉండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

బస్సులోనే శస్త్ర చికిత్స శిక్షణ

- 'ఇనిస్టిట్యూట్ ఆన్ వీల్స్' పేరిట ఏర్పాటు
- సిద్ధార్థ మెడికల్ కాలేజీలో 70 మందికి శిక్షణ
- రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో..
- ల్యాప్రోస్కోపిక్ చికిత్సలపై 3 వేల మందికి శిక్షణ లక్ష్యం

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్స విధానంపై శిక్షణ ఇచ్చేందుకు జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ ముందుకొచ్చింది. "ఇనిస్టిట్యూట్ ఆన్ వీల్స్" పేరుతో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల వైద్యులు, విద్యార్థులకు.. ఉచితంగా స్కిల్ ల్యాబ్ శిక్షణ అందిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సోమ, మంగళవారాల్లో విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో 70 మంది జనరల్ సర్జరీ విభాగం విద్యార్థులు, వైద్యులు ఈ బస్సులో శిక్షణ తీసుకున్నారు. "ఇనిస్టిట్యూట్ ఆన్ వీల్స్" ద్వారా అందించే శిక్షణను నవంబరు 10 నుంచి డిసెంబరు 10 వరకూ ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కూడా అందించనున్నారు. బస్సులోనే అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆపరేషన్ థియేటర్‌లో ఎలాంటి వాతావరణం ఉంటుందో బస్సులోనూ అలాంటి అనుభూతి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. "ఇనిస్టిట్యూట్ ఆన్ వీల్స్" ద్వారా యువ శస్త్రచికిత్స నిపుణులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని, రోగులకు మెరుగైన సేవలందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడనుంది. ప్రస్తుతం సిద్ధార్థ మెడికల్ కాలేజీల్లో విద్యార్థులకు శిక్షణ పూర్తయింది. 12, 13వ తేదీల్లో మంగళగిరిలోని ఎన్ఆర్ఐ, 14, 15వ తేదీల్లో ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీ, 17, 18వ తేదీల్లో శ్రీకాకుళం మెడికల్ కాలేజీ, 20, 21, 22వ తేదీల్లో విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ, 24, 25వ తేదీల్లో కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ, 27, 28, 29వ తేదీల్లో గుంటూరు మెడికల్ కాలేజీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం రాయలసీమ ప్రాంతంలోని మెడికల్ కాలేజీల్లో, చివరగా డిసెంబరు 10న అనంతపురం మెడికల్ కాలేజీల విద్యార్థులకు శిక్షణ పూర్తవుతుంది.

ఆర్నెల్లుగా ఖాళీనే..

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగులను బదిలీ చేస్తే సంబంధిత బదిలీల ఫైల్‌పై సంతకం పెట్టేది లేదంటూ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఖరాఖండిగా చెప్పినట్టు ఉద్యోగులు అప్పట్లో చెప్పుకున్నారు. కలెక్టరేట్ పక్కనే ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆరు నెలలుగా 30 మంది ఉద్యోగులకు సీట్లు కేటాయించకుండా, ఖాళీగా కూర్చోబెడుతుండటం చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ ఈ అంశంపై దృష్టి సారించి సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలని జెడ్పీ ఉద్యోగులు కోరుతున్నారు.

వ్యాన్ ఢీకొని వృద్ధురాలు మృతి

ఉంగుటూరు : రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చెన్నై-కోల్‌కతా జాతీయరహదారిపై ఆత్కూరు వద్ద జరిగింది. ఆత్కూరు ఎస్సై ఎన్.లక్ష్మీనరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కటికల జోజమ్మ(60)తన భర్త బాల ఏడేళ్ల క్రితం చనిపోవడంతో ఇద్దరు కుమారులతో కలిసి స్థానిక నయారా పెట్రోల్‌బంక్ సమీపంలోని నివాసముంటోంది. విజయ్ కోసం సోమవారం రాత్రి సుమారు 7గంటల సమయంలో జోజమ్మ రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి ఏలూరువైపు వేగంగా వెళుతున్న టాటాఏస్ వ్యాన్ ఢీకొట్టింది. తీవ్రగాయాలైన జోజమ్మను 108అంబులెన్స్‌లో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

రైతు కష్టం దోపిడీ!

- పత్తి రైతును ఆదుకోని కొనుగోలు కేంద్రాలు
- దళారులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు
- నిబంధనలు సడలించి ఆదుకోవాలంటూ ఆవేదన


పండిన కొద్ది పాటి పత్తిని బోరాలలో నింపుతున్న రైతు

నందిగామ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : దళారుల దోపిడీ, మార్కెట్ మాయాజాలం నుంచి అన్నదాతను ఆదుకొనే లక్ష్యంతో ఏర్పడిన సీసీఐ లక్ష్యాలను పక్కన పెట్టి వ్యాపార ధోరణితో కొనుగోలు చేపడుతోంది. వ్యాపార దృక్పదంతో సీసీఐ ఏర్పాటు చేసుకున్న నిబంధనలతో పాటు బయ్యర్లు, మార్కెటింగ్ సిబ్బంది స్వార్థపూరిత చర్యలతో పత్తి రైతు చిత్తవుతున్నాడు. సీసీఐ కేంద్రాలకు వెళ్లడం కంటే గ్రామాల్లో దళారులను ఆశ్రయించడమే మేలు అన్న స్థితికి పత్తి రైతులను కృంగదీస్తున్నారు. కొన్నేళ్లుగా సీసీఐ కేంద్రాలకు రైతులు వెళ్లడం మానేశారు. కేవలం దళారులే అక్కడకు పత్తిని తీసుకువెళుతున్నారు. ఒక వేళ ఎవరైనా రైతులు ఆశతో పత్తిని తీసుకువెళ్లినా బయ్యర్లు ఆ పత్తిని కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు. పాలకుల పర్యవేక్షణా లేమి, రైతుల నిస్సహాయతను ఆసరా చేసుకొని బయ్యర్లు, సీసీఐ సిబ్బంది దోపిడీ చేస్తున్నారు.

మొంథా తుపాను ప్రభావంతో గతంలో ఎన్నడూలేని విధంగా పత్తి రైతులు దెబ్బతిన్నారు. దిగుబడి పడిపోయి నాణ్యత కూడా తగ్గింది. ఈ తరుణంలో అన్నదాతకు అండగా ఉండాల్సిన సీసీఐ మొఖం చాటేస్తున్నది. పత్తి రైతుల దీనస్థితిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి సీసీఐ కేంద్రాలను ప్రారంభింపజేసింది. రైతుల వద్ద ఉన్న పత్తిని నాణ్యతతో సంబంధం లేకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని కోరింది. అధిక వర్షపాతంతో పత్తిలో తేమ ఉన్నందున సీసీఐ నిబంధనలను సడలించి పత్తి రైతును ఆదుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖరాసింది. రైతులకు ధైర్యం కల్పించేందుకుగాను మార్కెట్ యార్డులలో సీసీఐ కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించింది. ఆమేర సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదు. ప్రారంభించిన రోజు మినహా ఇంతవరకూ ఒక్క కిలో పత్తి కొనలేదు. సీసీఐ కేంద్రాలలో పత్తి కొనుగోళ్లు జరిపితే రైతులు నేరుగా తమ పత్తిని అక్కడ అమ్ముకోగలుగుతారు. కేంద్రాలలో కొనుగోలు చేసిన పత్తిని మిల్లులకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు టెండర్లు పూర్తి కాలేదన్న నెపంతో బయ్యర్లు అక్కడ కొనుగోళ్లు జరపడం లేదు. నందిగామ, కంచికచర్ల సీసీఐ కేంద్రాలకు గుంటూరు మిల్లులకు జత చేశారు. ట్రాన్స్‌పోర్టు టెండర్లు పూర్తి కానందున రైతులు తమ పత్తిని నేరుగా గుంటూరులోని మిల్లులకు తరలించాలని సూచిస్తున్నారు. సన్న చిన్న కారు రైతులు తమ వద్ద ఉన్న పత్తిని గుంటూరు తీసుకువెళ్లలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. సీసీఐ మద్దతు ధర 8110 రూపాయలు ఉండగా దళారులు 45 వందల నుండి ఐదు వేల రూపాయల వరకూ మాత్రమే చెల్లిస్తూ పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. అదికూడా నాణ్యమైన పత్తిని మాత్రమే ఆ ధరకు కొంటున్నారు. మసర ఉన్న పత్తిని, కాయలు ఉన్న పత్తిని మరీ తక్కువ ధరకు అడుగుతున్నారు. కేవలం పత్తి తీతలకే క్వింటాకు 25 వందల వరకూ ఖర్చు చేసిన అన్నదాతలు ఆధరకు పత్తిని అమ్మలేక మౌనంగా రోధిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సీసీఐ నేడు బయ్యర్లు, దళారుల పరమైందని చెప్పాలి. గుంటూరు మిల్లులకు దళారులు తీసుకువెళ్లిన పత్తికి అధిక ధర అందిస్తూ దొడ్డి దారిన వారి వద్ద నుండి సీసీఐ అధికారులు లబ్ధి పొందుతున్నారు. ఆరుగాలం శ్రమించిన అన్నదాత కష్టాన్ని ఆఖరి క్షణంలో పంచుకుంటూ వారు లబ్ధి పొందుతున్నారు. మరోవైపు గుంటూరు చేరిన పత్తికి చెల్లించాల్సిన రవాణా కిరాయిలను కూడా సీసీఐ సిబ్బంది లెక్క రాసుకొని జేబుల్లో వేసుకుంటున్నారు. అదే రైతుల వద్ద కొంటే కిరాయి సొమ్ము మిగుల్చుకొనే వీలు లేనందున సీసీఐ అధికారులు దళారులను ప్రోత్సహిస్తున్నారు. పత్తి కొనుగోళ్లు చేపట్టాలని నెల రోజుల క్రితమే నిర్ణయించిన సీసీఐ ట్రాన్స్‌పోర్టు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయకపోవడం దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిల్లుల వద్ద పత్తి కొనుగోళ్లు నిలిపివేసి పూర్తి పత్తిని సీసీఐ కేంద్రాల వద్దనే చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేర నిబంధనలు సడలించి పూర్తి పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గన్నీ బ్యాగ్‌ల సొమ్ము గోల్‌మాల్..

కొనుగోలు కేంద్రాలలో రైతులు తీసుకువచ్చిన పత్తికి ధర ఇవ్వడంతో పాటు పత్తి బోరాలకు సంబంధించి 30 రూపాయల చొప్పున సీసీఐ చెల్లించాల్సి ఉంది. తొలి రోజుల్లో అలా చెల్లించినా.. రాను రాను రైతులు తగ్గి దళారుల సంఖ్య పెరగడంతో సీసీఐ అధికారులు బోరాల సొమ్ము ఇవ్వడం మానేశారు. దళారులు ఆమేర సొమ్మును రైతు నుండి దోచుకోవడం ప్రారంభించారు. మొత్తం మీద సీసీఐ కేంద్రాలు దళారులకు, సీసీఐ అధికారులకు స్వర్గధామంలా మారాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆపదలో ఉన్న పత్తి రైతును ఆదుకోవాల్సి ఉంది. స్థానికంగా కొనుగోళ్లు చేపట్టి సీసీఐ ఫలాలు నేరుగా రైతులకు అందేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.


తేమ శాతం తగ్గించేందుకు ఆరబోసిన పత్తి

లయోలలో జాతీయ విద్యాదినోత్సవం

భారతీనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఐక్యూఏసీ, సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ విద్యా, ప్రపంచ విజ్ఞాన దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్యదర్శి, డైరెక్టర్ ఫాదర్ జె.ఎస్ జోజి రెడ్డి, ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ప్రస్తుతం రోజుల్లో విజ్ఞాన రంగంలో మార్పులను విద్యార్థులకు తెలియజేశారు. ప్రముఖ శాస్త్రవేత, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ మాజీ అధికారి డాక్టర్ మణిమొళి ఆన్‌లైన్ విద్యార్థులకు పలు విషయాలను తెలియజేశారు. ప్రిన్సిపాల్ ఓ మహేష్, సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సుధాకర్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

హై 'టెన్షన్' సీన్ రిపీట్

- ఆయుష్ హాస్పిటల్ సమీపంలో టవర్‌లైన్స్ రోడ్డుపై తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ వైరు
- విద్యుత్ అధికారులు... హైటెన్షన్ టవర్ లైన్స్ బలోపేతం చేయండి
- డబుల్ సస్పెన్షన్ వేస్తేనే సమస్యకు పరిష్కారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఒకసారి ప్రమాదం జరిగినా.. విద్యుత్ శాఖ అధికారులలో అప్రమత్తత రావటం లేదు ! సరిగ్గా నెల రోజుల కిందట ఆయుష్ హాస్పిటల్ సమీపంలో టవర్‌లైన్స్ రోడ్డుపై హైటెన్షన్ కండక్టర్ (విద్యుత్ వైరు) తెగి ఓ ప్రైవేటు కాలేజీ బస్సుపై పడటంతో త్రుటిలో భారీ ప్రమాదం తప్పింది. మళ్లీ మంగళవారం ఇదే ప్రాంతంలో మరో టవర్‌కు ఉన్న కండక్టర్ ఊడి వేలాడటంతో .. కంగారు పడిన స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్‌శాఖ సిబ్బంది వచ్చి దానిని సరిచేశారు. హైటెన్షన్ వైర్లు సాధారణంగా తెగవు. ఇవి చాలా దుర్భేద్యంగా ఉంటాయి. లైన్లు వేసేటపుడు వీటిపై మనుషులు కూడా కూర్చుంటారు. దీనిని బట్టి ఇవి ఎంత బలంగా ఉంటాయో తెలిసిందే ! అలాంటిది విజయవాడ నగరంలో తరచూ హైటెన్షన్ వైర్లు తెగటం



హైటెన్షన్ టవర్ నుంచి తెగి వేలాడుతున్న కండక్టర్

ఆందోళన కలిగిస్తోంది. డబుల్ సస్పెన్షన్‌తో లైన్లు వేస్తే అత్యంత దృఢంగా ఉంటాయి. కానీ విద్యుత్‌శాఖ అధికారులు ఆ పనిచేయకపోవటంతో వైర్లు తెగుతున్నాయి. ఒక ప్రాంతలో ఒకసారి విద్యుత్ వైరు తెగినపుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. హైటెన్షన్ టవర్లను



ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురించిన హై టెన్షన్ కథనం

తరచూ పరిశీలిస్తుండే బృందాలు సరిగా పనిచేయటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మంగళవారం పైన ఉన్న కండక్టర్ లైన్, కింద ఉన్న కండక్టర్ లైన్‌కు అనుసంధా నమయ్యే తక్కువ పరిమాణపు కండక్టర్ మాత్రమే తెగి వేలాడుతూ కనిపించింది. అదే పెద్ద కండక్టర్ తెగి కింద పడితే మూల్యం చెల్లించుకునే పరిస్థితి ఏర్పడేది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు ఒక డ్రైవ్ పెట్టి హైటెన్షన్ వైర్లను బలంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆటోనగర్ రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

- తరలించని పూడిక మట్టి
- ఇబ్బందిపడుతున్న ప్రజలు



ఆటోనగర్ ఏటీపీ సెంటర్‌లో రోడ్డుపై పూడికమట్టి, ప్రవహిస్తున్న మురుగునీరు

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: జవహర్ ఆటోనగర్‌లో ఏ రోడ్డులో చూసినా మురుగే కనిపిస్తోంది. డ్రెయినేజీలు పూడిపోయి ఆటోనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. దీంతో అంతర్గత రోడ్లు మురుగుకూపాల్లా తయారయ్యాయి. రోడ్లపై వర్షపునీటితో పాటు మురుగునీరు కూడా నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు వృద్ధిచెంది అనారోగ్యాలకు కారణమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆటోనగర్‌లోని ఫైర్‌స్టేషన్ రోడ్డు, ఏటీపీ సెంటర్, పాకలరోడ్డు, సన్‌లైట్ సెంటర్‌తోపాటు పలు అంతర్గత రోడ్లలో ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా డ్రెయినేజీల్లో తీసిన పూడికమట్టిని తరలించకపోవడంతో వర్షాలకు రోడ్లపైకి వచ్చి ఇబ్బందికర పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఐలా అధికారులు దృష్టి సారించి ఆటోనగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడంతోపాటు పూడిక మట్టిని తొలగింపజేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో , నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, ఆంధ్రరత్న భవన్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

లబ్బీపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని కార్యాలయంలో మంగళవారం దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మైనార్టీ సంక్షేమ దినోత్సవం, నేషనల్ ఎడ్యుకేషనల్ డే ను నిర్వహిస్తున్నారని, విద్య అనేది వ్యక్తి ప్రగతి మాత్రమే కాదని మొత్తం జాతి నిర్మాణానికి, పురోగతికి పునాది వంటిదని పేర్కొన్నారు. ముస్లిం అడ్వొకేట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మతీన్, జమాతే అహిలే హదీస్ నగర్ అధ్యక్షుడు నసీర్ అహ్మద్ ఉమ్రి, షఫీ అహ్మద్, చాంద్ బాషా, జిలాని తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీలో ...

కార్పొరేషన్: భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఘ నంగా నిర్వహించారు. తొలుత మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఇన్‌చార్జి కమిషనర్ ఏ.రవీంద్రరావులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఏ. రవీంద్రరావు మాట్లాడుతూ హిందూ-ముస్లిం ఐక్యత, లౌకిక విద్యా విధానానికి బలమైన పునాది వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి. వెంకటనారాయణ, మేనేజర్ ప్రభావతి, వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రరత్న భవన్‌లో..

గవర్నర్‌పేట: ఏపీసీసీ, నగర కాంగ్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆజాద్ చిత్రపటానికి పీసీసీ ఉపాధ్యక్షుడు వి. గుర్నాథం, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ ఖుర్షీదా, సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ అన్సారీ, ప్రధాన కార్యదర్శులు అశోక్‌పారోస్, నేలపాటి సుభాష్ ఓగ్గు రమణ, తూర్పు ఇన్‌చార్జి దూళిపాడి నాగేంద్ర, బీసీ సెల్ అధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్టీసీ హౌస్‌లో ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న సంస్థ ఈడీ రవివర్మ

ఆర్టీసీ హౌస్‌లో...

వన్‌టౌన్: పండిట్ నెహ్రూ బస్టేషన్ ప్రాంగణంలోని ఆర్టీసీ హౌస్‌లో జరిగిన ఆజాద్ జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) రవివర్మ పాల్గొని ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్) ఎ.అప్పలరాజు, ఎఫ్ఏసీఏవో ఎన్.సుధాకర్‌రావు, ఏడీ (వీఅండ్ఎస్) శోభా మంజరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి అభివృద్ధిని వివరించండి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పేరుతో అమలు చేసిన సంక్షేమపథకాలతో పాటు రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని పార్టీ నేతలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. అశోక్‌నగర్ లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ కమిటీ నేతలతో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ స్థానికులతో మాట్లాడే సమయంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను కూడా నమోదు చేసుకుని, వాటిని తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వాటిని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి పెట్టి నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సినియర్ నేతలు బొప్పన భవకుమార్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కొలిక్కివచ్చిన డివిజన్ల అధ్యక్షుల ఎంపిక

- 16కు పున్నవల్లి రాధాకృష్ణ, 17కు రాయి రంగమ్మ, 18కు కొక్కెర తిరుపతయ్య
- నేడు ప్రమాణస్వీకారం

రాణిగారితోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డివిజన్ల ఎంపిక పంచాయితీ ఎట్టకేలకు గ్రహణం వీడింది. గత కొన్ని నెలలుగా ఏర్పడిన సందిగ్ధాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కొలిక్కి తెచ్చారు. దీంతో నూతన అధ్యక్షులు ప్రమాణ స్వీకారం బుధవారం జరగనుంది. నియోజకవర్గంలో ఇప్పటికే మూడు పర్యాయాలు అధ్యక్షులుగా ఉన్న వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని పార్టీ అధిష్టానం చెప్పిన నేపథ్యంలో ఎంపిక కత్తిమీద సాములా తయారైంది. కొన్ని డివిజన్లలో అందరి సయోధ్యతో ఎంపిక జరిగినా కొన్ని చోట్ల తలనొప్పిగా మారింది. సయోధ్య కుదర్చడానికి ఎమ్మెల్యే ఎంత ప్రయత్నించినా కొన్ని డివిజన్లలో అది సాధ్యం కాలేదు. వేచి చూసే ధోరణి అవలంబించిన అధిష్టానం అన్ని కమిటీల ఎంపికతో పాటు ప్రమాణస్వీకారం వెంటనే చేయాలని చెప్పడంతో ఎంపిక నిర్ణయాన్ని ముగించారు.

ప్రధానంగా కృష్ణలంక ప్రాంతంలో 15, 16, 17, 18, 20, 21, 22 డివిజన్ల విషయంలో ఒకటి రెండు డివిజన్లు తప్ప మిగిలిన వాటిలో ఎంపిక పై ఏకాభిప్రాయం కుదిరింది. 16వ డివిజన్ అధ్యక్షుడిగా పున్నవల్లి రాధాకృష్ణ, 17వ డివిజన్ అధ్యక్షురాలుగా రాయి రంగమ్మ, 18వ డివిన్ అధ్యక్షుడిగా కొక్కెర తిరుపతయ్య ఎంపికయ్యారు. కుదరని వాటిలో ఐవీఆర్ పద్ధతిలో ఎంపికలు నిర్వహించి అక్కడ అధ్యక్షులను నియమించారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి నూతన అధ్యక్షుల విషయాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వివరించినట్లు తెలిసింది. కొందరి విషయంలో అభ్యంతరాలు వచ్చినా బుజ్జగించి చివరికి అన్ని డివిజన్ల అధ్యక్షులను ఎంపిక చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

డివిజన్ల కార్యదర్శులు ఇతర పదవులను ఎంపిక చేసి ఆయా పేర్లను పంపాలని వారి ప్రమాణ స్వీకారం కూడా బుధవారం ఉంటుందని చెప్పడంతో ఆయా కమిటీల ఎంపికలో నూతన అధ్యక్షులు నిమగ్నమై ఉన్నట్లు సమాచారం.

వీపీ సిద్ధార్థలో క్రీడా పోటీలు ప్రారంభం



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన కేసీపీ సిద్ధార్థ ఆదర్స్ రెసిడెన్షియల్ జట్టు

మొగల్రాజపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల్లో భాగంగా వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్న స్పోర్ట్ ఏ థాన్‌లో భాగంగా జరుగుతున్న క్రీడాపోటీలను దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ దొమ్మరాజు నరేంద్ర వర్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడలను అభ్యాసం చేస్తూ అనవసర విషయాల పట్ల వైరాగ్యం పెంచుకోవాలని చెప్పారు. దీని వల్ల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సహనం పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సిద్ధార్థ అకాడమీ సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు చనుమోలు కృష్ణారావు, గవర్నింగ్ బాడీ సభ్యులు శ్రీహరిరావు, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ కన్వీనర్ శశికళ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ , కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ చేశారు. వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ జిమ్నాస్టిక్స్ విద్యార్థులు ఏరోబిక్స్ ప్రదర్శించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో విజేతలకు టీడీపీ అధికార ప్రతినిధి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. క్రీడల్లో అత్యధిక ప్రతిభ చూపిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు డాక్టర్ బి. రుషిల్, హెడ్ కోచ్ అండ్ ఫౌండర్ ఆఫ్ ట్రిమెట్రిక్స్ ఇంటర్నేషనల్ స్కేటర్ రియా సాబు, జాతీయ అథ్లెట్ వీకే విశాల్‌లను సత్కరించారు. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కేసీపీ సిద్ధార్థ రెసిడెన్షియల్ పాఠశాల గెలుచుకుంది. వీరికి ట్రోఫీతో పాటు రూ.20వేలు నగదు బహుమతి అందించారు. వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ యోగాసన జట్ల ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ వి.రాధిక రెడ్డి తదితరులు

విజయవాడస్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 2025-26సంవత్సరానికి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ యెగాసన చాంపియన్‌షిప్‌లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సెన్సెస్ యోగాసన పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఈ ఎంపికలు మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధిక రెడ్డి తదితరులు అభినందించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో అహ్వాన్‌కు చోటు



విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిట్ట కొంచెం కూత ఘనం అన్న సామెతను నిజం చేస్తూ అద్భుతమైన మేధాశక్తితో ఈ చిన్నారి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించాడు. నగరానికి చెందిన రెడ్డి జైవీర్ అహ్వాన్ ఆరేళ్ల వయస్సులో సూపర్ గ్రాస్పింగ్ పవర్‌తో అతి తక్కువ సమయంలో దాదాపు 180దేశాల పేర్లు వాటి రాజధానులు, జాతీయ జెండాలు గుర్తిస్తాడు. అంతే కాకుండా 100కి పైగా జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలకు సమాధానం చెప్పడంతో పాటు 30కి పైగా స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు చెప్పి తన ప్రతిభను చాటుతున్నాడు. ఈ సందర్భంలో గత సెప్టెంబరులో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం జైవీర్ ప్రతిభను తల్లిదండ్రులు వీడియో రికార్డ్ చేసి పంపారు. కేవలం 6నిమిషాల 2సెకన్ల వ్యవధిలో 153 దేశాల పేర్లు, వాటి జాతీయ జెండాలు గుర్తించిన వీడియోను సదరు సంస్థ అన్ని పరీక్షలు అనంతరం చిన్నారి ప్రతిభను గుర్తించి అక్టోబరు 7న అవార్డు ప్రకటించింది. ఈ అవార్డు నెల 10న చిన్నారికి చేరింది. దీంతో జైవీర్ తల్లిదండ్రులు చంద్రకాంత్, దేవిహేమలు ఆనందం వ్యక్తం చేస్తూ చిన్ననాటి నుంచే అతనిలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించామని, ఈ రోజు అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

చదువుతోపాటు విలువలతో కూడిన జ్ఞానాన్ని అలవర్చుకోవాలి

ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

గుణదల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యత అంటే కేవలం అక్షరజ్ఞానమే కాదని ఆలోచించే శక్తి నైపుణ్యతను పెంపొందించేందుకు దోహదపడుతుందని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జాతీయ అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమం ఎస్ఆర్ఆర్ కళాశాలలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానదీపాన్ని వెలిగించి అజ్ఞానాన్ని తొలగించే విషయమై కొంత సమయాన్ని కేటాయించాలని పిలుపునిచ్చారు. చదువుతోపాటు విలువలతో కూడిన జ్ఞానాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాను నూటికి నూరుశాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దడంలో యువత పాత్రధారులు కావాలన్నారు. అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.జాన్ సుకుమార్, అధ్యాపకులు డాక్టర్ బి. శుభ, డాక్టర్ సుధాకర్, డాక్టర్ నారాయణరావు, శ్రీ చరిత, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో సహస్ర దీపార్చన

ఇంద్రకీలాద్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో మంగళవారం రాత్రి సహస్ర లింగార్చన సేవ, సహస్ర దీపార్చన,ఊంజల్ సేవలు నిర్వహించారు. సహస్ర లింగార్చనలో బిల్వ పత్రాలు, వివిధ రకాల పుష్పాలను సమర్పించారు. సాయంత్రం జరిగిన దీపోత్సవంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.



ఎన్టీటీపీఎస్ డ్రెయినేజీ నుంచి కృష్ణానది చన్నీళ్ల కాలువలోకి వెళుతున్న బూడిద నీరు

తాగునీటిలోకి మరోమారు బూడిద నీరు

- మారని ఎన్టీటీపీఎస్ వక్రబుద్ధి
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఇంకెనాళ్లు..!

ఇబ్రహీంపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్ యాజమాన్యం తన వక్రబుద్ధిని పదే పదే ప్రదర్శిస్తూనే ఉంది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూనే ఉంది. ప్రజలకు సరఫరా చేసే కృష్ణాజలాల్లోకి బూడిద నీరు వదలవద్దని జిల్లా ఉన్నతాధికారులు చెప్పినా ఖాతరు చేయకుండా మంగళవారం మరోమారు కృష్ణానదిలోకి ప్లాంట్‌లోని డ్రెయినేజీ ద్వారా 4గంటల పాటు విపరీతంగా బూడిద నీటిని వదిలారు. దీంతో ఫిల్టర్ బెడ్స్‌లో శుద్ధి నిలిచిపోయింది. దీంతో ఒక పూటంతా కృష్ణాజలాల సరఫరా ఆగిపోయింది. ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది విషయాన్ని స్థానిక టీడీపీ ప్రజా ప్రతినిధుల దృష్టికి తేవడంతో వారు స్పందించి ఎన్టీటీపీఎస్ అధికారులతో మాట్లాడటంతో అధికారులు బూడిద నీటిని రాకుండా ఆపేశారు. ఎన్టీటీపీఎస్ అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. కుక్కతోక వంకరలా అధికారులు తీరు ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీటీపీఎస్ అధికారులు పదే పదే ఇలా చేస్తే మరో ఉద్యమానికి వెనుకాడేది లేదని కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు స్పష్టం చేశారు.

దుర్గగుడి సెక్యూరిటీ టెండర్ కేటాయించాల్సిందే..!

- అధికారులపై రాయలసీమకు చెందిన వైసీపీ నేత ఒత్తిడి

ఇంద్రకీలాద్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పలువురు వైసీపీ నేతలు ప్రభుత్వ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేసి తమకు అనుకూలంగా పనులు చేయించుకుంటున్నారు. రాష్ట్రంలో 2వ అతిపెద్ద దేవస్థానమైన దుర్గగుడి ప్రైవేటు సెక్యూరిటీ టెండర్‌ను తమకు కేటాయించాలంటూ వైసీపీకి చెందిన రాయలసీమ ప్రాంతానికి చెందిన నేత దేవదాయ శాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఆ నేతకు ఓ మంత్రితో బంధుత్వం ఉండటం వల్ల ఎలాగైనా టెండర్ దక్కించుకోవటానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఉన్నతాధికారులు మాత్రం ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలోని ఏడు ప్రధాన దేవాలయాలకు భద్రతా గార్డులు, భద్రతా పర్యవేక్షకులను రెండేళ్ల పాటు నియమించేందుకు ఇటీవల దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం అక్టోబరు 10న టెండర్లు పిలిచింది. అక్టోబరు 30తో దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. అందులో భాగంగా దుర్గగుడికి ఇద్దరు కాంట్రాక్టర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా దాఖలు చేశారు. వీటిలో ఒక సంస్థకు సరైన పత్రాలు లేవని, మరో సంస్థ నిబంధనలు మేరకు పత్రాలను దాఖలు చేయలేదని తెలుస్తోంది. అయితే ఈ సంస్థ రాయలసీమకు చెందిన వైసీపీ నేతదని, మంత్రితో బంధుత్వం ఉండటంతో ఎలాగైనా టెండర్‌ను దక్కించుకోవటానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తుంది. ఈ విషయాన్ని దేవదాయ శాఖ ఓ ఉన్నతాధికారి దేవదాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది.

పారిశ్రామిక హబ్‌గా సెంట్రల్

- ప్రభుత్వ విప్ బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కుల ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వర్చువల్ పద్ధతిలో సీఎం చంద్రబాబు కనిగిరి నుంచి ఫ్లోటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌లో రూ.13.78 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు శంకుస్థాపనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు రెడీమేడ్ గార్మెంట్స్ తయారీ వంటి పారిశ్రామిక యూనిట్లు ఈ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. విజయవాడ అర్బన్ క్లస్టర్‌లోని కీలకప్రాంతంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ వచ్చినందుకు సంతోషంగా ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తికి అనుగుణంగా వీటిని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. తక్కువ పెట్టుబడితో పారిశ్రామిక యూనిట్లు స్థాపించి తమ కాళ్లపై తాము నిలబడి పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళలు, యువత ఎదగాలన్నారు. నేతలు ఎరుబోతు రమణారావు, కంచి ధనశేఖర్, జిల్లా పరిశ్రమల అధికారి పీ మధు పాల్గొన్నారు.



ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బొండా, కలెక్టర్ లక్ష్మీశ

కుష్టు నివారణపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

- కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి నివారణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, వ్యాధిగ్రస్థులను గుర్తించి అవసరమైన వైద్య సహాయం అందించడం ద్వారా వ్యాధిని సమూలంగా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఈనెల 17 నుంచి 30 వరకు జిల్లాలో నిర్వహించనున్న కుష్టు వ్యాధి పరీక్షల నిర్వహణ, వ్యాధిగ్రస్థుల గుర్తింపుపై మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ఈనెల 17 నుంచి 30 వరకు మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం 1296 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ బీ భానునాయక్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి లక్షణాలున్నవారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక క్యాంపులు పెట్టనున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్లు, పారా మెడికల్ సిబ్బంది, ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి వైద్య అధికారులకు అందచేస్తారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 54 లెప్రసీ కేసులను గుర్తించామనీ, వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా వైద్యసేవలు అందించడంతో పాటు పింఛన్లు అందచేస్తున్నట్టు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం రమాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జే ఇందుమతి, డాక్టర్ పీ నవీన్, డాక్టర్ స్నేహ సమీరా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారాల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సేవాభూషణ్, విద్యాభూషణ్ జాతీయ స్థాయి పురస్కారాలు-2025 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 30న హైదరాబాద్‌లో తెలుగు రాష్ట్రాల్లోని సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, కరోనా సేవకులు, యోగ, మెడిటేషన్, సంగీత, నృత్య గురువులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, కార్మిక కర్షక సేవకుల ప్రతిభను గుర్తించి పురస్కారాలిచ్చి ఘనంగా సన్మానించడం జరుగుతుందన్నారు. తమ సేవలను, ప్రతిభను తెలిపే వివరాల జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను దరఖాస్తుతో పాటు జత చేసి ఈనెల 20లోపు సంస్థ కార్యాలయానికి అందేలా పంపాలన్నారు.

మాదక ద్రవ్యాలపై పోరు ఉధృతం

- ఎస్ కార్డ్ నషా ముక్త్ భారత్ అభియాన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల బారిన పడకుండా యువతను చైతన్య పరచాలని, దీనికై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో ఎస్ కార్డ్ & నషా ముక్త్ భారత్ అభియాన్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో 217 డ్రగ్ హాట్‌స్పాట్లను గుర్తించినట్టు చెప్పారు. గడిచిన 3 నెలల్లో జిల్లా ఈగల్ బృందం రైళ్లలో ఏడు సోదాలు, బస్సులు, బైక్‌లు, గోడౌన్లలో 10 సోదాలు నిర్వహించి డ్రగ్స్‌ని సీజ్ చేసినట్టు తెలిపారు. దాదాపు 200 మంది డ్రగ్స్ బాధితులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు చెప్పారు. ఒడిశా నుంచి విజయవాడ మీదుగా ఉత్తరభారతానికి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠాను ఆటోనగర్‌లో గుర్తించి 5 లారీలు, ఒక కారు సీజ్ చేసి, ఐదుగురిని అరెస్టు చేసిన ఈగల్ బృందానికి అభినందనలు తెలిపారు. సామాజిక బాధ్యతగా మాదకద్రవ్యాల నిరోధానికి తమ వంతు కృషి చేస్తామని కమిటీ సభ్యుల చేత కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ కామరాజు, ఈగల్ సీఐ ఎం రవీంద్ర, ఎస్ఐ ఎం వీరాంజనేయులు, ఎస్ఆర్ఆర్ & సీవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, ఎన్జీవోలు పాల్గొన్నారు.

ఏపీ సచివాలయ ఎస్పీఎఫ్ పోలీస్ సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఎస్పీఎఫ్ పోలీసు సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలను మంగళవారం అమరావతి సచివాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ వర్మ ఆదేశాల మేరకు మందడంలోని హాసిని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రహీమ్ బాషా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ముఖ్యభద్రతాధికారి మల్లికార్జునరావు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ఎస్పీఎఫ్ సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఎస్పీఎఫ్ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఆర్‌ఏల సమస్యలపై పోరుకు జేఏసీ ఏర్పాటు

- డిసెంబరు 16న సీపీఎల్ఏ కార్యాలయం ముట్టడి

గాంధీనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని వివిధ వీఆర్‌ఏ సంఘాలతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. స్థానిక దాసరిభవన్‌లో ఈ సమావేశం మంగళవారం జరిగింది. పెద్దన్న ఛైర్మన్‌గా, ఎం బాలకాశీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏపీ వీఆర్‌ఏ జేఏసీ ఏర్పాటైంది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ డిసెంబరు 16న తలపెట్టే చలో సీసీఎల్ఏ కార్యాలయం ముట్టడికి మద్దతు తెలిపారు. పెద్దన్న, బాలకాశీ మాట్లాడుతూ నామినీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా న్యాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. జేఏసీ ఉపాధ్యక్షులుగా టీ అంజి, ఎస్ నగేష్, జీ ధైర్యం, మద్రి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా గణేష్, ఆంజనేయులు, ఈశ్వరయ్య, సురేష్, రాజు, వీరభద్రరావు, బొడ్డు వెంకటరత్నం, వివేకానంద ఎన్నికయ్యారు.

18న కాపు సంఘాల రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళనం

గాంధీనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల ప్రజలకు జనాభా ప్రాతిపదికగా 'మేమెంతోమాకంత' ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కాపు రిజర్వేషన్ పోరాట సమితి (కేఆర్‌పీఎస్) రాష్ట్ర కన్వీనర్, కో-కన్వీనర్ కాకిలేటి హరనాథ్ కూటమి ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటన డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఛైర్మన్ చనమల్ల ప్రసాదరావు అధ్యక్షతన ఈ నెల 18న తణుకులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వనభోజనానికి కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సే మీడియాతో పంచుకున్నారు.

- కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.
- నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో



కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్'(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా 'రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆద్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రోలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 12 నవంబరు 2025



విజేత

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు. **కుంచల కైవల్యరెడ్డి**కి ఈ నానుడి మెరుగ్గా వర్తిస్తుంది. ఎనిమిది, పదో తరగతుల్లోనే గ్రహశకలాలను కనుగొన్న ఈ 17 ఏళ్ల అమ్మాయి, తాజాగా అంతరిక్షంలోకి అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్న తెలుగమ్మాయిగా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా కైవల్య 'నవ్య'తో పంచుకున్న విశేషాలు...

అంతరిక్షంలోకి తెలుగమ్మాయి

> మనమిప్పుడు ఆవిష్కరించిన అంశం భవిష్యత్తులో ఉపయోగపడవచ్చు. ఒకప్పుడు న్యూటన్ కనిపెట్టిన లాస్ ఆఫ్ ఫిజిక్స్ అద్భుతమైన ఆవిష్కరణ. కానీ అప్పటి వాళ్లకు దాని విలువ తెలియదు. కానీ ఇప్పుడు కూడా న్యూటన్ లాస్ మనకు అక్కరకొస్తున్నాయి. నేను కూడా కొన్ని శతాబ్దాల పాటు ఉపయోగించుకోగలిగే అంశాలను ఆవిష్కరించాలని కోరుకుంటున్నాను. మా స్వస్థలం, బాపట్ల జిల్లా బేతంపూడి. నాన్న కుంచాల శ్రీనివాసరెడ్డి నిడదవోలు మండలంలోని సమిశ్రగూడెం సచివాలయంలో కార్యదర్శిగా పని చేస్తున్నారు. అమ్మ కుంచాల విజయలక్ష్మీ గృహిణి. ప్రస్తుతం, ఆస్ట్రానమీ కిడ్స్ క్లబ్ సహ వ్యవస్థాపకురాలిగా, స్పేస్‌పోర్ట్ ఇండియా ఫౌండేషన్ రాయబారిగా వ్యవహరిస్తున్నాను. జీరో గ్రావిటీ, పారాబొలిక్ ఫ్లైట్స్, స్క్యూబా డైవింగ్, ఈవా డైవింగ్, న్యూట్రల్ బోయన్సీ, హై-ఆల్టిట్యూడ్ స్కైడైవింగ్, ఎక్స్‌టెన్సివ్ మౌంటెన్ హైకింగ్ వంటి వాటిలో శిక్షణ పొందిన తర్వాత అభ్యర్థులందరం మా మా మిషన్ అసైన్‌మెంట్‌లను అందుకుని, అధునాత శిక్షణ దశలోకి ప్రవేశించడంతోపాటు శాస్త్రీయ ప్రయోగాలు చేపడతాం.
>
> \- కైవల్య

ఆకాశం వైపు చూసిన ప్రతి ఒక్కరికీ అక్కడ కనిపించే నక్షత్రాలు, చంద్రుడిని దగ్గరి నుంచి చూడాలనీ, వాటిని తాకాలని అనిపిస్తుంది. వాటి గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటే, ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవలసింది మిగిలి ఉంటూనే ఉంటుంది. ఖగోళ అంశాలు అంతటి విస్తృతమైనవి. అందర్లాగే నాక్కూడా చిన్నప్పటి నుంచి ఖగోళం పట్ల ఆసక్తి ఉండేది. ఆ ఆసక్తి వయసుతో పాటు పెరిగింది. అంతరిక్షం పట్ల ఆసక్తి కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ వ్యోమగామిగా ఎదగాలని కలలు కంటారు. అలాగే నేను కూడా రెండో తరగతి చదివే వయసు నుంచే వ్యోమగామిగా ఎదగాలని కల కన్నాను. ఫ్లోరిడాలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ చేపట్టబోతున్న వ్యోమగామి శిక్షణ కోసం 36 దేశాల నుంచి వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. చివర్లో ఎంపికైన 150 మంది అభ్యర్థుల్లో నేనొకదాన్ని. ఎంపిక ప్రక్రియలో భాగంగా టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీ సిఇఒ ఎస్. లాచ్‌మాన్‌తో పాటు చీఫ్ ఆస్ట్రోనాట్ విలయం మెక్ ఆర్థర్, సీవోవో అండ్ చీఫ్ ఇంజనీర్ డా.వి.విజయ్ నన్ను గంట పాటు ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేశారు. అంతరిక్షంలో అడుగుపెట్టబోయే అభ్యర్థిగా ఎంపికయ్యానని తెలిసినప్పుడు నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కల నిజమవడం గొప్ప అనుభవం.

కైవల్య విజయ పరంపర 6వ తరగతి నుంచే మొదలైంది. నాసా ఫెసిలిటీతో అలబామాలోని ఎక్సా అమెరికాలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాంను పూర్తి చేసిన అతి పిన్న వయస్కురాలైన భారతీయురాలిగా కైవల్య ఘనత సాధించింది. నాసా ఫెసిలిటీతో ఇఎక్స్‌ఎ నిర్వహించే అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం-2023ను 15ఏళ్ల వయసులోనే పూర్తి చేసింది. 98 దేశాలు పాల్గొనే ఖగోళ, ఖగోళ భౌతిక శాస్త్ర పోటీల్లో సిల్వర్ హానర్ సర్టిఫికెట్ పొందింది. నాసా సిటిజెన్ సైంటిస్టుగా అంగారక, బృహస్పతి గ్రహాల మధ్య ఉండే ముఖ్యమైన ఆస్టరాయిడ్ బెల్ట్‌లోని 2020 పిఎస్24, 2021 సిఎం37 అనే రెండు ప్రివిజనల్ ఆస్టరాయిడ్స్‌ని కొనుగొంది. నాసా నిర్వహించే సైంటిస్ట్ ఫర్ ఎ డే-2021 వ్యాసరచన పోటీల్లో జాతీయ ఫైనలిస్ట్‌గా నిలిచింది. ఇస్రో నిర్వహించిన స్పేస్ క్విజ్, సైన్స్ ఫెయిర్, ఆస్ట్రోఫొటోగ్రఫీ, వక్తృత్వంతోపాటు ఇతర పోటీల్లో అనేక అవార్డులను అందుకొంది.

తల్లిదండ్రుల తోడ్పాటుతో...

కుటుంబ తోడ్పాటు ఉన్నప్పుడు ఏ కలనైనా నిజం చేసుకోగలుగుతాం! నా విషయంలో అదే జరిగింది. ఇది కఠినమైన రంగమనీ, ఈ రంగంలో మహిళలకు అవకాశాలు కష్టమనీ అంటూ ఉంటారు. అయినా మా పేరెంట్స్ నన్ను ప్రోత్సహించారు. రెండో తరగతిలో ఉన్నప్పుడు ఒక పుస్తకం అమ్మ దగ్గరకు తీసుకువెళ్లి ఆ పుస్తకం మీద కనిపిస్తున్న వ్యక్తులెవరు? అని



అడిగాను. వాళ్లు సునీతా విలియమ్స్, మిగతా వ్యోమగాములనీ, వాళ్లందరూ అంతరిక్షంలోకి వెళ్లారనీ అమ్మ చెప్పింది. ఆ మాటలు విన్న తర్వాత ఏదో ఒకనాటికి అంతరిక్షంలోకి వెళ్లాలని అప్పుడే అనుకున్నాను. అప్పటి నుంచి అంతరిక్షం గురించి నేను అడిగే ప్రశ్నలకు పేరెంట్స్ సమాధానాలు చెప్తూ, పుస్తకాలు అందిస్తూ, నా ఆసక్తిని మరింత ప్రోత్సహించారు. భవిష్యత్తులో ఆస్ట్రో ఫిజిక్స్ చదవాలన్నది నా కల. ఈ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారం నోబెల్ బహుమతి. కాబట్టి నేను కూడా రీసెర్చ్ సైంటిస్ట్‌గా ఎదిగి, నోబెల్ బహుమతిని గెలవాలని భావిస్తున్నాను.

మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు

టిఎస్ఎ శిక్షణ రెండేళ్ల పాటు కొనసాగుతుంది. జీరో గ్రావిటీ పారాబొలిక్ ఫ్లైట్స్‌లో భాగంగా స్క్యూబా డైవింగ్, స్కై డైవింగ్‌లలో శిక్షణ సాగుతుంది. మేం అంతరిక్షంలో భిన్నమైన పరిశోధనలు చేపట్టబోతున్నాం. అంతరిక్షంలో మానవ శరీరం కొన్ని మార్పులకు లోనవుతుంది. ఆ సమయంలో ఎలాంటి భౌతిక, మానసిక మార్పులు చోటుచేసుకోబోతున్నాయో తెలుసుకోబోతున్నాం. 2025 నాటికి గాల్లో ఎగిరే కార్లు అందుబాటులోకొస్తాయని 1990ల్లో అనుకున్నారు. మున్ముందు భూగ్రహం మీద కాకుండా అంతరిక్షంలో నివసించే అవకాశాలు ఉండొచ్చని ఇప్పుడు మనందరం అనుకుంటున్నాం. భవిష్యత్తులో అంతరిక్షంలో నివసించే అవసరం ఏర్పడ్డప్పుడు, అక్కడి పరిస్థితులకు తగ్గట్టు ఎలా అలవాటు పడాలో తెలియాలంటే అందుకు తోడ్పడే పరిశోధన సాగాలి. ఇప్పుడు నేను ఎంపికైన అంతరిక్ష యాత్ర కూడా ఆ పరిశోధనలో భాగమే!

• **రమేశ్ నాగేంద్ర పలసల**, రాజమండ్రి

డెబ్భయిల్లోనూ ఊళ్లు చుట్టేస్తున్నారు

వారిద్దరూ బాల్య స్నేహితులు. లోకమంతా చుట్టెయ్యాలనే ఆశ. కానీ అప్పట్లో అది తీరలేదు. వివాహం తరువాత దూరమైనా, కొన్నేళ్ల తరువాత మళ్లీ కలిశారు. ఒక విదేశంతో సహా... పదమూడు ప్రాంతాలు చూసొచ్చారు. "ఇప్పుడు మాకు డెబ్భై రెండేళ్లు. ఆరోగ్యంగా ఉన్నంతకాలం పర్యటనలు కొనసాగిస్తూనే ఉంటాం" అంటున్న కేరళ మహిళలు సరోజిని, పద్మావతి... భ్రమణ కాంక్షకు వయసు అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు.

సరోజిని, పద్మావతి... ఇద్దరిదీ కేరళలోని మాతమంగళం పట్టణం. ఒకటే వయసున్న ఇద్దరూ కలిసే బడికి వెళ్ళేవారు. దారిలో ఎన్నెన్నో కబుర్లు. కోల్‌కతా, ముంబయి, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ.. ఇలా ఏ ఊరి పేరు విన్నా... ఆ ప్రాంతాల్లో ఉన్న విశేషాల గురించి చెప్పుకొనేవారు. ఆ ఊళ్లన్నీ చూడాలని కలలు కనేవారు. అయితే ఆ బాల్య స్నేహితులకు తమ కలలను తీర్చుకొనే అవకాశం అప్పట్లో కలగలేదు. కొన్నేళ్లకు సరోజినికి వివాహం కావడంతో ఆమె వేరే ప్రాంతానికి వెళ్ళిపోయారు. "ఆ రోజుల్లో టెలిఫోన్లు మాకు అందుబాటులో ఉండేవి కావు. ఏవైనా శుభకార్యాలకు లేదా వారి సొంత ఊళ్లో ప్రసిద్ధమైన కలియట్టం పండుగకు సరోజిని వచ్చినప్పుడు మాత్రమే కలుసుకొనేవాళ్లం. పద్మావతికి పొరుగు ఊరికి చెందిన వ్యక్తితో వివాహం కావడంతో ఆ ప్రాంతంలోనే స్థిరపడింది. నా భర్త సైన్యంలో పని చేయడంతో అనేక రాష్ట్రాల్లో నివసించడానికి, పలు ప్రదేశాలను సందర్శించడానికి నాకు అవకాశం కలిగింది" అని గుర్తు చేసుకున్నారు సరోజిని. ఆమె భర్త మరణించడంతో... కొన్నేళ్ల క్రితం మాతమంగళానికి వచ్చి... అక్కడే స్థిరపడ్డారు. మళ్ళీ ఆ





స్నేహితులిద్దరూ తరచుగా కలుసుకొనేవారు. కొత్త ప్రాంతాలకు కలిసి తిరగాలనే వారి చిన్ననాటి కోరిక మళ్ళీ బలపడింది.

పింఛన్ డబ్బు దాచుకొని...

"మా స్నేహం గురించి మా పిల్లలకు తెలుసు. ఇద్దరం కలిసి పర్యటనలు జరపాలనుకుంటున్నామని వారికి చెప్పగానే.... మా నిర్ణయాన్ని గట్టిగా బలపరచడమే కాదు... ఏర్పాట్లన్నీ చేయడానికి ఎంతో ఉత్సాహం చూపించారు. కానీ మరీ అవసరమైతే తప్ప వాళ్ళ దగ్గర డబ్బు తీసుకోవడం మాకు ఇష్టం లేదు. అందుకే మా పింఛన్ డబ్బులను దాచుకోవడం ప్రారంభించాం. ముందుగా దగ్గరలోని ప్రసిద్ధ దేవాలయాలకు వెళ్ళాలని ప్రణాళిక వేసుకున్నాం" అని వివరించారు సరోజిని, పద్మావతి. కేరళలోని శబరిమల, గురువాయూరు, తమిళనాడులోని రామేశ్వరం, మదురై, ధనుష్కోటి, పళని తదితర ఆలయాలను సందర్శించారు. ఆ పర్యటనల్లో... కొందరు టూరిస్ట్ ఆపరేటర్లు, పర్యాటక బృందాల సభ్యులు వారికి పరిచయమయ్యారు. వారితో కలిసి ఉత్తర భారతదేశ యాత్రలు చేపట్టారు. వారణాసి, బదరీనాథ్, కేదార్‌నాథ్, రాజస్థాన్, గుజరాత్, కశ్మీర్... ఇలా ఎన్నో ప్రాంతాలు చుట్టేశారు. "ఇప్పటివరకూ మేము చూసిన వాటన్నిటిలో అందమైన ప్రదేశం... కశ్మీర్. ఇక... కేదార్‌నాథ్‌కు గుర్రం మీద వెళ్ళాం. అది మరచిపోలేని అనుభవం. ఇటీవలే హైదరాబాద్ వెళ్ళొచ్చాం. మాకు బాగా నచ్చేసింది" అంటున్నారు పద్మావతి, సరోజిని.

జ్ఞాపకాల బహుమతి

"ఇప్పటివరకూ మేము సందర్శించిన విదేశం ఒక్కటే... మలేషియా. దానికోసం చాలా నెలలపాటు పింఛన్ డబ్బులు దాచుకున్నాం. వచ్చేనెలలో కోల్‌కతా వెళ్తున్నాం. ప్రతి పర్యటనకు ముందు... ఎక్కడికి వెళ్ళాలని నిర్ణయించుకోవడం, వాటికోసం ఏర్పాట్లు చేసుకోవడం మాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది. ప్రతి పర్యటనా మాకు ఎన్నో జ్ఞాపకాలను బహుమతిగా ఇస్తోంది. ఎంతో సంతోషం కలిగిస్తోంది. అందుకే... ఆరోగ్యంగా ఉన్నంతవరకూ ప్రయాణాలు కొనసాగిస్తాం" అని చెబుతున్నారు ఈ బాల్యమిత్రులు.

పాదాలు పగులుతున్నాయా..?

శీతాకాలంలో చలిగాలుల వల్ల పాదాలమీద చర్మం పొడిబారి పగులుతుంటుంది. దీంతో తీవ్రమైన నొప్పి వేధిస్తుంటుంది. చిన్న చిట్కాలతో పాదాల పగుళ్లను తగ్గించుకోవచ్చు.



- చిన్న గిన్నెలో రెండు చెంచాల బియ్యప్పిండి, రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా బాడీ వాష్, రెండు చెంచాల కొబ్బరినూనె వేసి బాగా కలపాలి. శుభ్రం చేసుకున్న పాదాలమీద ఈ మిశ్రమాన్ని రాసి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీళ్లతో పాదాలను కడిగి పొడి గుడ్డతో తుడవాలి. ఆపైన ఏదైనా మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే పగుళ్లు తగ్గి పాదాలు మృదువుగా మారతాయి.
- పగుళ్ల మీద తేనె, కొబ్బరినూనె, షియా బటర్, ఆలివ్ ఆయిల్‌లలో ఒకటి రాసినా ప్రయోజనం కనిపిస్తుంది. ఇవి సహజ మాయిశ్చరైజర్‌లా పనిచేసి పాదాలకు తేమని అందిస్తాయి. దీంతో పాదాల పగుళ్లు త్వరగా తగ్గుతాయి.
- ఒక గిన్నెలో బాగా పండిన అరటి పండు గుజ్జు, అవకాడో గుజ్జు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రంచేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే పాదాల పగుళ్లు మాయమవుతాయి.
- వెడల్పాటి టబ్‌లో సగానికిపైగా గోరువెచ్చని నీళ్లు పోయాలి. అందులో ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల గులాబీ నీళ్లు, రెండు చెంచాల గ్లిసరిన్ వేసి బాగా కలపాలి. అందులో రెండు పాదాలు మునిగేలా ఉంచాలి. అరగంట తరువాత పాదాలను స్క్రబ్ చేసి మంచినీళ్లతో కడగాలి. రెండు రోజులకోసారి ఇలా చేస్తూ ఉంటే పాదాల పగుళ్లు తగ్గుతాయి.
- ఒక గిన్నెలో గుప్పెడు తులసి ఆకులను పేస్టులా చేసి వేయాలి. అందులో రెండు చెంచాల కలబంద గుజ్జు, ఒక చెంచా కర్పూరం పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించి పావుగంటసేపు మర్దన చేయాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగితే పాదాల పగుళ్ల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- వెడల్పాటి గిన్నెలో తొమ్మిది చెంచాల నువ్వుల నూనె, మూడు చెంచాల వేపనూనె, ఒక చెంచా కలబంద గుజ్జు, ఒక చెంచా పసుపు, ఒక చెంచా గంధం, ఒక చెంచా వేపాకుల పొడి వేసి బాగా కలపాలి. రాత్రి పడుకునేముందు ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించి సాక్స్ వేసుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే కాలి వేళ్లు, మడమల మీద ఏర్పడే పగుళ్లు తగ్గుతాయి.

ఈ పండ్లు తినవచ్చు...

మధుమేహం ఉన్నవారు పండ్లు తినకూడదని చాలా మంది చెబుతుంటారు. పండ్లలో సహజసిద్ధమైన చక్కెరలు ఉంటాయి కాబట్టి వాటిని తినడంవల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుందని భావిస్తుంటారు. చక్కెర వ్యాధి ఉన్నప్పటికీ గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే పండ్లు తినవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



- నారింజ, బత్తాయి పండ్లను మధుమేహం ఉన్నవారు నిర్భయంగా తీసుకోవచ్చు. వీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ 40 నుంచి 43 మధ్య మాత్రమే ఉంటుంది. వీటిలోని సి విటమిన్, ఫోలేట్, పొటాషియం, పీచు పదార్థాలు రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. రక్తంలో కలవడానికి అధిక సమయం తీసుకుంటాయి.
- చక్కెర వ్యాధి ఉన్నవారికి చెర్రీ పండ్లు మంచి ఔషధమని చెప్పవచ్చు. వీటి గ్లైసెమిక్ ఇండెక్స్ 20 మాత్రమే. వీటిలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం.. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచుతాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- డయాబెటిక్ పేషెంట్లు.. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ పండ్లను కూడా తినవచ్చు. వీటి గ్లైసెమిక్ ఇండెక్స్ 41. ఈ పండ్లలో అత్యధికంగా సి విటమిన్ ఉంటుంది. తరచూ బెర్రీలను తింటూ ఉంటే రక్తంలో చక్కెర చేరే ప్రక్రియ నెమ్మదిస్తుంది.
- యాపిల్ పండులో ఉండే పీచుపదార్థాలు, పాలీ ఫినోల్స్.. కార్బోహైడ్రేట్ల శోషణను తగ్గిస్తాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. యాపిల్ పండులో చక్కెర ఫ్రక్టోస్ రూపంలో ఉంటుంది. ఇది అంత ప్రభావవంతమైంది కాదు. రోజూ యాపిల్ పండు తినడం వల్ల ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది.

పదేళ్లలోపు పిల్లలకు ఇవి చెప్పకూడదు

చిన్న చిన్న పనులు చెప్పి చేయించడం వల్ల పిల్లలు బాధ్యతాయుతంగా మెలగడం నేర్చుకుంటారు. కానీ పదేళ్లలోపు పిల్లలకు కొన్ని పనులు చెప్పకూడదని నిపుణులు సూచిస్తున్నారు. వాటి గురించి తెలుసుకుందాం...



- పదేళ్లలోపు పిల్లలకు గ్యాస్ స్టవ్ వెలిగించడం, కెటిల్ ఉపయోగించడం, ఇస్త్రీ చేయడం లాంటి పనులు చెప్పకూడదు.
- కూరగాయలు కోయడం, వేటినైనా కత్తిరించడం, మిక్సీ లేదా బ్లెండర్ వాడడం లాంటి పనులు చెప్పకూడదు.
- అటక మీద నుంచి వస్తువులు దించడం, బరువైన వస్తువులను ఎత్తడం, లగేజ్ బ్యాగ్‌లు పట్టుకుని మెట్లు ఎక్కడం లేదా దిగడం లాంటి పనులను పురమాయించకూడదు. నీళ్ల బిందెలు లేదా బకెట్లు మోయడంలాంటివి కూడా చెప్పకూడదు. ఇలాంటి పనులు చేయడం వల్ల పిల్లల్లో వెన్ను నొప్పి, కండరాలు పట్టేయడం లాంటి సమస్యలు వస్తాయి.
- చిన్న పిల్లలకు వ్యాక్యూమ్ క్లీనర్, రైస్ కుక్కర్, ఎలక్ట్రిక్ స్టవ్, ఓవెన్‌లతో చేసే పనులు చెప్పకూడదు.
- రకరకాల క్లీనర్స్, యాసిడ్, బ్లీచింగ్ పౌడర్‌లతో చేసే పనులను పిల్లలకు చెప్పకూడదు.
- గోడలకు మేకులు కొట్టడం, బజారు నుంచి మందులు తీసుకురమ్మనడం, నిచ్చెన ఎక్కడం లాంటి పనులను కూడా చిన్న పిల్లలకు చెప్పకూడదు.



భలే బ్లేజర్స్

ఫ్యాషన్

వదులుగా ఉండే ఓవర్‌సైజ్ బ్లేజర్స్ తాజా ఫ్యాషన్ ట్రెండ్. అలియా భట్, ప్రియాంకా చోప్రా లాంటి బాలీవుడ్ అగ్రతారలు అనుసరిస్తున్న ఈ తాజా ట్రెండ్ మీద ఓ లుక్కేద్దాం!



పవర్ డ్రస్సింగ్‌లో భాగంగా....

పవర్ డ్రస్సింగ్ కాలక్రమేణా ట్రెండ్‌గా మారిపోయింది. పొడవాటి స్కర్ట్, ట్రౌజర్స్, ఈవినింగ్ గౌన్‌లను ఓవర్‌సైజ్ బ్లేజర్స్‌తో కలిపి ధరించడం ఫ్యాషన్‌గా మారింది. అధికారికంగా, హుందాగా కనిపించే ఆధునిక దుస్తుల జాబితాలో ఇవి కూడా చేరిపోయాయి. సౌకర్యంగా ఉండడంతో పాటు, ఆకట్టుకునేలా కనిపిస్తూ ఉండడంతో ప్రత్యేకించి ఉద్యోగినులు వీటి మీద మక్కువ చూపుతున్నారు.

యాక్సెసరీస్ ఇలా...

షార్ట్స్, ట్రౌజర్స్, లాంగ్ గౌన్స్‌తో కలిపి ధరించే ఈ బ్లేజర్స్ హుందాగా, ఆధునికంగా కనిపిస్తాయి. వీటికి తోడుగా హీల్స్, బూట్స్ ధరించవచ్చు. చేతిలో హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ నిండుదనాన్ని అందిస్తాయి. ఈ రకం దుస్తులతో సింపుల్ జ్యువెలరీ చక్కగా మ్యాచ్ అవుతుంది.

మేకప్ ఇలా...

సాధ్యమైనంత తక్కువ మేకప్ వేసుకున్నా, లిప్‌స్టిక్ బోల్డ్‌గా ఉండేలా చూసుకోవాలి. మేకప్ ముంజేతుల ఛాయతో సరిపోలేలా ఉండాలి. స్కర్ట్, షార్ట్స్ వేసుకున్నప్పుడు చర్మంలో కలిసిపోయే స్టాకింగ్స్ వేసుకోవాలి, లేదా మేకప్‌తో చర్మపు రంగును మ్యాచ్ చేయాలి.



19న పుట్టపర్తికి ప్రధాని మోదీ

» వైభవంగా సత్యసాయి శత జయంత్యుత్సవాలు: మంత్రి అనగాని

పుట్టపర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఈ నెల 19న పుట్టపర్తికి వస్తున్నారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం వైభవంగా నిర్వహిస్తుందన్నారు. ఉత్సవాల పర్యవేక్షణకు ఏర్పాటైన మంత్రుల కమిటీ మంగళవారం పుట్టపర్తిలో పర్యటించింది. అనగాని నేతృత్వంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణ రెడ్డితో పాటు ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, ఉన్నతాధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ, సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వ పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఈ వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 13 నుంచి 23 వరకూ పది రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దీనిపై కొన్ని పార్టీలు రాజకీయ చేయడం బాధాకరమని అన్నారు. ప్రధాని సభ నిర్వహించే హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాట్లను, పుట్టపర్తిలో పనుల పురోగతిని మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు.

స్థానిక ఎన్నికలపై హైకోర్టుకు బీసీ సంక్షేమ సంఘం

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ జనగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. బీసీ జనగణన, వర్గీకరణ చేపట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోందని, దీనిని రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయంగా ప్రకటించాలని కోరారు. ఈ పిల్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరపనుంది.

ఎన్‌సీడీ 4.0లో 39 లక్షల మందికి క్యాన్సర్ స్ర్కీనింగ్

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు చేపట్టిన ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) 4.0 ద్వారా ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 39 లక్షల మందికి స్ర్కీనింగ్ చేసినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం వెల్లడించారు. ఈ స్ర్కీనింగ్‌లో మహిళలకు నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్, మగవారికి నోటి క్యాన్సర్‌కు సంబంధించిన ప్రాథమిక పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. పరీక్షలు చేయించుకున్న మహిళల్లో 9,963 మందిలో రొమ్ము క్యాన్సర్, 22,861 మందిలో సర్వైకల్ క్యాన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించామని చెప్పారు. అలాగే మగవారిలో నోటి క్యాన్సర్ అనుమానిత లక్షణాలున్న 26,639 మందిని గుర్తించామన్నారు.

టెలీమానస్‌పై ఫ్యాన్సీడ్రెస్.. చిన్నారికి సత్యకుమార్ అభినందన



మంగళగిరిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో.. ఎల్‌కేజీ విద్యార్థిని రవిశ్రీ.. టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416 వేషధారణతో అందరినీ ఆకట్టుకుంది. మానసిక ఆరోగ్య సహాయ కేంద్రమైన 'టెలీమానస్'పై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించిన ఈ చిన్నారిని మంత్రి సత్యకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

పీపీపీ మోడల్.. వైద్యవిద్యలో విప్లవం: దీపక్‌రెడ్డి

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిన వైసీపీ.. మెడికల్ కాలేజీల అంశంపై అలజడి సృష్టించేందుకు ధర్నాల పేరుతో ప్రయత్నాలు చేస్తోందని సీడాప్ చైర్మన్ జి.దీపక్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 11 సీట్లతో ప్రతిపక్ష హోదా కూడా పొందలేని పార్టీకి ప్రజాఉద్యమాలు చేసే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు.

అమరావతిలో దసపల్లాకు భూమిపూజ

» 200 కోట్లు పెట్టుబడి.. 400 మందికి ఉపాధి

» వర్చువల్‌గా పాల్గొన్న సీఎం చంద్రబాబు

తుళ్లూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని శాఖమూరు-నేలపాడు సమీపంలో దసపల్లా 4 స్టార్ హోటల్ నిర్మాణానికి 'దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్' మంగళవారం భూమి పూజ చేసింది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొని, శుభాకాంక్షలు తెలిపారు. సుమారు రూ.200 కోట్ల పెట్టుబడితో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 400 మంది ఉపాధి అవకాశాలు లభిస్తాయని సంస్థ చైర్మన్, ఎండీ మండవ రాఘవేంద్రరావు తెలిపారు. 2029 నాటికి నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. ఏపీ టూరిజం అథారిటీ సీఈవో, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి కాటా, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు జిల్లా జేసీ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సీఎం చంద్రబాబు లక్ష్య సాధనలో భాగంగా దసపల్లా హోటల్‌కు భూమి పూజ చేసినట్లు పేర్కొన్నారు.



అమరావతిలో 2029 నాటికి అందుబాటులోకి రానున్న దసపల్లా 4స్టార్ హోటల్ నమూనా

పేదలకు సొంతింటి పండగ!

రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఇళ్లలో నేడు సామూహిక గృహ ప్రవేశాలు.. రాయచోటిలో ప్రారంభించనున్న సీఎం

» 17 నెలల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తున్న ప్రభుత్వం

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేరింది. రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోంది. అధికారంలోకి వచ్చిన 17నెలల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై-బీఎల్‌సీ) పథకం కింద నిర్మించిన 2,28,034 ఇళ్లు, పీఎంఏవై-గ్రామీణ్ పథకం కింద మరో 65,292 ఇళ్లు, పీఎంఏవై-జన్‌మన్ పథకం కింద 6,866 ఇళ్లు కలిపి మొత్తంగా 3,00,192 ఇళ్లలో లబ్ధిదారులు బుధవారం సామూహిక గృహ ప్రవేశాలు చేయనున్నారు. దీనికి గృహ నిర్మాణశాఖ ఏర్పాట్లు చేసింది. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం దేవగుడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాలు చేయించి.. ఇంటి తాళాలు అందిస్తారు. అక్కడి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో పూర్తి చేసిన ఇళ్లను సీఎం వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఈ సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొననున్నారు.

నేడు అన్నమయ్య జిల్లాకు ముఖ్యమంత్రి

సీఎం చంద్రబాబు బుధవారం అన్నమయ్య జిల్లాకు రానున్నారు. రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో పేదల గృహప్రవేశాలు, పూజా కార్యక్రమాలలో పాల్గొననున్నారు. అనంతరం ప్రజావేదిక సభలో ప్రసంగించనున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమవుతారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ హయాంలో 8 లక్షల ఇళ్ల నిర్మాణం

గత వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో 4.73 లక్షల ఇళ్లను రద్దు చేసి రాష్ట్రంలో పేదల సొంతింటి కలలను కల్లలు చేసింది. 2.73 లక్షల మంది ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకుండా బకాయిలు పెట్టింది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 8 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన 17 నెలల కాలంలోనే 3లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా సీఎం చంద్రబాబు చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం పూర్తి చేసిన 3లక్షల ఇళ్లతోపాటు వివిధ దశల్లో ఉన్న మిగిలిన ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పోలవరం పునరావాసంపై నేడు ఆర్థిక శాఖ సమీక్ష

మిగిలిన 750 కోట్లు ఖర్చుచేస్తే కేంద్రం నుంచి తదుపరి నిధులు!

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సహాయ, పునరావాస కార్యక్రమాల అమలుపై రాష్ట్ర ఆర్థిక శాఖ సమీక్షించనుంది. బుధవారం జరిగే ఈ సమీక్షలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొంటారు. 41.15 మీటర్ల కాంటూరులో పోలవరం తొలి దశ నిర్మాణానికి రూ.30,436.95 కోట్ల వ్యయాన్ని కేంద్ర జల సంఘం ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఇంకా రూ.6,645.13 కోట్లు కేంద్రం నుంచి రావలసి ఉంది. ప్రాజెక్టు కోసం గత ఏడాది అక్టోబరు 9న రూ.76.46 కోట్లు, రూ.383.23 కోట్లు, రూ.2,348 కోట్లు విడుదలయ్యాయి. వీటిని ప్రాజెక్టు కోసం తెరచిన ప్రత్యేక ఖాతాలో వేయకుండా రాష్ట్ర ఆర్థిక శాఖ సీఎంఎఫ్ఎస్‌లో జమచేసింది. దీనిపై కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఆర్థిక శాఖ వీటిలో రూ.998 కోట్లను జనవరిలో నిర్వాసితుల వ్యక్తిగత ఖాతాల్లో జమచేసింది. దరిమిలా కేంద్రం ఈ ఏడాది మార్చి 11వ తేదీన మరో రూ.2,704.71 కోట్లను విడుదల చేసింది. వీటిలో దాదాపు రూ.1,700 కోట్లను పోలవరం ప్రత్యేక ఖాతాలో వేశారు. ఇందులో రూ.1,000 కోట్లను నిర్వాసితులకు విడుదల చేశారు. తాజాగా కేంద్రం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం.. ప్రత్యేక ఖాతాల్లోని నిధులు నిర్వాసిత కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో విడివిడిగా జమచేయాలంటే.. నిర్వాసిత భూమి విస్తీర్ణం, సర్వే నంబరు, ఆధార్ నంబరు తదితర వివరాలన్నింటినీ వ్యక్తిగతంగా 'అప్‌లోడ్' చేయాల్సి ఉంటుంది. ఈ సమాచారమంతటినీ అప్‌లోడ్ చేసేందుకు చాలా సమయం తీసుకుంటుంది. దీంతో గత నెలలో ప్రారంభించిన నిర్వాసితులకు నగదు చెల్లింపు ఇంకా కొనసాగుతూనే ఉంది. కేంద్రం విడుదల చేసిన నిధుల్లో మరో 750 కోట్ల దాకా రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉన్నాయని.. ఈ నిధులనూ ప్రత్యేక ఖాతాకు బదలాయిస్తే నిర్వాసితులకు పూర్తిగా చెల్లింపులు చేయొచ్చు. ఈ నిధులను కూడా వ్యయంచేసి తమకు సమాచారం పంపితే.. తదుపరి మొత్తం విడుదల చేస్తామని కేంద్రం చెబుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ సమీక్షించనుండడం ఆసక్తికరంగా మారింది.

ఎల్లుండి నుంచి సదరం స్లాట్ బుకింగ్

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగుల వైకల్య నిర్ధారణకు ఈ నెల 14 నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభించనున్నట్లు సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్ తెలిపారు. నవంబరు, డిసెంబరుకు సంబంధించి సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో స్లాట్‌లు బుక్ చేసుకోవచ్చని సూచించారు.

రాష్ట్రానికి జల్‌శక్తి అవార్డులు

» అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లోని రెండు గ్రామాలకు జాతీయ జలపురస్కారం

» నెల్లూరుకు 'జలసంచయ్...' అవార్డు

» 18న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

న్యూఢిల్లీ/అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు పలు విభాగాల్లో కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ అవార్డులు దక్కాయి. కేంద్ర ప్రభుత్వం మంగళవారం 6వ జాతీయ జలపురస్కారాలు, ప్రథమ జల్ సంచయ్-జన్ భాగీదారీ అవార్డులను ప్రకటించింది. అత్యుత్తమ గ్రామ పంచాయతీ క్యాటగిరిలో అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలోని దుబ్బిగానిపల్లె, కేరళలోని పాయం (కన్నూర్ జిల్లా)తో కలిసి సంయుక్త ప్రథమ విజేతగా నిలిచింది. ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలంలోని మురుగమ్మి గ్రామం, మధ్యప్రదేశ్‌లోని కవేశ్వర్ (ఖాండ్వా జిల్లా) గ్రామంతో కలిసి ద్వితీయ విజేతగా నిలిచింది. జల రంగంలో అత్యుత్తమ కృషి చేసిన సంబంధించి వ్యక్తిగత క్యాటగిరీలో సౌత్ జోన్‌లో ప్రకాశం జిల్లాకు చెందిన పొదిలి రాజశేఖరరాజు ప్రథమ విజేతగా నిలిచారు.

వర్షపు నీటి సంరక్షణ ప్రాధాన్యానికి..

నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపు నీటి సంరక్షణ ప్రాధాన్యమిచ్చినందుకు 'జల సంచయ్ జన్ భాగీదారీ-2025' కింద ఆంధ్రప్రదేశ్ రెండు అవార్డులు దక్కించుకుంది. 'జల్ శక్తి అభియాన్: క్యాచ్ ది రెయిన్' ప్రచారంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో తనదైన ముద్ర వేసింది. దక్షిణ జోన్‌లో క్యాటగిరీ-3 కింద నెల్లూరు జిల్లా అవార్డు సాధించింది. నెల్లూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద డ్వామా అధికారులు ఆ జిల్లాలో 2024లో 856 ఫారం పాండ్స్, 3,495 ఇంకుడు గుంతలు, 112 ఊట చెరువులు, 166 చెక్‌డ్యాంలు, 512 వాటర్ హార్వెస్టింగ్ పాండ్స్, 247 చెరువుల పూడికతీత పనులు చేపట్టారు. ఈ క్యాటగిరీ కింద లభించిన అవార్డుకు రూ.25 లక్షల నగదు పురస్కారం అందిస్తారు. అలాగే, 'టాప్-10 మున్సిపల్ కార్పొరేషన్ల' జాబితాలో 13,298 పనులు పూర్తి చేసిన రాజమహేంద్రవరం అవార్డు దక్కించుకుంది. ఇందుకు మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.2 కోట్లు నగదు పురస్కారం అందించనున్నారు. ఈ నెల 18న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్మ్ము ఈ అవార్డులు ప్రదానం చేస్తారు.

ఉత్తర్వులు అమలు కాలేదు.. కోర్టుకు రండి!

» సీఎస్, సాంఘిక సంక్షేమ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం.. ఉద్యోగుల పదోన్నతిపై విచారణ

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదోన్నతి కల్పించే విషయంలో ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి హైకోర్టు 2018లో ఇచ్చిన తీర్పు అమలులో ఎలాంటి పురోగతి లేకపోవడంపై హైకోర్టు ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు నేరుగా తమముందు హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం. నాయక్‌ను ఆదేశించింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై తదుపరి విచారణను డిసెంబరు 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు ఉద్యోగులు 2016, 2017లో ఉమ్మడి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన కోర్టు.. రిజర్వ్‌డ్ కేటగిరీ ఉద్యోగులు పరిమితికిమించి ప్రమోషన్లు పొందితే, రిజర్వేషన్ పరిధిలోకి రాని ఇతర ఉద్యోగులకు పదోన్నతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి స్పష్టం చేస్తూ 2018 డిసెంబరు 11న తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు అమలుకాక పోవడంతో కొందరు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లు మంగళవారం విచారణకు రాగా.. ఎస్‌జీపీ ఎస్. ప్రణతి వాదనలు వినిపించారు.



తిరుపతి జిల్లాలో ప్రమాదానికి గురైన కారు, లారీని పక్కకు తరలిస్తున్న పోలీసులు

రహదారులపై రక్తపాతం!

» మూడు రోడ్డు ప్రమాదాల్లో 9మంది మృతి

నెల్లూరు(క్రైం)/విజయవాడ/రేణిగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రహదారులు మంగళవారం రక్తమోడాయి. మూడు జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది మరణించగా.. ఆరుగురు గాయపడ్డారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో చేపలు అన్‌లోడ్ చేసిన మినీ లారీ కంటైనర్ నెల్లూరుకు బయలుదేరింది. నెల్లూరు ఎస్వీజీఎస్ కళాశాల మైదానం సమీపంలోకి రాగానే వేగంగా వస్తున్న ఓ యువకుడు బైక్‌ను యూటర్న్ తీసుకోవడంతో.. లారీ డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేక ఆ బైక్‌ను ఢీకొట్టాడు. అంతేకాక మరో రెండు బైక్‌లను ఢీకొట్టి, రోడ్డుపక్కన చిరువ్యాపారులపైకి దూసుకెళ్లి, ఓ చెట్టును ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై వెళ్తున్న తండ్రి కుమారులైన రిటైర్డ్ పీఈటీ షేక్ ఖాజా నాజీం మొహిద్దీన్(70), సచివాలయ ఉద్యోగి ముజాహిద్ ఆలీ(35)తో పాటు ఏ.సురేష్(35) మృతిచెందారు.

స్నేహితుడి వద్దకు వెళ్లి.. తిరిగిరాని లోకాలకు!

కృష్ణాజిల్లాలోని ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో నలుగురు యువకులు దుర్మరణం చెందారు. విజయవాడ మొగల్రాజపురానికి చెందిన చాట్రగడ్డ రాకేష్(24), గొరిపర్తి పాపారావు(23), గిరిపురానికి చెందిన ఈటె ప్రిన్స్‌బాబు(22) స్నేహితులు. సోమవారం రాత్రి వీరు కంకిపాడు మండలం కుందేరులో ఉంటున్న కొణతం చింతయ్య (19) వద్దకు వెళ్లారు. అతడిని కారులో ఎక్కించుకుని ఉయ్యూరు వైపు వెళ్తుండగా గండిగుంట సమీపాన అదుపుతప్పింది. ప్రమాదంలో రాకేష్, చింతయ్య, ప్రిన్స్‌బాబు అక్కడికక్కడే మరణించారు. పాపారావును విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు.

వారాంతపు సెలవని ఊరికి వచ్చి..

కర్నూలు నగరానికి చెందిన చంద్రభాను సింగ్ చెన్నైలోని మెడికల్ ఏజెన్సీలో బిజినెస్ మేనేజర్. ఆయన భార్య దివ్య చెన్నైలోనే బరోడా బ్యాంక్ రీజినల్ ఆఫీసర్. వారాంతపు సెలవును కర్నూలులో గడిపారు. చంద్రభాను సోమవారం సాయంత్రం కర్నూలు నుంచి కారులో తన తల్లి సరస్వతిబాయి, భార్య దివ్య, కుమార్తె త్రిషికతో కలిసి చెన్నై బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజామున రేణిగుంట మండలం చైతన్యపురం క్రాస్ వద్ద అదుపుతప్పిన లారీ వీరి కారుని ఢీకొంది. కారు నడుపుతున్న చంద్రభాను సింగ్ (37) తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సరస్వతి బాయి, దివ్యకు తీవ్ర గాయాలు కాగా.. త్రిషిక స్వల్పగాయాలతో బయటపడింది. పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో సరస్వతిబాయి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దివ్య పరిస్థితి విషమంగా ఉంది.

బిహార్ మళ్లీ ఎన్డీయేదే!

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ మెజారిటీతో అధికారం చేపట్టే అవకాశాలు ఉన్నాయని 9 సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు స్పష్టం చేశాయి. నితీశ్, మోదీ.. 'నిమో' ఫార్ములా ఎన్డీయేకు అనుకూలించిందని సర్వేలు అభిప్రాయపడ్డాయి. రాష్ట్రంలో ఈ నెల 6, 11న రెండు దశల్లో పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో అధికార ఎన్డీయే, ప్రతిపక్ష ఎంజీబీ కూటములు హోరాహోరీగా ప్రచారం చేశాయి. ప్రస్తుత సీఎం, జేడీయూ చీఫ్ నితీశ్‌కుమార్‌కు ఇవే చివరి ఎన్నికలని భావిస్తున్నారు. ఆయన 19 ఏళ్లకుపైగా బిహార్ ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించారు. ఇక లాలూ ప్రసాద్ ఆర్జేడీ బాధ్యతలను తన కుమారుడు తేజస్వి యాదవ్‌కు అప్పగించారు. ఆయన్ను ఎంజీబీ సీఎం అభ్యర్థిగా నిర్ణయించారు. ఎన్డీయే, ఎంజీబీ నేతలతో పాటు ప్రశాంత్ కిశోర్ జనసురాజ్ పార్టీ(జేఎస్పీ) తరఫున విస్తృత ప్రచారం నిర్వహించారు. బిహార్‌లో ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ నెల 14న ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత వివిధ సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను విడుదల చేశాయి. అధికార ఎన్డీయేకు బిహారీలు మరోసారి పట్టం కట్టనున్నట్లు దాదాపు అన్ని ఎగ్జిట్‌పోల్స్ పేర్కొన్నాయి. అధికారం చేపట్టడానికి 122 సీట్లు అవసరం కాగా.. ఎన్డీయేకు 130కి పైగా సీట్లు వస్తాయని తెలిపాయి. ఎంజీబీకి గరిష్ఠంగా 108 సీట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జేఎస్పీ ప్రభావం దాదాపు శూన్యమేనని పేర్కొన్నాయి. ఆ పార్టీకి సీట్లు కష్టమేనని తేల్చాయి. నితీశ్‌కుమార్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళా రోజ్‌గార్ యోజన కింద 1.25 కోట్ల మంది మహిళలకు రూ.10 వేల నగదు పంపిణీ చేయడం ఎన్డీయే విజయానికి దోహదపడనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అగ్రవర్ణాలు, ఎస్సీలు, ఎస్టీలు, ఈబీసీ వర్గాల మద్దతుతో ఎన్డీయే ఆధిక్యంలో ఉండగా.. ముస్లింలు, బౌద్ధులు, బీసీ సామాజిక వర్గాల్లో అధిక శాతం ఎంజీబీ వైపు నిలిచారని విశ్లేషిస్తున్నారు. రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' నినాదం బిహార్‌లో ఓట్లను రాబట్టలేకపోయిందని పేర్కొంటున్నారు. నిరుద్యోగం, వలసలు వంటి అంశాలను ఎంజీబీ ప్రచార అస్త్రాలుగా చేసుకున్నా యువత ఆదరించలేదని చెబుతున్నారు. ఈసారి బిహార్ ఎన్నికల్లో 66.91% పోలింగ్ నమోదైంది.

ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు ఇలా..

సంస్థ	ఎన్డీయే	ఎంజీబీ	జేఎస్పీ	ఇతరులు
చాణక్య స్ట్రాటజీస్	130-138	100-108	0	3-5
దైనిక్ భాస్కర్	145-160	73-91	0-3	5-7
డీవీ రిసెర్చ్	137-152	83-98	2-4	1-8
జేవీసీ	135-150	88-103	0-1	3-6
మాట్రిజ్	147-167	70-90	0-2	2-8
పీ-మార్క్	142-162	80-98	1-4	0-3

జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌దే!

హైదరాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీకే ఓటర్లు పట్టం కట్టనున్నట్లు ఎగ్జిట్ పోల్స్ సర్వేలు తేల్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ 6 నుంచి 8 శాతం ఓట్ల ఆధిక్యంతో బీఆర్ఎస్ అభ్యర్థిపై విజయం సాధించే అవకాశమున్నట్లు పేర్కొన్నాయి. దాదాపు అన్ని సంస్థలు కాంగ్రెస్‌కే జై కొట్టాయి. ప్రముఖ సర్వే సంస్థ ఆరా.. కాంగ్రెస్ పార్టీకి 47.49 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపింది. బీఆర్ఎస్‌కు 39.25 శాతం ఓట్లు పోలైనట్లు పేర్కొంది. బీజేపీకి 9.31 శాతం, ఇతరులకు 3.95 శాతం ఓట్లు పోలైనట్లు వెల్లడించింది. కాగా, ఆపరేషన్ చాణక్య సంస్థ.. కాంగ్రెస్‌కు 41.1 శాతం ఓట్లు, బీఆర్ఎస్‌కు 37.7 శాతం, బీజేపీకి 13.3 శాతం ఓట్లు వస్తాయని పేర్కొంది. పల్స్ టుడే అనే మరో సంస్థ ఎగ్జిట్ పోల్‌లో కాంగ్రెస్‌కు 47 శాతం, బీఆర్ఎస్‌కు 44 శాతం ఓట్లు వస్తాయని వెల్లడించింది. కౌటిల్య సంస్థ స్పష్టంగా కాంగ్రెస్సే విజయం సాధిస్తుందని, బీఆర్ఎస్ కంటే 6 శాతం ఓట్లు అధికంగా సాధిస్తుందని తెలిపింది. అయితే మిషన్ చాణక్య సంస్థ ఒక్కటే బీఆర్ఎస్‌కు 41.60 శాతం ఓటు వస్తాయని, కాంగ్రెస్‌కు 39.43 శాతం ఓట్లు, బీజేపీకి 18.97 శాతం మాత్రమే వస్తాయని తెలిపింది. కాగా, కడపటి సమాచారం అందే సమయానికి ఇక్కడ 48.47 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటెత్తిన బిహార్

రెండో దశలో భారీగా 68.79% పోలింగ్

పట్నా, నవంబరు 11: బిహార్లో ఓటర్లు పోటెత్తారు. మున్నెన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 121 అసెంబ్లీ స్థానాలకు మంగళవారం జరిగిన రెండో దశ ఎన్నికల్లో ఏకంగా 68.79 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల కమిషన్(ఈసీ) ప్రకటించింది. గత ఎన్నికల్లో రెండో విడతలో 58.8 శాతం మాత్రమే పోలింగ్ జరుగగా.. ఈసారి 9.6 శాతం ఎక్కువ ఓటింగ్ నమోదైంది. మంగళవారం 3.7 కోట్ల మంది ఓటర్లు 1,302 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో 243 సీట్లు ఉండగా.. తొలివిడతలో 122 స్థానాలకు ఈ నెల 6న ఎన్నికలు జరిగాయి. 65.09% పోలింగ్ నమోదైంది. రెండు దశల్లో కలిపి సగటున 66.9% పోలింగ్ జరిగిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వినోద్‌సింగ్ గుంజియాల్ వెల్లడించారు. గత ఎన్నికల్లో ఇది 57.29 శాతం మాత్రమే కావడం గమనార్హం. తొలి విడత(69.04%)లో మాదిరిగానే మంగళవారం కూడా మహిళలు భారీస్థాయిలో తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్‌లో 74.03 శాతం వారిదే. 64.1% మంది పురుషులు మాత్రమే ఓట్లు వేశారు. మొత్తంగా రెండు దశల్లో కలిపి 71.6% మంది మహిళలు, 62.8% మంది పురుషులు ఓటు హక్కు వినియోగించారు. రాష్ట్రంలో ఇంత ఓటింగ్ గతంలో ఎప్పుడూ లేదు. పైగా మహిళా ఓటర్లు పోటెత్తడంతో అధికార ఎన్‌డీఏ, విపక్ష మహాగఠ్‌బంధన్‌లో ఆశలు మోసులెత్తుతున్నాయి. ఇది తమ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సానుకూల ఓటింగ్ అని ఎన్‌డీఏ, నితీశ్ సర్కారుకు వ్యతిరేకంగా జనం ఓట్లేశారని.. విజయం తమదేనని మహాగఠ్‌బంధన్ నేతలు ప్రకటనలు చేస్తున్నారు.కాగా, బిహార్ ఎన్నికల ఫలితాలను శుక్రవారం ప్రకటిస్తారు.

హంగేరియన్ బ్రిటీష్ రచయిత డేవిడ్ సలోయ్‌కు బుకర్ ప్రైజ్



లండన్, నవంబరు 11 : హంగేరియన్ బ్రిటీష్ రచయిత డేవిడ్ సలోయ్(51) ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్-2025 విజేతగా నిలిచారు. ఆయన రాసిన నవల 'ఫ్లెష్'కుగాను ఈ పురస్కారాన్ని ప్రకటించారు. భారతీయ రచయిత కిరణ్ దేశాయి తన రచన 'ది లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ'తో సలోయ్‌తో బుకర్ ప్రైజ్‌కు చివరి వరకు పోటీ పడ్డారు. అయితే విజయం సలోయ్‌ను వరించింది. దీంతో సలోయ్‌కు సోమవారం రాత్రి నిర్వహించిన ఒక కార్యక్రమంలో గత ఏడాది బుకర్ ప్రైజ్ విజేత సమంత హార్వే 50,000 పౌండ్లతోపాటు ట్రోఫీ అందజేశారు. కిరణ్ దేశాయి 2006లో తన రచన 'ద ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్'కుగాను బుకర్ ప్రైజ్ అందుకున్నారు.

భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి చేరువయ్యాం

(మొదటి పేజీ తరువాయి)

ఇష్టపడకపోయినా.. మమ్మల్ని ఇష్టపడతారు." అని సోమవారం ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్‌తో ఓవల్ ఆఫీసులో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. ఇరు దేశాల వాణిజ్య ఒప్పందాల విషయంపై మాట్లాడుతూ.. భారత్-అమెరికాల మధ్య న్యాయపరమైన వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామన్నారు. ఈ ఒప్పందాలకు ప్రతి ఒక్కరికీ మేలు చేస్తాయని వ్యాఖ్యానించారు. సెర్గియో కూడా విషయాలపై దృష్టి సారించాలని కోరారు. మాజీ అధ్యక్షుడు ఒబామాపై విమర్శలు గుప్పించారు. ఆయనకు భారత్ గురించి ఏమీ తెలియదని వ్యాఖ్యానించారు. సుంకాల విషయాన్ని ప్రస్తావిస్తూ.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేసిందని, కాబట్టి సుంకాలను గణనీయంగా తగ్గిస్తామని ట్రంప్ చెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఆరుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్

చర్ల/చింతూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నేషనల్ పార్కు అడవుల్లో మంగళవారం ఉదయం మావోయిస్టులు, కేంద్ర బలగాలకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. నేషనల్‌పార్క్ అటవీ ప్రాంతంలో దాదాపు 25మంది మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారంతో బీజాపూర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు మంగళవారం సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో మోస్ట్ వాంటెడ్, మద్దేడు ఏరియా కమిటీ కమాండర్ పాపారావు భార్య ఊర్మిళ, నేషనల్ పార్కు ఏరియా కమిటీ ఇన్‌చార్జి బుచ్చన్న ఉన్నట్లు తెలుస్తోంది. ఊర్మిళ మద్దేడు ఏరియా కమిటీ సభ్యురాలుగా పనిచేస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనలో పాపారావు తప్పించుకొన్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌తో దక్షిణ బస్తర్ ప్రాంతంలోని నేషనల్ పార్క్ పరిధిలో ఉన్న ఎయిడెడ్ కమిటీ దాదాపుగా తుడుచుపెట్టుకుపోయిందని పోలీసులు చెబుతున్నారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల్లో ముగ్గురు మహిళలున్నారు. మరోవైపు, బీజాపూర్ జిల్లా తార్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నారం అడవుల్లోనూ మంగళవారం మావోయిస్టులు, పోలీసు బలగాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. గాయాలతో పలువురు మావోయిస్టులు బలగాలకు పట్టుబడ్డట్లు సమాచారం.

హిడ్మా కోసం వేల బలగాలు

మార్చి 31కల్లా మావోయిస్టు పార్టీని నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌కు గడువు ఇంకా 5 నెలలు మాత్రమే మిగిలి ఉంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా జాడను పోలీసులు ఇంతవరకు కనుక్కోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే తాజాగా వేల మంది బలగాలను రంగంలోకి దింపారు. పామేడు, అబూజ్‌మడ్, నేషనల్ పార్కు, కర్రె గుట్టల్లో గాలింపు ముమ్మరం చేశారు. అడవుల్లో ఇంకా సాయుధ పోరాటం చేస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు గణపతి, బెహరా, పశులూరి విశ్వనాథం, కాకా హనుమంతు, మల్లారెజి రెడ్డి, అనల్‌దా, రణదేవ్, గోసం గాలింపు ముమ్మరం చేశారు. ప్రత్యేక శాటిలైట్ చిత్రాల ద్వారా వారి జాడను కనుగొంటున్నారు.

పాక్‌లో ఆత్మాహుతి బాంబు దాడి

» 12 మంది మృతి.. మరో 27 మందికి గాయాలు


ఇస్లామాబాద్, నవంబరు 11: పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఘటనలో 12 మంది మృతి చెందగా, మరో 27 మంది గాయాలపాలయ్యారు. జిల్లా కోర్టు భవనాల సముదాయం వద్ద మంగళవారం మధ్యాహ్నం 12.39 గంటలకు ఈ దాడి జరిగింది. ఆత్మాహుతి బాంబర్ కోర్టు సముదాయం లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. అయితే, కోర్టు గేటు వద్ద పోలీసు వాహనం నిలిపి ఉంచడంతో దాని సమీపానికి వచ్చి తనను తాను పేల్చేసుకున్నాడు. ఈ ఘటనను పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తీవ్రంగా ఖండించారు. కాబూల్ పాలకులు పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపించడం ఆపకుంటే పూర్తి సామర్థ్యంతో ప్రతిస్పందిస్తామని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో కాబూల్ పాలకులతో చర్చలు జరపడం కూడా వృథా అని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

పెట్టుబడుల సదస్సుకు భారీ ఏర్పాట్లు



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో పెట్టుబడుల సదస్సుకు జరుగుతున్న ఏర్పాట్లు

విశాఖపట్నం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు-2025కు ఆంధ్రా యూనివర్సిటీ(ఏయూ) ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశ విదేశాల నుంచి మొత్తం 3 వేల మంది వస్తారని అంచనా వేసిన నేపథ్యంలో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఐఐ పోర్టల్ ద్వారా ఇప్పటికే 2 వేల మంది తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారని విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఉప రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలు దేశాలకు చెందిన రాయబారులు, అంతర్జాతీయ ప్రముఖులు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు వంటి ప్రత్యేక ఆహ్వానితులు 800 మంది వరకు రానున్నారని చెప్పారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో సదస్సు కోసం జర్మన్ హ్యాంగర్లతో 8 హాళ్లు నిర్మించారు. కాగా, పెట్టుబడుల సదస్సుకు.. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను హోం మంత్రి అనిత ఆదేశించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



భోజనాల హాలు

నాడు ఛీఛీ.. నేడు భలేభలే!



వర్చువల్‌గా ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తున్న సీఎం

(మొదటి పేజీ తరువాయి)

దేశ విదేశాల నుంచి పెట్టుబడిదారులు రాష్ట్రానికి బారులు తీరుతున్నారని తెలిపారు. 'పరిశ్రమలు, ఉపాధి కల్పన' పేరుతో ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెం వద్ద ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఈ పార్కును సీఎం మంగళవారం ప్రారంభించారు. దీనితో పాటు 17 జిల్లాల్లో మరో 49 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మొత్తం 868 ఎకరాల్లో రూ.873 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టులను పరిశ్రమల శాఖ చేపట్టగా.. వాటిలో అనుమతులు పొందిన 1,597 ఎంఎస్ఎంఈ సంస్థలకు సీఎం శ్రీకారం చుట్టారు. వీటితో పాటు రాష్ట్రంలో రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 మెగా పారిశ్రామిక యూనిట్లను కూడా ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని 87 కేంద్రాల నుంచి వర్చువల్‌గా సుమారు 40 వేల మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అధికారులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సీఎం తొలుత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం లింగన్నపాలెం సభకు భారీగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఆయన ఏం చెప్పారంటే..

> కూటమి ప్రభుత్వ ఆలోచనలను అందిపుచ్చుకుని.. ప్రభుత్వ విధానాలను అవగాహన చేసుకుని యువత ముందుకు రావాలి. ఒకరి దగ్గర ఉద్యోగాలు చేయడం కన్నా పారిశ్రామికవేత్తలుగా మారి పది మందికి ఉద్యోగాలు ఇచ్చేలా ఎదగాలి.
>
> కేంద్రం క్వాంటమ్ కంప్యూటింగ్ ఆలోచన చేస్తే దానిని తెచ్చి అమరావతిలో పెట్టాం. క్వాంటమ్ కంప్యూటర్ల తయారీ కంపెనీలు అమెరికా, జపాన్ వంటి ఐదారు దేశాల్లో మాత్రమే ఉండగా.. ఇప్పుడు వాటి సరసన అమరావతి నిలువనుంది.
>
> \- ముఖ్యమంత్రి చంద్రబాబు

సాంకేతిక హబ్‌గా ఆంధ్ర: భవిష్యత్ అంతా సాంకేతికతదే. ఆంధ్రప్రదేశ్‌ను సాంకేతిక హబ్‌గా మారుస్తున్నాం. ఇంటికో ఐటీ ఉద్యోగి అని 30 ఏళ్ల క్రితం పిలుపిచ్చాను. ఇప్పుడు ఇంటికొక పారిశ్రామికవేత్త కావాలని యువతకు పిలుపిస్తున్నా.. ఈ లక్ష్యంలో భాగంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను, అలాగే రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో ఐదు పెద్ద కంపెనీల భాగస్వామ్యంతో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ బ్యాంకర్లు కూడా ఉండి ఆర్థిక సాయం అందించే చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టిలో ప్రజల భాగస్వామ్యం కోసం ఇవన్నీ చేస్తున్నాం. కష్టాలన్నింటినీ మాకే పరిమితం చేసుకుని ప్రజల ముఖాల్లో ఆనందం చూడాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. గత పాలకులు సోలార్ విద్యుత్ పెట్టుబడిదారులు కంపెనీలను మూసేశారు. వారు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను తీసుకోలేదు. వారు కోర్టును ఆశ్రయించడంతో విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చింది. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు పండగ రానుంది. మొత్తం 50 దేశాల నుంచి 532 మంది పెట్టుబడిదారులు ఈ సదస్సుకు వస్తున్నారు.

మోదీ ఆలోచనలను అందిపుచ్చుకుని..

నా నాయకత్వానికి మోదీ విధానాలు, పవన్ కల్యాణ్ సహకారం, లోకేశ్ పట్టుదల తోడై.. పారిశ్రామికాభివృద్ధి పరుగులు తీస్తోంది. కేంద్రంలోని మోదీ ఆలోచనలు చేస్తే వాటిని అందిపుచ్చుకుని తొలుత మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్నాం. అలా ప్రధాని ఆలోచనను హైజాక్ చేసి.. రాష్ట్రంలో సాంకేతిక రంగాన్ని మరింతగా వృద్ధి చేయగలుగుతున్నాం. దేశంలోనే తొలి డ్రోన్ సిటీని కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఏర్పాటు చేశాం. ఇక్కడి డ్రోన్లనే ఆపరేషన్ సిందూర్‌లో వాడారు. తిరుపతిలోనూ డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి రానున్న రోజుల్లో ప్రపంచానికి రాష్ట్రం నుంచే డ్రోన్లు సరఫరా జరిగే స్థాయికి తెస్తాం.

రండి.. పరిశ్రమలు స్థాపించండి

గతంలో ఉపాధి కోసం, సంపాదన కోసం సొంత ప్రాంతాలను వదిలి బయటకు వెళ్లిన వారు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని.. తిరిగి వచ్చి పరిశ్రమలు స్థాపించాలి. గతంలో మూడు సార్లు సీఎంగా ఎన్ని పనులు చేశానో ఈసారి అంతకన్నా ఎక్కువగా చేయాలన్న పట్టుదలతో సాగుతున్నాను. ఇవాళ ప్రారంభించిన ఎంఎస్ఎంఈ పార్కులు, పరిశ్రమలకు తోడు మరో రూ.2.39 లక్షల కోట్ల విలువైన 75 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయాల్సి ఉంది. వీటి ద్వారా రెండు లక్షల ఉద్యోగాలు లభిస్తాయి. ఇటీవల మొంథా తుఫాన్ సమయంలో అధికారులు, నాయకులు కలిసి పనిచేయడంతో ప్రాణనష్టం తప్పింది. ఆస్తినష్టాన్ని గణనీయంగా తగ్గించి ప్రజలను కాపాడాం. అలాగే పారిశ్రామిక రంగంలోనూ సమన్వయంతో పనిచేయాలి. వారసత్వంగా వస్తున్న రెవెన్యూ సమస్యలతో కొంత ఇబ్బంది ఉంది. వాటిని కూడా పరిష్కరిస్తాం. అవసరమైతే కొరడా ఝుళిపిస్తాం.

చిన్న పరిశ్రమకు ఊతం!

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. ఆకర్షణీయమైన పారిశ్రామిక విధానాలతో భారీస్థాయిలో పెట్టుబడులను ఆకర్షించి.. పెద్దఎత్తున పరిశ్రమల స్థాపన ద్వారా ఉద్యోగాల కల్పన లక్ష్యాన్ని చేరుకునే దిశగా అడుగులు వేస్తోంది. తక్కువ పెట్టుబడితో పెట్టే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) ద్వారానే 97 శాతం ఉద్యోగాలు, ఉపాధి కల్పన సాధ్యమని గుర్తించిన సర్కారు.. చిన్న పరిశ్రమలకే అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తూ మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది.

చంద్రబాబు బ్రాండ్‌తో పెట్టుబడులు: పయ్యావుల

అనంతపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నా రు. సీఎం చంద్రబాబు మంగళవారం కనిగిరి నుంచి ఎంఎస్ఎంఈ పార్కుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని అనంతపురంలోని సెరికల్చర్ కార్యాలయ ఆవరణలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని పయ్యావుల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న సీఐఐ సదస్సులో దాదాపు 55 దేశాల వాణిజ్య మంత్రులు పాల్గొంటారని తెలిపారు. పనిచేసే ప్రభుత్వం వస్తే ఎంత మార్పు వస్తుందో.. తమ ప్రభుత్వాన్ని చూసి గమనించాలని ప్రజలను కోరారు. గత పాలకుల పాపాల మూలంగా రాష్ట్రాన్ని మరిచిపోలేని భయం వెంటాడుతున్నా.. చంద్రబాబు బ్రాండ్‌ను చూసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారన్నారు.

వైసీపీ హయాంలో పారిశ్రామిక రంగం నిర్వీర్యం

- పెట్టుబడిదారులు పక్క రాష్ట్రాలకు పారిపోయారు: మంత్రి నారాయణ

కాకినాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి పొంగూరి నారాయణ ఆరోపించారు. పరిశ్రమల స్థాపనకు వచ్చేవారిని బెంబేలెత్తించి, ఇతర రాష్ట్రాలకు పారిపోయేలా చేసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం కేవలం 16 నెలల కాలంలో రూ.9లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుందని తెలిపారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద జిల్లా పరిశ్రమలు, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'పరిశ్రమలు-ఉపాధి కల్పన' ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాకినాడ పోర్టులో ఎంపీటీ మెరైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణ, పెద్దాపురంలో సంతోషిమాత కారుగేటర్స్ పరిశ్రమ, శంఖవరం మండలం ఆరంపూడిలో ఓ పరిశ్రమ, తునిలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు శిలాఫలకాలను మంత్రి నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ హయాంలో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదని అన్నారు.



మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో మాట్లాడుతున్న బాబు

అండగా ఉంటా

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతుబట్టడం లేదు
- మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: సీఎం

విజయవాడ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): "ఎంతో అనుభవం ఉన్న నాకే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతుబట్టడం లేదు.. అయినా భయం లేదు. ముందుకే సాగుతా.." అని సీఎం చంద్రబాబు అన్నారు. మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ రెండో విద్యా దినోత్సవ కార్యక్రమాలలో ప్రసంగించారు. గత ఐదేళ్లలో కేంద్రం డబ్బులు ఇచ్చినా రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకుండా అప్పటి ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుందన్నారు. "ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని పనులు కొంత ఆలస్యం అవుతున్నాయి. నేనుంటే క్షేమంగా ఉంటామనే నమ్మకంతో ఓట్లేశారు. కేర్‌ఫుల్‌గా డ్రైవ్ చేసే వ్యక్తిని కాబట్టి మిమ్మల్ని సురక్షితంగా ఒడ్డుకు తీసుకెళ్తానని భరోసా ఇస్తున్నా. శాశ్వతంగా మీ వాడిగా, మీకు తోడుగా ఉంటానని హామీ ఇస్తున్నా. ఆర్థిక కష్టాలున్నా పింఛన్లు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నా. రాత్రింబవళ్లు కష్టపడుతున్నా. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసి చూపించాను. ఏపీకి ఉన్న బ్రాండ్‌ను గత ఐదేళ్లలో భ్రష్టు పట్టించారు. మళ్లీ అందరిలో నమ్మకం కలిగించి పెట్టుబడిదారులను తీసుకొస్తున్నాను. ఇప్పటికే రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. విశాఖ సదస్సులో మరో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయి. గూగుల్ ద్వారా రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి" అని పేర్కొన్నారు. ఉద్యోగులకు అండగా ఉంటానని, వారు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముస్లిం మైనార్టీలను అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలపాలన్నదే తన ధ్యేయమని తెలిపారు త్వరలో విజయవాడలోనూ హజ్ బిల్డింగ్ నిర్మిస్తామని అన్నారు. నూర్ బాషా కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయిస్తామన్నారు.

ఉదారంగా ఆదుకోండి

- తక్షణ సాయంగా 2,622కోట్లు ఇవ్వండి
- మొంథా తుఫాన్‌తో రూ.6,384కోట్ల నష్టం
- కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ఏపీని ఉదారంగా ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని సీఎం చంద్రబాబు కోరారు. తక్షణ సాయంగా రూ.రూ.2,622కోట్లు మంజూరుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, పంటలు, ఆక్వా, చేనేత.. ఇలా మొత్తంగా రూ.6,384కోట్ల మేర పలు రంగాలకు నష్టం వాటిల్లిందని వివరించారు. రాష్ట్రంలో తుఫాన్ నష్టంపై అంచనాకు వచ్చిన కేంద్రబృందం మంగళవారం మధ్యాహ్నం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో భేటీ అయింది. క్షేత్రస్థాయిలో రెండురోజులుగా జరిపిన పరిశీలనలను సీఎం దృష్టికి తీసుకువచ్చింది. అనంతరం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "రాష్ట్రవ్యాప్తంగా 443 మండలాల పరిధిలో 3,109 గ్రామాలు తుఫాన్ వల్ల ప్రభావితమయ్యాయి. దాదాపు 10లక్షల మంది తుఫాన్‌తోపాటు భారీ వర్షాల కారణంగా నష్టపోయారు. 9,960 ఇళ్లు నీట మునిగాయి. 1.11లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. 4,566 ఇళ్లు దెబ్బతిన్నాయి. 1.61లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. దానివల్ల 3.27లక్షల మంది రైతులు నష్టపోయారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలతో పాటు ఆక్వా, పశు సంపద, చేనేత రంగానికి కూడా తీవ్రంగా నష్టం వాటిల్లింది. 4,794కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. 12,856 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 2,318 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. 22 జిల్లాల్లో 1.92లక్షల మందిని పునరావాస శిబిరాలకు తరలించాం. మొత్తం 3.36 లక్షల కుటుంబాలకు రూ.3వేలు చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందించాం. రోడ్లు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలను పునరుద్ధరించేందుకు తక్షణ సాయంగా రూ.2,622కోట్లు మంజూరు చేయండి" అంటూ జయలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైన కేంద్ర బృందం

విభజన కష్టాలకు విధ్వంసం తోడు

తుఫాన్ నష్టంపై త్వరగా నివేదిక ఇచ్చి, రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్రబృందాన్ని సీఎం కోరారు. 'ఏపీ నుంచి రెండు రోజుల్లో తుది అంచనాలు పంపుతామని ఆయన తెలపగా.. త్వరితగతిన కేంద్రానికి సిఫారసు చేస్తామని బృందం తెలిపింది. ఆర్టీజీఎస్ నుంచి ముందస్తు హెచ్చరికలు పంపి, సరైన సమయంలో విలువైన ప్రాణాలను కాపాడగలిగారంటూ చంద్రబాబును కొనియాడింది. తడిసిన ధాన్యం కొనుగోలుకు నిబంధనలు సడలించేలా సిఫారసు చేయాలని సీఎం కోరారు. ఓ వైపు రాష్ట్ర విభజన, మరోవైపు గతపాలకుల విధ్వంసపాలన ఏపీని తీవ్రంగా నష్టపర్చాయని వివరించారు. నాడు రాష్ట్ర విపత్తు నిధులను కూడా దారి మళ్లించారని తెలిపారు. 'తీర ప్రాంతాల్లోని సముద్ర కోత నివారణకు వేర్వేరు చోట్ల పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించేలా చూడండి. కాకినాడ సమీపంలోని ఉప్పాడ వద్ద సముద్ర కోత నివారణ కోసం రూ.323కోట్లు, విశాఖ సమీపంలో రూ.203కోట్లు, శ్రీకాకుళం వద్ద రూ.98కోట్లు కేటాయించేలా సిఫారసు చేయండి' అని కోరారు.



చీరాల రామాపురం సముద్ర తీరంలో కోతకు గురైన చప్టాను పరిశీలిస్తున్న కేంద్ర బృందం, పక్కన బాపట్ల కలెక్టర్ వినోద్ కుమార్

పంటంతా పోయింది.. ఆదుకోండి

- కేంద్ర బృందానికి రైతుల వేడుకోలు
- బాపట్ల, కోనసీమల్లో మొంథా నష్టాలను స్వయంగా పరిశీలించిన బృందం

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

మొంథా తుఫాన్‌తో జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందం మంగళవారం బాపట్ల, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పర్యటించింది. ఎకరానికి 30 బస్తాల వరకు ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసుకున్నాని, తుఫాన్ వల్ల 10 బస్తాలు కూడా చేతికివచ్చే పరిస్థితి కనిపించడం లేదని బాపట్ల జిల్లా కారంచేడుకు చెందిన రైతు మద్దుకూరి వెంకటసుబ్బారావు కేంద్రం బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మూడెకరాల్లో వరి సాగు చేశానని, రూ.50వేల వరకు నష్టం వచ్చేలా ఉందని మరో రైతు అనిల్ వాపోయారు. వాగులు పొంగిపొర్లడంతో కాలువ కింద సాగవుతున్న 150 ఎకరాల వరిని ముంపు ఊడ్చేసిందని రైతు బంగారు బాబు వివరించారు. కాగా, పంట నష్టాల అంచనాకు ఈ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నామని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ తెలపగా, ఆ నమోదు వివరాలను తెలుసుకోవడానికి కేంద్ర బృందం ఆసక్తి కనబరిచింది.

సహజకవికి తుది వీడ్కోలు!

అధికార లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు

మేడ్చల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సహజకవి అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు పక్కన ఉన్న హెచ్ఎండీఏ స్థలంలో మంగళవారం అధికార లాంఛనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అందెశ్రీకి గౌరవసూచకంగా పోలీసులు తుపాకులను మూడుసార్లు గాల్లోకి పేల్చారు. అంత్యక్రియలకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు హాజరై అక్షర యోధుడికి తుది వీడ్కోలు పలికారు. రేవంత్ రెడ్డి స్వయంగా అందెశ్రీ పాడెను మోశారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను పాఠ్యపుస్తకాల్లో చేర్చేందుకు నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. అందెశ్రీ కుటుంబసభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. అంత్యక్రియల్లో విమలక్క, పాశం యాదగిరి, ఉద్యమకారులు, కవులు, కళాకారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



అందెశ్రీకి నివాళులర్పిస్తున్న తెలంగాణ సీఎం

అక్రమాస్తుల కేసులో.. 21న కోర్టుకు జగన్

(మొదటి పేజీ తరువాయి)

గట్టిగా కోరింది. తీవ్ర ఆర్థిక నేరారోపణలను ఎదుర్కొంటున్న జగన్.. ఆరేళ్లుగా ట్రయల్ కోర్టుకు రాకుండా తప్పించుకుని తిరుగుతున్నారని తెలిపింది. ఈ కేసులకు సంబంధించి డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున జగన్ ప్రత్యక్షంగా కోర్టుకు హాజరవడంలో తప్పేమీ లేదని పేర్కొంది. దీంతో గత్యంతరం లేక వ్యక్తిగత హాజరు మినహాయింపు కోరుతూ దాఖలు చేసిన మెమోను జగన్ తరఫు న్యాయవాది వెనక్కి తీసుకున్నారు. మరికొద్ది రోజులు సమయం ఇస్తే మాజీ సీఎం వ్యక్తిగతంగా కోర్టులో హాజరవుతారని తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు కోర్టు సమయం ఇవ్వగా.. అదే రోజున న్యాయస్థానానికి జగన్ వస్తారని న్యాయవాది వెల్లడించారు. దీంతో ఆరేళ్ల తర్వాత ఆయన కోర్టు మెట్లు ఎక్కనున్నారు. జగన్ అభ్యర్థనతో గత నెలలో ఆయన యూరప్ పర్యటనకు వెళ్లేందుకు సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతి ఇవ్వడం తెలిసిందే. తిరిగొచ్చిన తర్వాత ఈ నెల 14వ తేదీ లోపు కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా ఆదేశించింది. అందుకు అంగీకరించి యూరప్ వెళ్లిన మాజీ సీఎం.. స్వదేశానికి వచ్చాక మాత్రం పిల్లిమొగ్గలు వేశారు. రకరకాల కారణాలు చెబుతూ.. హాజరు నుంచి మినహాయింపు కావాలని కోర్టులో మెమో దాఖలు చేశారు. తాను న్యాయస్థానానికి వస్తే తగిన ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వ యంత్రాంగానికి భారమవుతుందని, ఆన్‌లైన్‌లో విచారణకు హాజరవుతానని కోర్టును కోరారు. సీబీఐ అందుకు అంగీకరించకపోవడంతో వేరే మార్గం లేక ప్రత్యక్షంగా న్యాయస్థానంలో హాజరవుతానని తెలిపారు. అక్రమాస్తుల కేసులో సీబీఐ 2012 మే 27న జగన్‌ను అరెస్టు చేసింది. సుమారు 16 నెలలు ఆయన జైలులో ఉన్నారు. 2013 సెప్టెంబరు 23న ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేయగా.. 24వ తేదీన ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. అప్పటి నుంచి ఈ కేసుల్లో పన్నెండేళ్లుగా జగన్ బెయిల్‌పైనే ఉన్నారు.



టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

శ్రేణుల్లో అసంతృప్తి ఎందుకో తేల్చండి

- టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్లకు లోకేశ్ ఆదేశం

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత.. ఈసారి ఇచ్చినన్ని పదవులు గతంలో ఎన్నడూ ఇవ్వలేదు. అయినా పార్టీ శ్రేణులు అసంతృప్తిగా ఉంటున్నాయి. దీనికి కారణం ఏమిటో ఆరా తీయండి' అని పార్టీ జోనల్ సమన్వయకర్తలను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆదేశించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జోనల్ కో-ఆర్డినేటర్లతో ఆయన, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సుమారు 3గంటల పాటు సమావేశమయ్యారు. కార్యకర్తలకు, నేతలకు నడుమ దూరం పెరిగిపోతోందని, తరచూ వారితో మాట్లాడకపోవడం వల్లే వారేం ఏం కోరుకుంటున్నారో నాయకులకు తెలియడం లేదని లోకేశ్ వ్యాఖ్యానించారు. 'పార్టీకి కార్యకర్తే అధినేత. ఆ దిశగా ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యం ఉండాలి. కార్యకర్తలకు, ఎమ్మెల్యేలు, మంత్రులకు జోనల్ కో-ఆర్డినేటర్లు వారధిలా పనిచేయాలి. నెలకోరోజు ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశమవ్వండి. కార్యకర్తల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించండి' అని తెలిపారు. జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న చోట టీడీపీ ఇన్‌చార్జులు సమన్వయం చేసుకోవడం కీలకమని చెప్పారు. ప్రతినెలా జోనల్ కో-ఆర్డినేటర్లతో సమావేశమై పనితీరు సమీక్షిస్తానన్నారు.

చట్టబద్ధంగా అక్రమ కేసుల పరిష్కారం..

వైసీపీ పెట్టిన అక్రమ కేసులపై సమీక్షించి చట్టపరంగా పరిష్కరిద్దామని లోకేశ్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న పార్టీ పదవులను డిసెంబరు నాటికి భర్తీ చేస్తామని తెలిపారు. అన్ని జిల్లాల్లో పార్లమెంటరీ పార్టీ కార్యాలయాలు, నియోజకవర్గ, మండల స్థాయిలో పార్టీ ఆఫీసుల ఏర్పాటుకు స్థలాలు గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. క్యాడర్‌కు శిక్షణ కార్యక్రమాలను 10 రోజుల్లో ప్రారంభించాలని సూచించారు. లోకేశ్‌తో సమావేశమైన జోనల్ కో-ఆర్డినేటర్లలో బీద రవిచంద్ర, మంతెన సత్యనారాయణరాజు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, దామచర్ల సత్య, సుజయ్‌కృష్ణ రంగారావు, దీపక్‌రెడ్డి, కోవెలమూడి రవీంద్ర, వేపాడ చిరంజీవిరావు, మందలపు రవి, పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

వైసీపీ హయాంలో అక్రమ కేసులతో వేధించారు!

- భూములు కబ్జా చేశారు.. లోకేశ్‌కు ఫిర్యాదులు
- 72వ రోజు ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

మంగళగిరి/అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అక్రమ కేసులతో వేధించారని, తమ భూములను కబ్జా చేశారని పలువురు బాధితులు మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం 72వ రోజు ప్రజాదర్బార్‌ను ఆయన నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై తమ సమస్యలు విన్నవించారు. టీడీపీ సానుభూతిపరుడినన్న కక్షతో వైసీపీ హయాంలో అప్పటి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తనపై అక్రమంగా హత్య కేసు బనాయించారని సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం శిరిగారిపల్లికి చెందిన కే రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా నష్టపోయానని, ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వంశపారంపర్యంగా తమకు సంక్రమించిన 4.86 ఎకరాల వ్యవసాయ భూమిని వైసీపీ నేతలు ఆక్రమించారని కడప జిల్లా వేముల మండలం నల్లచెరువుపల్లెకు చెందిన కస్తూరి రామన్న ఫిర్యాదు చేశారు. విచారించి తమ భూమిని తిరిగి అప్పగించాలని విన్నవించారు. పలు రాష్ట్రాల్లో ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన ఒంగోలుకు చెందిన మైత్రి ప్లాంటేషన్ అండ్ హార్టికల్చర్ రియల్టర్స్ సంస్థ బాధితులకు న్యాయం చేయాలని కర్నూలు జిల్లా పెరవలికి చెందిన ఎం.రంగస్వామి కోరారు. ఉదయం 11 గంటలకు కార్యాలయానికి వచ్చిన లోకేశ్ సాయంత్రం 6 వరకు ఉన్నారు. సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలిచ్చారు.



టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో దివ్యాంగుడి సమస్యలు వింటున్న మంత్రి లోకేశ్

పట్టుకున్నదెంత.. లెక్క చూపిందెంత?

- పరకామణి కేసును ఎందుకంత తేలిగ్గా తీసుకున్నారు?
- అప్పటి టీటీడీ అధికారులను విచారించిన సీఐడీ డీజీ
- నేడు విచారణకు హాజరుకానున్న మాజీ ఈవో ధర్మారెడ్డి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణిలో చోరీ కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యనార్ నేతృత్వంలో అధికారుల బృందం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మంగళవారం అప్పటి డిప్యూటీ ఈవో మల్లికార్జునరావు, తిరుమల కమాండ్ కంట్రోల్ యూనిట్ ఇన్‌చార్జి చంద్ర, ఆర్‌ఎస్‌ఐ సుబ్బరాజు, టీటీడీ గార్డు రామచంద్రను వేర్వేరుగా విచారించారు. ప్రధానంగా ఉద్యోగ విభాగాల్లో బాధ్యతల నిర్వహణ, డ్యూటీ నిబంధనలకు సంబంధించిన విషయంలో వాంగ్మూలాలు నమోదు చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన మేరకు.. తొలుత మల్లికార్జునరావుతో జరిగిన విచారణలో 'పరకామణిలో చోరీకి పాల్పడిన రవికుమార్ వద్ద పట్టుకున్న విదేశీ కరెన్సీ ఎంత? అందులో డాలర్లు ఎన్ని? ఎఫ్‌ఐఆర్‌లో చూపించిన లెక్క ఎంత?' అన్నదానిపై సీఐడీ డీజీ ఎక్కువగా ఆరా తీసినట్టు తెలిసింది. 'డిప్యూటీ ఈవో హోదాలో పరకామమణిలో ఎలాంటి చర్యలు తీసుకున్నారు.? ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.? రవికుమార్‌ను ఎందుకు తనిఖీ చేయలేద'ని ప్రశ్నల వర్షం కురిపించారు. '72 డాలర్లు పట్టుకుంటే 9 డాలర్ల లెక్క ఎందుకు చూపించారు? పంచనామా ఎందుకు చేయలేదు? రాజీ వెనుక పెద్దలు ఎవరు? అంత నిర్లక్ష్యంగా ఎందుకున్నారు? నాటి అధికార పార్టీ నేతలు ఏమైనా ఒత్తిడి తెచ్చారా? డిప్యూటీ ఈవో హోదాలో బాధ్యతగా ఎందుకు వ్యవహరించలేదు' అని డీజీ అడిగినట్టు సమాచారం. ఎవరి ద్వారా టీటీడీకి డిప్యుటేషన్‌పై వచ్చారు? ఇందులో ధర్మారెడ్డి పాత్ర ఏమైనా ఉందా?' అని ఆరాతీశారు.

ఫుటేజీలు ఉన్నాయా? డిలీట్ చేశారా?

'కమాండ్ కంట్రోల్‌లో చోరీ డేటా ఫుటేజీలు ఉన్నాయా? డిలీట్ చేశారా? ఉన్నవి ఎవరికి స్వాధీనం చేశారు? రవికుమార్‌ను పట్టుకున్న రోజు ఆయన పక్కనున్న ఉద్యోగులు ఎవరు?' అని సీసీ యూనిట్ ఇంచార్జి చంద్రను సీఐడీ డీజీ ప్రశ్నించినట్లు తెలిసింది. చోరీ చేస్తున్నట్టు సీసీ కెమెరాలో చూసి, వీజీవోకు అప్పగించానని ఆయన జవాబు ఇచ్చినట్టు సమాచారం. గార్డు వచ్చి చెప్పిన తర్వాత పట్టుకున్నామని ఆర్‌ఎస్‌ఐ సుబ్బరాజు చెప్పినట్టు తెలిసింది. కాగా, పరకామణి కేసులో కీలక అధికారిగా ఉన్న మాజీ ఈవో ధర్మారెడ్డి బుధవారం సీఐడీ డీజీ ముందు హాజరుకానున్నారు.

దొంగలే జాగ్రత్తలు చెబుతున్నారు!

- వైసీపీ అబద్ధపు ప్రచారాలను నమ్మొద్దు: యామిని

విజయవాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేసే అబద్ధపు ప్రచారాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బీజేపీ అధికార ప్రతినిధి సాధినేని యామిని వ్యాఖ్యానించారు. దొంగలున్నారు జాగ్రత్త అని దొంగలే అన్నట్టు వారి మాటలున్నాయని ఎద్దేవా చేవారు. జగన్, అతని అనుచరులు పచ్చి అబద్ధాలను ప్రజల్లోకి తీసుకెళ్లగల నిపుణులని విమర్శించారు. 'మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నారనే వంకతో వైసీపీ వాళ్ల ఆందోళనకు దిగుతున్నామని చెబుతున్నారు. కానీ, పీపీపీ అంటే కూడా జగన్‌కు తెలియదు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్లు కొల్లగొట్టారు.' అని ధ్వజమెత్తారు.

కల్తీ నెయ్యేనని తెలిసీ ఎలా అనుమతించారు?

శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తెలీదా?.. ఒక్కో ట్యాంకర్‌కు ఎంత కమీషన్ ముట్టింది?
గతంలో పనిచేసినప్పుడూ ఇలాగే చేశారా?.. ధర్మారెడ్డిపై సిట్ ప్రశ్నల వర్షం

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'తిరుమలేశుడి లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అవుతోందని తెలిసి కూడా ఎలా అనుమతించారు? కనీసం నెయ్యి ఎక్కడి నుంచీ ఎవరు సరఫరా చేస్తున్నారనేది కూడా పట్టించుకోలేదా? కల్తీ నెయ్యి సరఫరాలో ఒకో ట్యాంకర్‌కు కమీషన్ ఎంత ముట్టింది.' అంటూ టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రశ్నల వర్షం కురిపించింది. గత ప్రభుత్వంలో టీటీడీని కనుసైగతో శాసించిన ఆయన ఎట్టకేలకు కల్తీ నెయ్యి కేసులో మంగళవారం విచారణకు హాజరయ్యారు. పనిచేసిన ఐదేళ్లూ దేవస్థానంలో అధికారులను, ఉద్యోగులను గడగడలాడించిన ఆయన.. సిట్ కార్యాలయానికి వచ్చిన తీరు ఆసక్తికరంగా ఉంది. తననెవరూ గుర్తుపట్టకుండా.. తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన వాహనంలో వచ్చారు. తలకు టోపీ, ముఖానికి మాస్కు, నల్ల కళ్లద్దాలు ధరించారు. తిరుపతి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సు ఆవరణలోని సిట్ కార్యాలయంలోకి వెళ్లిన ఆయన్ను అక్కడున్న అధికారులు తొలుత గుర్తించలేకపోయారు. ఎవరు మీరని ప్రశ్నించగా.. టోపీ, మాస్కు, కళ్లద్దాలు తొలగించి తాను ధర్మారెడ్డినని చెప్పారు. దీంతో అధికారులు ఆయనను సీబీఐ డీఐజీ చాంబర్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. ఉదయం 10.42 గంటలకు సిట్ కార్యాలయంలోకి వెళ్లిన ధర్మారెడ్డిని మధ్యాహ్నం 2 గంటల వరకూ విశాఖ సీబీఐ డీఐజీ మురళి రాంబా విచారించారు. మధ్యాహ్నం 2.05 గంటలకు మాజీ ఈవో టోపీ, మాస్కు, నల్లకళ్లద్దాలు లేకుండా మామూలుగానే బయటకు వచ్చారు. తిరిగి 3 గంటలకు సిట్ కార్యాలయంలోకి వెళ్లారు. రాత్రి 9.15 గంటల వరకూ విచారణ సాగింది. బుధవారం కూడా ఆయన్ను ప్రశ్నించే అవకాశముందని సిట్ వర్గాలు వెల్లడించాయి.

లోతుగా విచారణ...

విశ్వసనీయ సమాచారం మేరకు.. సిట్ అధికారులు ధర్మారెడ్డిని లోతుగా విచారించారు. కొన్ని అంశాల్లో ఆయన పాత్రపై సూటిగా ప్రశ్నించారు. కోట్లాది మంది భక్తులు పవిత్రంగా స్వీకరించే శ్రీవారి లడ్డూల తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అవుతోందని ఎపుడు గుర్తించారనే ప్రశ్నతో మొదలుపెట్టారు. 'కల్తీ నెయ్యి సరఫరా అవుతోందని తెలిసినా లడ్డూల తయారీకి ఎలా అనుమతించారు? కల్తీ విషయం తెలియక ముందు ఎన్ని ట్యాంకర్లు అనుమతించారు? తెలిశాక ఎన్ని అనుమతించారు? బాధ్యత కలిగిన ఈవో పోస్టులో ఉండి ఈ వ్యవహారాన్ని ఎందుకు పట్టించుకోలేదు? భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తెలియదా? కల్తీ నెయ్యి అనుమతించేందుకు ఎలా ధైర్యం చేశారు? టీటీడీలో గతంలో పనిచేసినప్పుడు కూడా ఇలాగే చేశారా? కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి ఒక్కో ట్యాంకర్‌కు కమీషన్ ఎంత ముట్టింది' అని ప్రశ్నించారు. టీటీడీలో నెయ్యి నాణ్యత నిర్ధారించే సదుపాయం లేనప్పుడు ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారా అని అడిగారు. భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ నుంచి బహుమానాలుగా ఏమి ముట్టాయని కూడా ప్రశ్నించారు. 'టీటీడీ చీఫ్ మీరే కదా? ఏ చిన్న తప్పు జరిగినా మీదే కదా బాధ్యత? ఒకవేళ కిందిస్థాయి ఉద్యోగులు తప్పు చేశారని అనుకున్నా మీరెలా ఊరుకున్నారు?' అని అడుగగా.. ఉన్నత స్థాయి నుంచి వచ్చిన ఒత్తిళ్లతో నెయ్యి సరఫరాను అనుమతించాల్సి వచ్చిందని, ఆ విషయంలో తన తప్పేమీ లేదని చెప్పినట్టు తెలిసింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసే ఉద్దేశమేదీ తనకు లేదని సమాధానమిచ్చినట్టు తెలిసింది.

సిట్ ముందుకు భోలేబాబా యజమానులు

ఇంకోవైపు.. కల్తీ నెయ్యి కేసులో కీలక నిందితులైన పొమిల్ జైన్, విపిన్ జైన్‌ను కూడా మంగళవారం సిట్ అధికారులు విచారించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం భగవాన్‌పూర్‌లోని మెస్సర్స్ భోలేబాబా డెయిరీ యజమానులైన వీరిద్దరూ కల్తీ నెయ్యి కేసులో ఏ-3, ఏ-4గా ఉన్న సంగతి తెలిసిందే. భోలేబాబా డెయిరీ నుంచీ వీరు సరఫరా చేసిన నెయ్యి నాసిరకంగా ఉందని, కల్తీని గుర్తించిన టీటీడీ ఈ డెయిరీ నెయ్యిని తిరస్కరించి బ్లాక్ లిస్టులో పెట్టడంతో.. వీరిద్దరూ తిరుపతి జిల్లాలోని వైష్ణవి డెయిరీ డైరెక్టర్లుగా చేరి ఆ డెయిరీ ద్వారా తాము తయారు చేయించే కల్తీ నెయ్యిని టీటీడీకి సరఫరా చేస్తూ వచ్చారు. వైష్ణవి డెయిరీకి తోడుగా తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీని కూడా ముగ్గులోకి దింపారు. ఆ డెయిరీ పంపిన ట్యాంకర్ల ద్వారానే కల్తీ నెయ్యి వ్యవహారం గుట్టు రట్టయింది. ఈ కేసులో తొలుత అరెస్టయిన ఈ ఇద్దరూ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. వీరిద్దరికీ నకిలీ నెయ్యి తయారీ కోసం అవసరమైన రసాయనాలను సరఫరా చేసిన ఢిల్లీ వాసి అజయ్‌కుమార్ సుగంధ్‌ను సిట్ ఈ కేసులో 16వ నిందితుడిగా గుర్తించి ఇటీవల అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో వారిద్దరికీ నోటీసులు జారీ చేసి.. మంగళవారం పిలిపించి విచారణ జరిపింది. టీటీడీ పాలక మండలి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈనెల 14 లేదా 15వ తేదీన విచారణకు హాజరవుతానని సిట్‌కు ఆయన సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.


సిట్ విచారణ తర్వాత వెళ్తున్న ధర్మారెడ్డి

చిన్నఅప్పన్న కస్టడీ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. కేసు దర్యాప్తులో భాగంగా ఆయన్ను కస్టడీలో విచారించేందుకు అనుమతి కోరుతూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై నెల్లూరు ఏసీబీ కోర్టు మంగళవారం విచారణ జరిపింది. సిట్ తరఫున ఏపీపీ జయశేఖర్, చిన్న అప్పన్న తరఫున న్యాయవాది యుగంధర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు న్యాయాధికారి ప్రకటించారు. 14వ తేదీన తీర్పు వెల్లడించే అవకాశముంది. కాగా.. చిన్న అప్పన్నకు బెయిల్ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ జరగనుంది.

ధర్మారెడ్డికి శ్రీవారి లడ్డూ తినిపించబోయిన జనసేన నేత

మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్మారెడ్డి సిట్ కార్యాలయం నుంచి వెలుపలికి రాగా జనసేన నేత కిరణ్ రాయల్ ఆయనకు శ్రీవారి లడ్డూను తినిపించే ప్రయత్నం చేశారు. సిట్ కార్యాలయం నుంచి వెలుపలికి వచ్చిన ధర్మారెడ్డి వాహనమెక్కి వెళ్తూ మీడియా ప్రతినిధులను చూసి ఆపించి కిందకు దిగారు. వారితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా.. అంతకు ముందే వచ్చి వేచి చూస్తున్న కిరణ్ రాయల్ ఆయన వద్దకు వెళ్లి తమ కూటమి ప్రభుత్వంలో శ్రీవారి ప్రసాదాల రుచి, నాణ్యత ఎలా ఉందో చూడండంటూ శ్రీవారి లడ్డూను తినిపించేందుకు నోటి వద్ద పెట్టారు. అయితే ధర్మారెడ్డి ఆయన చేతిని నెట్టేసి.. మీడియాతో మాట్లాడకుండానే తిరిగి వాహనం ఎక్కి వెళ్ళిపోయారు.


ధర్మారెడ్డికి శ్రీవారి లడ్డూ ప్రసాదం తినిపించబోతున్న జనసేన నేత కిరణ్‌రాయల్

శ్రీవారి ప్రసాదాన్ని అవమానించారు: కిరణ్ రాయల్

టీటీడీ ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డి శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అవమానించారని కిరణ్ రాయల్ ఆరోపించారు. కల్తీ నెయ్యి కేసు విచారణకు హాజరైన ఆయనకు ఒక భక్తుడిగా శ్రీవారి లడ్డూను అందజేసేందుకు ప్రయత్నించానని.. దానిని చూడగానే ఆయన పారిపోయారని ఎద్దేవా చేశారు.


నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో రహదారిపై దగ్ధమవుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

- హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఘటన

చిట్యాల రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన బస్సు ప్రమాదం గుగుర్పాటుకు గురి చేసింది. హైదరాబాద్ నుంచి నెల్లూరు జిల్లా కొండాపురానికి వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో షార్ట్ సర్క్యూట్‌తో ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. బస్సు డ్రైవర్ కృష్ణ ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో ప్రాణనష్టం తప్పింది. హైదరాబాద్‌లోని బీరంగూడ నుంచి ఇద్దరు డ్రైవర్లు, 29 మంది ప్రయాణికులతో ఎన్‌ఎల్01బీ 3250 నంబరు బస్సు సోమవారం రాత్రి 11 గంటలకు బయలుదేరింది. రాత్రివేళ కావడంతో డ్రైవర్ కృష్ణ యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ శివారులో 20 నిమిషాలు బస్సును నిలిపాడు. ఆయనతోపాటు కొందరు ప్రయాణికులు టీ తాగాక బస్సు బయలు దేరింది. చిట్యాల మండలం వెలిమినేడు శివారులోని పిట్టంపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఇంజన్ నుంచి పొగ, మంటలు వస్తుండటంతో డ్రైవర్ అప్రమత్తమై ప్రయాణికులను హెచ్చరించారు.

నిఠారీ వరుస హత్యల కేసులో సురేందర్ కోలీ నిర్దోషి

- రెండుదశాబ్దాల నాటి కేసులో సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ, నవంబరు 11: దాదాపు రెండు దశాబ్దాల క్రితం దేశాన్ని కలవరపాటుకు గురిచేసిన నిఠారీ వరుస హత్యల కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ హత్యలకు సంబంధించి సురేందర్ కోలీపై పలు కేసులు నమోదు కాగా, అందులో ఒకదానిలో కోర్టు మంగళవారం ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. తక్కిన కేసుల్లో ఇప్పటికే ఆయన నిర్దోషిగా తేలారు. 15ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులోనే ప్రస్తుతం కోలీ జైలులో ఉన్నారు. తనకు ఈ కేసులో విధించిన యావజ్జీవ శిక్షను రద్దు చేయాలంటూ కోలీ సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్ వేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. కేవలం ఒక కత్తి, వాంగ్మూలం ఆధారంగా కోలీని దోషిగా నిర్ధారించారని, నేర నిర్ధారణకు అవసరమైన సరైన సాక్ష్యాధారాలను దర్యాప్తు అధికారులు సంపాదించలేకపోయారని గుర్తించింది. వేరే కేసులు లేక విచారణ పెండింగ్‌లో లేకపోతే కోలీని వెంటనే విడుదల చేయాలంటూ ఆదేశించింది. ఆయనకు విధించిన శిక్షతో పాటు జరిమానాను కూడా ధర్మాసనం రద్దు చేసింది.

సచివాలయాలను సరిదిద్దాలి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ఎలా? అన్నదానిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే పలు అధ్యయనాలు చేపట్టింది. రీగ్రూపింగ్ ద్వారా ప్రక్షాళన చేయాలనే ప్రయత్నం మొదలుపెట్టింది. అయినా... తగిన ఫలితాలు లభించడంలేదనే వ్యాఖ్యలే వినిపిస్తున్నాయి. కొందరు ఉద్యోగులకు పని ఎక్కువగా ఉంది. మరికొందరికేమో తగినంత పని లేదు. కొన్ని సచివాలయాల్లో సిబ్బంది ఎక్కువగా ఉన్నారు. మరికొన్ని చోట్ల తక్కువగా ఉన్నారు. కొన్నిచోట్ల విధులకు ఒకరిద్దరే వస్తున్నారు. మిగిలిన వారు సర్వే, ఇతరపనుల పేరు చెప్పి రావడం లేదు. వీటన్నింటినీ సరిదిద్దాలి. ముఖ్యంగా 'వర్క్ రేషనలైజేషన్' చేయాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

గ్రూపింగ్ చేసినా...

సచివాలయాల్లో 1.34 లక్షల ఉద్యోగాలకు నియామకాలు చేపట్టగా 1.24 లక్షల మంది విధుల్లో చేరారు. ఈ తర్వాత వివిధ కారణాలతో 10 వేల మంది ఉద్యోగులు రాజీనామా చేశారు. ప్రస్తుతం 1.14 లక్షల మంది పనిచేస్తున్నారు. వీరిని సమర్థంగా ఉపయోగించుకోవడంపై కూటమి సర్కారు ఏడాది పాటు కసరత్తు చేసి గ్రామ, వార్డు సచివాలయాలను రీగ్రూపింగ్ చేపట్టింది. ఆయా శాఖల ద్వారా సచివాలయ సిబ్బందిని బదిలీ చేసేందుకు అనుమతి ఇచ్చింది. క్లస్టర్ విధానం చేపట్టిన తర్వాత ఏ, బీ, సీ గ్రేడ్లుగా సచివాలయాలను విభజించారు. గతంలో ఒక్కో సచివాలయంలో 10 నుంచి 11 మంది ఉద్యోగులు ఉండేవారు. రీ గ్రూపింగ్ తర్వాత జనాభాను బట్టి ఒక్కో సచివాలయంలో 6 నుంచి 8 మందిని నియమించారు. జనాభా తక్కువగా ఉన్న ఏ కేటగిరీ సచివాలయాల్లో అడ్మిన్ పోస్టు లేకుండా చేశారు. దీంతో అక్కడ సిబ్బంది తగ్గిపోయారు. జనాభా ఎక్కువగా ఉన్న సీ కేటగిరీ సచివాలయాల్లో నియమించిన సిబ్బందికి పనిభారం ఎక్కువైందని, ఏదో ఒక రకంగా పైరవీలు చేసుకుని మధ్యతరహా బీ కేటగిరీ సచివాలయాలకు బదిలీ అవుతున్నారు. దీంతో కొన్ని సచివాలయాల్లో సిబ్బంది కొరత అలాగే ఉంది. ప్రజలకు సరిగా సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ దిశగా...

సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన గత సర్కార్ మానిటరింగ్ వ్యవస్థను లేకుండా చేసింది. ఎంపీడీఓలు మండల పరిపాలనతో పాటు అదనంగా సచివాలయ సిబ్బందిని పర్యవేక్షించడం కష్టమైంది. దీంతో సచివాలయ ఉద్యోగులు విధులకు రాకపోయినా అడిగేవారు లేరు. ఎక్కడైనా అగ్రికల్చర్ అసిస్టెంట్ సచివాలయంలో అందుబాటులో లేరని ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తే... మండల వ్యవసాయ అధికారి తనకు వేరే డ్యూటీ వేశారంటూ తప్పించుకుంటున్నారు. మహిళా పోలీసుల పరిస్థితీ అంతే. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో జరిగే ఏదైనా తిరునాళ్లు, పండగలకు మాత్రమే వారి సేవలను ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మానిటరింగ్ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కూటమి సర్కార్ ఇటీవల మండల స్థాయిలో జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి మండల కేంద్రంలో డిప్యూటీ ఎంపీడీఓ స్థాయి అధికారిని నియమించి పర్యవేక్షించాలని నిర్ణయించింది.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఇప్పటికే గ్రేడ్-1పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించివారిని డిప్యూటేషన్‌పై జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులుగా నియమించేందుకు కసరత్తు చేస్తోంది.

మరింత కసరత్తు చేస్తేనే...

గ్రామ, వార్డు సచివాలయాలను విజన్ యూనిట్లుగా వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. సిబ్బందిలో చాలామంది పలు అంశాల్లో నైపుణ్యం గల వారు ఉన్నారు. ఉన్నత విద్యావంతులు ఉన్నారు. ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారూ ఉన్నారు. కొంత మంది అయితే సెలవుపెట్టి అమెరికా లాంటి దేశాల్లో సాఫ్ట్‌వేర్‌రంగంలో ఉన్నారు. ఇలాంటి సిబ్బందిని వినియోగించుకోవడంలో గత సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం ఆయా రంగాల వారీగా నైపుణ్యం ఉన్నవారిని గుర్తించి వినియోగించుకుంటే మరింత ఉపయోగం ఉంటుంది. లైన్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న సిబ్బందిని ఆయా శాఖల పరిధిలోనే విస్తృతంగా వినియోగించుకుంటూ సచివాలయ కేంద్రంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. లక్షకు పైగా ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసుకుని, సచివాలయాలను గాడిలో పెట్టాలని కోరుతున్నారు.కొన్ని వార్డుల్లో అయితే ఐదు సచివాలయాలు ఉన్నాయి. అక్కడ ఇన్ని అవసరం ఉండదు. సచివాలయాలను మరోసారి డీలిమిటేషన్ చేయాల్సిన అవసరముంది.

చాలా చోట్ల సిబ్బంది కొరత

చాలా చోట్ల సచివాలయాల్లో సిబ్బంది కొరత ఉంది. కొన్ని చోట్ల మాత్రం ఎక్కువగా ఉన్నారు. మరికొన్ని చోట్ల అయితే అవసరం లేకపోయినా కేటాయించారు.మచ్చుకుకొన్నిజిల్లాల్ని పరిశీలిస్తే..

- అనకాపల్లి జిల్లాలో 522 సచివాలయాలు ఉన్నాయి. అన్ని శాఖల్లో కలిపి మొత్తం 3,831 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇంకా 2,433 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- శ్రీసత్యసాయి జిల్లాలో 544 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా...3,855మంది పని చేస్తున్నారు. 2005 మంది సిబ్బంది కొరత ఉంది.
- ఏలూరుజిల్లా ముదినేపల్లి మండలంలోని సచివాలయ సిబ్బందిలో దాదాపు 40 శాతం మంది గత బదిలీల్లో కృష్ణా జిల్లాకు వెళ్లిపోయారు. వారిస్థానాల్లో ఎవరినీ భర్తీచేయలేదు.
- శ్రీకాకుళం జిల్లాలో 732 సచివాలయాలకు గాను 7,200మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా,6,416మంది విధులు నిర్వహిస్తున్నారు.
- కాకినాడజిల్లాలో 620సచివాలయాలు ఉండగా మొత్తం 5,200మంది ఉద్యోగులను నియమించారు. 1035పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

తిరుమల లడ్డూ మిఠాయి కాదు

అది హిందువుల ఉమ్మడి భావోద్వేగం

- సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాలి
- 'ఎక్స్'లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోస్టు



అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తులకు లడ్డూ ప్రసాదం కేవలం మిఠాయి కాదని, అది హిందువుల ఉమ్మడి భావోద్వేగమని, వారి విశ్వాసానికి ప్రతీకని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అందరి నమ్మకానికి, గాఢమైన భక్తికి ప్రతిబింబం కాబట్టే దాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరికీ పంచుతామని గుర్తుచేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. గత ప్రభుత్వంలో టీటీడీ బోర్డు వైఫల్యాలు, అనైతిక చర్యలు తిరుమల పవిత్రతను తీవ్రంగా దెబ్బతీశాయని, భక్తుల హృదయాలను కలచివేశాయని ఆరోపించారు. నాటి చర్యలు టీటీడీకి ఒక గుణపాఠంగా మిగిలిపోతాయని పేర్కొన్నారు. తిరుమల పవిత్రతను పునరుద్ధరించడానికి, లక్షలాది మంది భక్తుల విశ్వాసాన్ని తిరిగి పొందడానికి టీటీడీ నిరంతరం కృషి చేయాలని కోరారు. టీటీడీ బోర్డు, ఆలయ అధికారులు, ఈవో, జేఈవో నుంచి ఉద్యోగులు, కాంట్రాక్టర్ల వరకూ.. వారి పాత్ర కేవలం పదవికి, హోదాకు పరిమితం కాదని, సనాతన ధర్మాన్ని పాటించే లక్షలాది మంది భక్తులకు సేవ చేయడానికి లభించిన పవిత్ర అవకాశమని వివరించారు. ఇకపై టీటీడీకి సంబంధించిన ఆర్థిక నివేదికలు, నాణ్యత నియంత్రణ, ఆడిట్‌ల నుంచి ఆస్తి, విరాళాల నిర్వహణ వరకూ కార్యకలాపాలన్నీ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, అన్ని వివరాలను బహిరంగంగా అందుబాటులో ఉంచాలని కోరారు. సనాతన ధర్మాన్ని అత్యంత పురాతనమైన, నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికతల్లో ఒకటిగా అభివర్ణించారు. అన్ని వర్గాల సమ్మతితో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందని పవన్ స్పష్టం చేశారు.

కల్తీగాళ్లను వెనకేసుకొస్తున్న వైసీపీ: పంచుమర్తి



అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జగన్‌పై 31 క్రిమినల్ కేసులు ఉన్నాయని, 16 నెలలు జైలు శిక్ష అనుభవించి 16 ఏళ్లుగా బెయిల్‌పై తిరుగుతున్నారని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల నమ్మకంపై వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి ప్రదర్శించిందని ఆరోపించారు. వేంకటేశ్వరస్వామిపై ఏమాత్రం నమ్మకం లేని వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులను టీటీడీ చైర్మన్లుగా నియమించి, తిరుమలను అపవిత్రం చేశారన్నారు.

హాయ్‌ల్యాండ్‌కు గ్రూప్-1 పత్రాల తరలింపుపై రికార్డుల్లేవ్!

- ఎవరి నిర్ణయంతో తరలించారో కూడా తెలీదు
- హైకోర్టుకు అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి వెల్లడి

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాలు హాయ్‌ల్యాండ్‌కు తరలింపు నిర్ణయానికి సంబంధించి కమిషన్ వద్ద ఎలాంటి రికార్డులు లేవని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ మంగళవారం హైకోర్టుకు నివేదించారు. జవాబుపత్రాలను హాయ్‌ల్యాండ్‌కు తరలించాలని ఎవరు నిర్ణయం తీసుకున్నారనే విషయంపై కూడా ఎలాంటి వివరాలు లేవన్నారు. ఏపీపీఎస్సీ వద్ద ఉన్న రికార్డులను పరిశీలిస్తే జవాబుపత్రాలను 2021, డిసెంబరు 5న హాయ్‌ల్యాండ్‌కు తరలించారని, అక్కడ నుంచి తిరిగి 2022, ఫిబ్రవరి 26న ఏపీపీఎస్సీ కార్యాలయానికి తీసుకొచ్చారని వివరించారు. సొమ్ము చెల్లింపులకు సంబంధించి పలు చెక్కుల జిరాక్స్ కాపీలు ఉన్నాయని, ఆ సొమ్మును దేనికి ఖర్చు చేశారనే వివరాలు అందుబాటులో లేవన్నారు. 2022, మార్చి నుంచి మే వరకు 2 ప్రభుత్వ కళాశాలల వేదికగా జరిగిన మాన్యువల్ మూల్యాంకనం కోసం అదనంగా బార్‌కోడ్లు, ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్స్‌ను ప్రింట్ చేయించారని తెలిపారు. అన్ని వివరాలను సీల్డ్ కవర్‌లో అదనపు అఫిడవిట్ రూపంలో కోర్టు ముందు ఉంచామన్నారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా జవాబుపత్రాలను సీల్డ్ కవర్‌లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అప్పగించామని చెప్పారు. ఈ వివరాలను పరిశీలించిన ధర్మాసనం అదనపు అఫిడవిట్ దాఖలులో చట్టం నిర్దేశించిన విధానాన్ని అనుసరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. స్వీయ ప్రమాణపత్రం జత చేయలేదని అభ్యంతరం వ్యక్తం చేసింది. అదనపు అఫిడవిట్‌ను ఏపీపీఎస్సీ సెక్రెటరీ కాకుండా మరో అధికారి దాఖలు చేయడం ఏంటని ప్రశ్నించింది. ఇకనైనా పారదర్శకంగా వ్యవహరించాలని, ఏదైనా తప్పు జరిగితే అధికారులపై సుమోటోగా కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. పూర్తి వివరాలతో సమగ్ర అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది.

ఏం జరిగిందంటే..

2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని గతంలో ఏకసభ్య ధర్మాసనం నిర్ధారించింది. ఈ నేపథ్యంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో అర్హులుగా పేర్కొంటూ 2022, మే 26న ఏపీపీఎస్సీ ఇచ్చిన జాబితాను రద్దు చేసింది. తాజాగా మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని ఎంపిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేయాలని ఆదేశిస్తూ 2024, మార్చి 13న న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై ఇటీవల తుది విచారణ జరిపిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అయితే, తీర్పు ప్రతి సిద్ధం చేస్తుండగా 2022, జూన్ 24న హైకోర్టు డివిజనల్ బెంచ్ ఉత్తర్వుల అమలులో లోపాలను గుర్తించిన ధర్మాసనం వాటిని నివృత్తి చేసుకొనేందుకు ఇటీవల అప్పీళ్లపై మరోసారి విచారణ ప్రారంభించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.